ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కడప

fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-2-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 12 పేజీలు: 10+4 వెల: 6.50

భారత మాతను అమ్మేశారు!
జనగణమనకు ముందే వందేమాతరం ఆలాపన
5లో


బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్

## పునరుద్ధరణ నుంచి..
# ప్రగతి పథంవైపు

### జీరో పేదరికం లక్ష్యంగా పాలన
### యేడాదికి రూ.33వేల కోట్లతో సంక్షేమ పథకాలు
### 63.12 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు
### 66 లక్షల మందికి పైగా విద్యార్థులకు సాయం
### 'అన్నదాత సుఖీభవ' ద్వారా 46.86 లక్షలమంది రైతులకు లబ్ధి
### అసెంబ్లీ ఉభయ సభల ప్రసంగంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

**విజయవాడ,ఫిబ్రవరి 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కూటమి ప్రభుత్వం 19 నెలలుగా పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి పథం వైపు పయనిస్తోందని గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. విద్యా,వైద్య.సాంకేతికరంగాల్లో తమ ప్రభుత్వం అనుహ్య ఫలితాలు సాధించిందన్నారు. రూ.13.25 లక్షల కోట్లు పెట్టుబడుల కోసం 610 ఒప్పందాలపై సంతకాలు జరిగాయన్నారు. సీఐఐ సదస్సులో పెట్టుబడుల ద్వారా 16.13 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది. నిరంతర అధిక వృద్ధిరేటుపై దృష్టి సారించాం. దీర్ఘకాలిక లక్ష్యాలు స్థిరంగా ఉన్నా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా సవరణలు చేసుకుంటున్నాం. మంత్రులు, >>2


బుధవారం గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ప్రసంగ పాఠం చదువుతున్న సిఎం చంద్రబాబు

## 14న బడ్జెట్
### మార్చి 7వరకు అసెంబ్లీ
### బిఎసి సమావేశంలో నిర్ణయం

**సచివాలయం,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగం అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ బిజినెస్ అడ్వైజరీ (బిఏసి)బుధవారం శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనే సభ ఎన్ని రోజులు నిర్వహించాలి. బడ్జెట్ ఎప్పుడు ప్రవేశపెట్టాలి. ప్రభుత్వ వ్యవహారాలు అనే అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. మార్చి 7వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయి. >>2



# 11.. 11..11
### వారు 11 మంది, తేదీ 11.. సభలో ఉన్నది 11 నిముషాలే
### వైకాపా సభ్యులపై చలోక్తిగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విజయవాడ.ఫిబ్రవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం కొనసాగుతుండగా వైసిపి సభ్యులు వాకౌట్ చేసారు. 11వ తేదీ, 11 మంది, 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారుగా అని వైఎస్సార్సీపీ సభ్యులను ఉద్దేశించి స్పీకర్ అయ్యన్నపాత్రుడు చలోక్తిగా అన్నారు. అసెంబ్లీలో ఇరు సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం ముగిసిన అనంతరం అసెంబ్లీ లాబీలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు నవ్వుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 11వ తేదీన 11 మంది 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారుగా. అంతకుమించి ఎక్కువ సమయం లేరుగా? అని వ్యాఖ్యానించారు. సభ్యులు సభా సంప్రదాయాలు పాటిస్తే మంచిదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. అసెంబ్లీకి సభ్యుల హాజరుపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏపీ అసెంబ్లీ సభ్యులకు డిజిటల్ హాజరు తప్పనిసరి అని స్పీకర్ ఆదేశించారు. దాగుడు మూతలు ఇక కుదరవని, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టంచేశారు. అంతేకాకుండా ఫేషియల్ రికగ్నిషన్‌తో అటెండెన్స్ రికార్డు >>2

## రైల్వే ప్రాజెక్టుల కోసం
# రూ.8వేల కోట్లు
### తెలుగు రాష్ట్రాల మీదుగా 3 హైస్పీడ్ కారిడార్లు

**విజయవాడ,ఫిబ్రవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని రైల్వేప్రాజెక్టుల కోసం కేంద్రం రూ.8 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా ఏడు హైస్పీడ్ రైళ్ల కారిడార్ ప్రతిపాదనను బడ్జెట్‌లో ప్రవేశపెట్టింది. తెలుగు రాష్ట్రాల మీదు మూడు కారిడార్లు ప్రకటించింది. ఇక హైదరాబాద్ టూ బెంగళూరు, హైదరాబాద్ టూ చెన్నై, చెన్నై బెంగళూరు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్లనున్నాయి. బెంగళూరు, చెన్నై వెళ్లే కారిడార్లు అమరావతి మీదుగా వెళ్లనుండగా చెన్నైబెంగళూరు హైస్పీడ్ కారిడార్ చిత్తూరు మీదుగా వెళ్లనుంది. ఈహైస్పీడ్ రైల్ కారిడార్ల రాకతో భవిష్యత్తుల్లో ఏపీ రూపులేఖలు మారనున్నాయి. రాష్ట్ర రాజధాని అమరావతికి కనెక్టివిటీ మరింత పెరగనుంది. ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు మరో కీలక ప్రతిపాదన చేశారు. బెంగళూరు-చెన్నై హైస్పీడ్ కారిడార్‌కు సంబంధించి చిత్తూరు-తిరుపతి మధ్య 75 కిలోమీటర్ల వ్యూహాత్మక కనెక్టివిటీ ఇవ్వాలని సూచించారు. **చిత్తూరు మీదుగా బుల్లెట్ ట్రైన్:** చిత్తూరు- తిరుపతి మధ్య కనెక్టివిటీ ఇస్తే అది బెంగళూరుఅమరావతి కారిడార్‌కు ఎంతో మేలు చేస్తుందని ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జన రల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు చంద్రబాబు సూచించారు. దీని వల్ల అమ రావతి, బెంగళూరు మధ్య కనెక్టివిటీ ఏర్పడుతుందన్నారు. దీని వల్ల బెంగళూరు అమరావతి మధ్య బుల్లెట్ రైలు అందుబాటులోకి వచ్చే అవకాశముంటుంది. చంద్రబాబు ప్రతిపాదనకు కేంద్రం కూడా ఓకే చెప్పే అవకాశముందని తెలుస్తోంది. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళ్లనుంది. దీంతో హైదరాబాద్ నుంచి అమరావతికి గంట లోపే చేరుకోవచ్చు. ఇక చెన్నైకు 2.55 గంటల్లోనే చేరుకోవచ్చు. ఇక హైదరాబాద్ బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్ కూడా ఏపీ మీదుగా వెళ్లనుంది. దీని వల్ల హైదరాబాద్ నుంచి బెం గళూరు మధ్య 2గంటల్లోనే ప్రయాణాలు చేయవచ్చు. దీని వల్ల బెంగళూరు నుంచి చెన్నైకు 1.13 గంటల్లో చేరుకునే అవకాశం లభిస్తుంది. ఈ కారిడార్లు పూర్తయితే ఆయా ప్రాంతాల మధ్య బుల్లెట్ రైళ్లను తీసుకొస్తారు.





## గ్రూప్-1 మూల్యాంకనంలో
# అక్రమాలపై సిట్
### హైకోర్టు ఆదేశం

**విజయవాడ,ఫిబ్రవరి 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీపీఎస్సీ గ్రూప్1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై రాష్ట్ర హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మూల్యాంకనంలో చోటు చేసుకున్న అక్రమాలను నిగ్గు తేల్చేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) ఏర్పాటుకు ధర్మాసనం ఆదేశించింది. అడిషనల్ డీజీ స్థాయి అధికారితో సిట్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోవాలని స్పష్టీకరించింది. ఎంపికైన అభ్యర్థుల జవాబు పత్రాలు భద్రంగా ఉన్నాయా? లేదా? వాటిని ఎవరైనా ట్యాంపర్ చేశారా? అనేది ఫోరెన్సిక్ నిపుణులతో పరిశీలించాలని న్యాయస్థానం సూచించింది. విజయ వాడలో జరిగిన మూల్యాంకనం సమయంలో ఉపయోగించిన బార్ కోడ్ >>2



## అంబటి మెడకు బిగిసిన మరో ఉచ్చు
### బెయిలుపై విడుదల కాకుండానే లక్కీడ్రా కేసులో పిటి వారంట్

**విజయవాడ,ఫిబ్రవరి 11,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి రాంబాబుకు కోర్టులో ఊరట లభించిన కొద్ది గంటల్లోనే మళ్ళీ చిక్కులు మొదలయ్యాయి. ముఖ్యమంత్రిని దూషించిన కేసులో సోమవారం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసుల్లో ఆయనకు బుధవారం సాయంత్రం బెయిల్ మంజూరైంది. అయితే, ఆయన జైలు నుంచి విడుదల కాకుండానే సత్తెనపల్లి పోలీసులు గుంటూరు సబ్ కోర్టులో మరో పీటీ వారెంట్ దాఖలు చేశారు. 2023 నాటి సంక్రాంతి లక్కీ డ్రా అవినీతి కేసులో ఆయనను విచారించాల్సి ఉందని పోలీసులు పేర్కొనడంతో ఆయన విడుదలపై సందిగ్ధత నెలకొంది. 2023 సంక్రాంతి పండుగ సందర్భంగా సత్తెనపల్లిలో వైఎస్సార్ సంక్రాంతి సంబరాల పేరుతో అంబటి రాంబాబు >>2

# 'భూముల'బిల్లుకు కేబినెట్ ఓకే



### సిఎం చంద్రబాబు అధ్యక్షతన భేటీ
### 24 కీలక అంశాలకు ఆమోదం
### సచివాలయం పేర్లు స్వర్ణగ్రామం, స్వర్ణవార్డులుగా మార్పు
### మంత్రులు బాధ్యతగా మాట్లాడాలని సలహా

**విజయవాడ,ఫిబ్రవరి11, ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరుగుతున్న మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. నీటిపారుదలశాఖలోని 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం తెలిపారు. భూములు బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు క్యాబినెట్ లో ఆమోదం లభించింది. గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో 1000 చ.గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో 6 నెలలు పొడిగిస్తూ అనుమతించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములలో నివాసాలు ఏర్పరుచుకున్న అనధికార ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును జూలై 30వరకు అనుమతికి క్యాబినెట్ ఆమోదించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కీసరపల్లి గ్రామంలోని సర్వే నెం.29/8లోని 3.84 ఎకరాల భూమిని "కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ కార్యాలయం, నివాస గృహాల నిర్మాణం" కోసం ఉపయోగించేందుకు అనుగుణంగా గతంలో ఇచ్చిన జీవోలో మార్పు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో 45.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ ఆర్ ఈడీసీఏపీకి కాంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన కోసం కేటాయించే ప్రతిపాదనకు ఆమోదించనుంది. నంద్యాల జిల్లా సంజామల మండలం నోస్సం గ్రామంలో 1500 ఎకరాలు భూమిని 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కోసం ఎన్ఆర్ఈడీసీఏపీకి కేటాయించేందుకు క్యాబినెట్ ఓకే చెప్పింది. విశాఖపట్నం ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలో 18.57 ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయింపుపై మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో ఏపీఎస్‌డీసీ కోసం డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలపనుంది. డీఎస్‌డబ్ల్యూఎస్ (సవరణ) బిల్లు 2026ను శాసనసభలో ప్రవేశపెట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. అమరావతి మెరినా అభివృద్ధికి (పీపీపీ మోడల్) 33 సంవత్సరాల లీజు ప్రాతిపదికన, టెండర్లకు ఆహ్వానించింది. పీఎంఏవై గ్రామీణ్ 2.0లో యూనిట్‌ఖర్చు రూ.2 లక్షల 39 వేలుగా నిర్ణయించి క్యాబినెట్ అంగీకారం తెలిపింది. రామాయపట్నం పోర్ట్‌అభివృద్ధి కార్పొరేషన్ రుణ పునర్వినియోగం, రాష్ట్ర హామీ, కంఫర్ట్‌లెటర్ జారీ తదితరఅంశాలపై మంత్రివర్గం >>2


బుధవారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

## నలుగురు మంత్రులకు మావోయిస్టుల పేరిట బెదరింపు లేఖలు

**విజయవాడ ఫిబ్రవరి 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో నలుగురు మంత్రులకు బెదిరింపు లేఖలు వచ్చాయి. ఈ మేరకు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తనతో పాటు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్‌కు మావోయిస్టుల పేరుతో పోస్ట్ ద్వారా ఈ లేఖలు వచ్చినట్లు చెప్పారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. మావోయిస్టుల పేరిట వచ్చిన ఈ లేఖలు చూసి కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. >>2

## శ్రీకాళహస్తికి కూడా
# కల్తీ నెయ్యి సరఫరా
### 'సిట్' నివేదికలో వెల్లడి
### సుమతి ట్రేడర్స్, వినాయక ఏజెన్సీ నుంచి సరఫరా
### ఆనాడే బహిర్గతం చేసిన 'వార్త'



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం, కాణిపాకం,ద్వారకా తిరుమల ఆలయాలకు సంబధించి 2022-2024లో సరఫరా చేసిన నెయ్యి కల్తీ అని 'సిట్' నివేదిక సమర్పించింది. తిరుమల నెయ్యి వ్యవహారం వివాదాస్పదంగా సాగుతుండగా సిట్ సమర్పించిన నివేదికలో తిరుమలకే కాదు శ్రీకాళహస్తి ఆలయానికి సరఫరా చేసిన నెయ్యి కూడా కల్తీ అని తేల్చారు. ఈ నెయ్యి సరఫరా చేసింది. సుమతి ట్రేడర్స్, వినాయక ఏజెన్సిలని తేల్చారు. అయితే కాంట్రాక్టర్లు ముందే సమాచారం తెలుసుకున్నట్లు ఉంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రస్తుతం దేవస్థానంకు ఎస్ఎస్ఎన్ఆర్ పేరుతో సరకులతో పాటు, నెయ్యి సరఫరా చేస్తున్నారు.

**సిట్ నివేదికలో ఏముందంటే :** కల్తి నెయ్యికి సంబంధించి సిట్ అందించిన నివేదికలో ఇలా పేర్కొన్నారు. 2023'24లో నెయ్యి సరఫరాకు సంబంధించి అప్పటి శ్రీకాళహస్తి,కాణిపాకం ఆలయాల ఇఓలు టెండర్లు పిలవగా దేవాదాయశాఖ నిబంధనలతో 'సుమతి ట్రేడర్స్ దక్కించుకుంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి నెయ్యి కిలో రూ.573లతో వైష్ణవి, భోలేబాబా ఆర్గానిక తిరుమల, విజయ, నందిని, >>2

# ప్రత్యర్థుల పన్నాగాలను తిప్పి కొట్టాలి
### ఎన్డీయె శాసనసభా పక్ష సమావేశంలో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

**విజయవాడ,ఫిబ్రవరి 11,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రత్యర్థుల పన్నాగాలను కూటమి పక్షాలు సంఘటితంగా తిప్పి కొట్టాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో శాసనసభ్యులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. సభలో ఆవు కథలు చెప్పడం మానేసి, విషయ అవగాహనతో రావాలని నిర్దేశించారు. ఎవరేం మాట్లాడుతున్నారో అన్నీ నమోదు చేసుకుంటానని చెప్పారు. 3 నుంచి 7నిమిషాల్లో స్పష్టంగా విషయం చెప్పాలని మార్గనిర్దేశం చేశారు. తనకు క్వాంటం పరిజ్ఞానం లేకపోయినా, దాని ప్రయోజనాలు బాగా తెలుసన్నారు. సాంకేతికత మార్పులను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని సభ్యులకు సూచించారు. రాష్ట్రంలో 1.60 లక్షల మంది క్వాంటం కోర్సులకు దరఖాస్తు చేసుకోవడం కొత్త టెక్నాలజీపై యువత ఆసక్తికి నిదర్శనమన్నారు. మద్రాస్ ఐఐటీలో క్వాంటం కోర్సుకు 2.5 లక్షల మంది దరఖాస్తులు వస్తే అందులో లక్షా 10 వేల మనవాళ్లవే ఉన్నట్లు గుర్తుచేశారు.

**రూ.54 కోట్ల లాభల్లోకి రావడం శుభపరిణామం :** రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చాక లక్ష కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల పనులు, రూ.90 వేల కోట్ల రైల్వే పనులు జరుగుతున్నట్లు వివరించారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలన్నింటినీ రాష్ట్రం అందిపుచ్చుకోవాలన్నారు. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.450 కోట్ల నష్టంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ అన్నింటినీ అధిగమించి రూ.54 కోట్ల లాభల్లోకి రావడం శుభపరిణామం అన్నారు. అన్నిమతాలను గౌరవించాలని, ఎవరి విశ్వాసాలను దెబ్బతీయకూడదని సీఎం స్పష్టంచేశారు. జగన్ కు మతాలపై గౌరవం లేనందునే వైఎస్సార్సీపీ హయాంలో రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగిన విషయం ప్రస్తావించారు. తిరుమల సహా వీలైన ప్రతి ఆలయంలో ప్రసాదాలను కల్తీ చేశారని మండిపడ్డారు.

**ప్రతి ఒక్కరూ నిబద్ధతో లేకపోతే ఫలితాలు రావు:** విశ్వాసం పెంచుకుని శాశ్వతంగా రాజకీయాల్లో ఉండేలా కూటమి ఎమ్మెల్యేలు మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. మనం పూర్తిగా కోలుకున్నాం అనుకోవద్దు. కానీ వ్యవస్థలను గాడిన పెట్టామని తెలిపారు. దీన్ని అంతా సానుకూలంగా తీసుకుని కష్టపడి పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో పెండింగ్ పనులు గుర్తించి తనకు ఇస్తే ప్రాధాన్యతా క్రమంలో పూర్తి >>2

## అగ్నిమాపక సేవల ఆధునీకరణకు
# రూ.5వేల కోట్లు
### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్

**విజయవాడ. ఫిబ్రవరి 11, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాలలో అగ్నిమాపక సేవల విస్తరణ మరియు ఆధునికరణ అవసరాన్ని గుర్తించి 15వ ఆర్థిక సంఘం 5 వేల కోట్ల కేటాయింపులకు సిఫార్సు చేసినట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ వెల్లడించారు. దేశంలో అగ్ని ప్రమాదాలు, వాటి నివారణకు ఏర్పరచిన అగ్నిమాపక భద్రత నిబంధనలపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు మంగళవారం లోక్ సభలో కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన వివరాల ప్రకారం నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో అండ్ రూపొందించిన డేటా ప్రకారం 2023 ఒక్క ఏడాదిలోనే హైదరాబాదులోనే దేశంలో మొత్తం 7,054 అగ్నిప్రమాదాలు నమోదవ్వగా 6,891 మంది మరణించారు, 284 మంది గాయ పడ్డారు. అయితే, అగ్నిప్రమాదాల నివారణ, భద్రతాచార్యలు అనేవి పూర్తిగా రాష్ట్రాలకు >>2

# పునరుద్ధరణ నుంచి..ప్రగతి పథంవైపు

>> కార్యదర్శులు, కలెక్టర్లతో తరచూ సమావేశాలు జరుపుతున్నాం. క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాల్లో ఏపీ క్రమంగా అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ సంస్థలు, ప్రతిభావంతులకు రాష్ట్రం నెలవుగా నిలుస్తోంది. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తూ గత చేదు అనుభవాలతో విసిగి వేశారిన ఏపీ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగునీటిపారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవి చూశాయన్నారు. సూపర్6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.?స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుతోందని తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల చొప్పున 46.86 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. దీపం 2.0 పథకం ద్వారా 1.08 కోట్ల మంది పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు.

**2019నుంచి అభివృద్ధికి విఘాతం:** రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలు చవిచూశాయి. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి నాటి ప్రభుత్వం కృషి చేసింది. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు ఈ పురోగతికి విఘాతం కలిగించింది. తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్ర అభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది, వ్యవస్థలు విధ్వంసమయ్యాయి, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించి అరాచకత్వం ప్రబలింది. గత ప్రభుత్వంలో సెక్షన్ 22ఏ దుర్వినియోగం ద్వారా ఏకపక్ష ఆంక్షలు విధించారు" అని గవర్నర్ అన్నారు. ప్రజా సంక్షేమం అనే కోణంలోనే.. ప్రభుత్వం ప్రతీ నిర్ణయాన్ని తీసుకుంటోందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలు చవిచూశాయని గుర్తు చేసారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి నాటి ప్రభుత్వం కృషి చేసిందని వివరించారు. ఏడాదికి రూ.33వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా ఇతర డీబీటీ



బుధవారం శాసనసభలో డిసి ఎం పవన్, మంత్రి పయ్యావుల కేశవ్

కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. 63.12 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రయోజనం చేకూరుతోందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను.. సాధించిన విజయాలను గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఖిసూపర్ సిక్స్ఖి హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించామని, క్రమంగా పాలనను పునరుజ్జీవనం నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లామని గవర్నర్ తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనే జాతీయ ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రాన్ని ఖిసంపన్న, ఆరోగ్యకరమైన, సంతోషకరమైనఖిదిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పరివర్తన యజ్ఞంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. మన బలంపై విశ్వాసంతో, ఐక్య లక్ష్యంతో ఏపీ ముందుకు సాగుతోందని, ప్రతి పౌరుడూ గౌరవంగా, అవకాశాలతో జీవించే భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**పోలవరం ప్రాజెక్ట్ వేగవంతం:** రాష్ట్ర నీటిపారుదల వ్యవస్థకు వెన్నెముక వంటి పోలవరం ప్రాజెక్టును 2027, జూన్ లోపు పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం దీనికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని గవర్నర్ తెలిపారు. దీనిని ఆధారంగా చేసుకొని, కరువు పీడిత ప్రాంతాలకు త్వరితగతిన జలాలను అందించాలని హంద్రీనీవా సుజల స్రవంతిఖి పనులను వేగవంతం చేసినట్లు వివరించారు. గోదావరి జలాలను పోలవరం నుంచి వంశధార, ఆపై దక్షిణ నదీ వ్యవస్థలకు అనుసంధానించడానికి నల్లమల సాగర్ఖి సహా నదుల అనుసంధాన కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. "విధానాలు, వ్యవస్థలు, వ్యయప్రాధాన్యతలలో కీలక సవరణలు చేశాం. దీర్ఘకాలిక దార్శనికతతో కూడిన పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించాం. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే లక్ష్యంగా సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి 10 సూత్రాలు రూపొందించాం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశించిందని వివరించారు. 2047 నాటికి రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, రూ.55 లక్షల తలసరి ఆదాయం సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుంది" అని తెలిపారు.

**స్వర్ణాంధ్ర విజన్ 2047తో ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది:** "అసతోమా సద్గమయా!, తమసోమా జ్యోతిర్గమయా !. మృత్యోర్మా అమృతంగమయా ! అన్నది లోకోక్తిగా తీసుకుంటే గత తప్పిదాలను సరిదిద్దుకునే స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నామన్నారు.అభివృద్ధితో సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ 10 సూత్రాలు అమలు చేస్తున్నామన్నారు.అమరావతి భవిష్యత్తును నాశనం చేసే ఉద్దేశంతో గత ప్రభుత్వం 3 రాజధానుల ప్రతిపాదనను శ్వేతపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ఎండగట్టిందని గవర్నర్ అన్నారు. "మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. శాంతిభద్రతల పరిరక్షణకు 5,757 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. పేదరికం లేని సమాజం కోసం పీ4 విధానం తీసుకొచ్చి లక్ష మందికి పైగా మార్గదర్శులు 10.30 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నాం. స్వర్ణాంధ్ర విజన్ 2047 కింద అందరికీ ఇళ్లు ఉండాలని సంకల్పించాం. మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చే దిశగా గణనీయ పురోగతి సాధించాం. ఏపీ ప్రభుత్వం సమగ్ర జనాభా నిర్వహణ విధానం ప్రవేశపెట్టిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వెల్లడించారు. దీర్ఘకాలిక స్థిరత్వాన్ని నిర్ధారింపచేస్తూ ఈ దార్శనికతను ఆచరణలో పెడుతున్నామన్నారు.

**25 కంటే ఎక్కువ నూతన విధానాలు**

"క్వాంటం టెక్నాలజీ ద్వారా అమరావతి గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు సంకల్పించింది. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నియంత్రణపై చట్టపరమైన విధివిధానాలు పరిశీలిస్తున్నాం. ఏపీ జీఎస్‌డీపీ రూ.15.91 లక్ష కోట్ల నుంచి రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. దాదాపు 10.75 శాతం నామమాత్రపు వృద్ధి నమోదు చేసింది. 2027 గోదావరి పుష్కరాల కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం 25 కంటే ఎక్కువ నూతన విధానాలను ఆవిష్కరించింది. ట్రూడౌన్ విధానం ఫలితంగా యూనిట్‌కు 13 పైసల విద్యుత్ ఛార్జీ తగ్గింది" అని అన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం సభ రేపటికి వాయిదా పడింది.

ఇక సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీకి వచ్చిన ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు ఘనస్వాగతం లభించింది.సీఎం చంద్రబాబునాయుడు, డీసీఎం పవన్ కల్యాణ్,మంత్రి లోకేష్ ఆయన పుష్పగుచ్ఛాలు అందజేసారు. శాసనసభ స్పీకరు అయ్యన్న పాత్రులు, శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజులు ఆయన సాదారంగా సభలోకి తీసుకుని వెళ్ళారు. పోడియంపై ఆశీస్సులను చేసారు.అసెంబ్లీ లాబీలో డీసీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు పరస్పరం ఆలింగనం చేస్తున్నారు.సభలో పక్కపక్కనే ఉన్న సీఎం చంద్రబాబు,డీసీఎం పవన్ కల్యాణ్ పలు అంశాలపై మాట్లాడుకున్నారు.తరువాత పవన్ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ పక్కకు వెళ్ళి కూర్చున్నారు.గవర్నర్ ప్రసంగాన్ని వారు ఆద్యంతం శ్రద్ధగా విన్నారు.

## అసెంబ్లీలో కొద్దిసేపు ఉద్రిక్తత

### ప్రధాన ప్రతిపక్ష హోదా కోసం డిమాండ్ చేస్తూ వైసిపి సభ్యుల నిరసన, వాకౌట్

**విజయవాడ.ఫిబ్రవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు బుధవారం ఉద్రిక్తత నెలకొంది. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం ప్రారంభం కాగానే వైసిపి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. ఎపిలో శాంతిభద్రతలు కాపాడాలని నినాదాలు చేశారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభ్యుల హక్కులను కాపాడాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్లు చేశారు. వైసిపి సభ్యుల ఆందోళన, నినాదాల మధ్యే గవర్నర్ ప్రసంగం కొనసాగింది. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ఈనెల 14 న బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. నెలరోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఏపీ అసెంబ్లీ సమావేశాలు మొదలైన కాసేపటికే వైఎస్సార్ సీపీ సభ్యులు సభ లేచి నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.వారిని సమన్వయం పాటించాలని స్పీకరు అయ్యన్న పాత్రుడు కోరారు. ఈ క్రమంలో వారు సభను నుంచి వెళ్లిపోయారు. పభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. వైఎస్సార్ సీపీ చాంబర్ నుంచి సభకు వచ్చిన మాజీ సీఎం జగన్ పార్టీ సభ్యులతో కలిసి మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలని నినాదాలు చేసుకుంటూ అసెంబ్లీలోకి వచ్చిన వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కొంత సమయానికే సభ వాకౌట్ చేశారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఎంఎల్‌సీ దువ్వాడ

**విజయవాడ, ఫిబ్రవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైఎస్సార్సీపీ బహిష్కృత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ భవిష్యత్ రాజకీయంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆయన బుధవారం ఉన్నట్లుండి అసెంబ్లీ కు హాజరై.. పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను కలిశారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు గవర్నర్ ప్రసంగానికి హాజరైన జగన్, వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనంతరం బయటికి వచ్చేశారు. ఆ సమయంలోనే లాబీల్లో జగన్.. దువ్వాడను పిలిపించారు. దీంతో దువ్వాడ జగన్ కాళ్లకు మొక్కారు. వీరిద్దరూ అలా మాట్లాడుకుంటూనే అసెంబ్లీ బయటికి వచ్చేశారు. ఈ సందర్భంగా జగన్ దువ్వాడ మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. ఏం చేద్దామనుకుంటున్నావ్ శ్రీనివాస్ అంటూ జగన్ ఆప్యాయంగా దువ్వాడను అడిగారు. దీనికి సమాధానంగా తమ జిల్లాలో ధర్మాన సోదరులతో ఉన్న వివాదాలను ప్రస్తావించారు. వారి వల్లే తనను సస్పెండ్ చేసినట్లు గుర్తుచేశారు. ఇందులో తన తప్పేమీ లేదన్నారు. దీంతో కాసేపు వాటిని విన్న జగన్.. ఆ తర్వాత తనను వచ్చి కలవాలని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.అసెంబ్లీ బయట దువ్వాడ శ్రీనివాస్ మీడియా ప్రతినిధులతో కాసేపు చిట్ చాట్ చేశారు. ఇందులో జగన్ తిరిగి పార్టీలోకి తీసుకుని వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వకపోతే, స్వతంత్రంగానే పోటీ చేసి తన బలం చూపిస్తానని వెల్లడించారు. అప్పటివరకూ మండలిలో తన వాణి వినిపిస్తానన్నారు. త్వరలో పార్టీ అధినేత జగన్‌ను కలిసి అన్ని విషయాలు వివరిస్తానని దువ్వాడ చెప్పుకొచ్చారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో తాను భక్తుడివైపే మాట్లాడతానని చెప్పారు. అలాగే మెడికల్ కాలేజీల్ని పీపీపీ విధానంలో నిర్మించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

## అగ్నిమాపక సేవల ఆధునీకరణకు 5వేల కోట్లు

>> సంబంధించిన అంశం అని, విధానపరమైన విషయాలలో సలహాలు, మద్దతు ఇవ్వడం వరకే కేంద్ర ప్రభుత్వం పాత్ర పోషిస్తుందని అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తుగా తీసుకుంటున్న చర్యలు, ముఖ్యంగా ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాలు, పారిశ్రామిక యూనిట్లలో అగ్నిమాపక భద్రత నిబంధనలపై జరిగిన సమీక్ష వివరాలు కోరుతూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రత్యేకంగా అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి వివరంగా సమాధానం ఇచ్చారు.

## ప్రత్యర్థుల పన్నాగాలను తిప్పి కొట్టాలి

>> చేద్దామని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతో లేకపోతే ఫలితాలు రావని అన్నారు. నాడు ఎన్నికల్లో చెప్పిన అన్ని పథకాలు ఇస్తున్నామంటే కేంద్రం ఎంతో సహకారం అందిస్తోందని అన్నారు. కేంద్రం అమరావతి, పోలవరానికి నిధులు ఇవ్వకపోయి ఉంటే నేడు ఈ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యేవి కాదని తెలిపారు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకిత చేస్తున్నామంటే కారణం కేంద్ర సాయమేనన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర సాయంతో నిలబెట్టామన్నారు. కేంద్ర సాయంతో మొదటి సారి రూ.54 కోట్ల లాభాలను విశాఖ స్టీల్ ప్లాంట్ సాధించింది. 20 నెలలుగా కొనసాగుతున్న కూటమి ఐక్యతను కాపాడుకోవాలని కిందిస్థాయిలోనూ ఇదే ఐక్యత ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో 3 పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉమ్మడి సమావేశాలు నిర్వ హిస్తూ, అందరం ఒక్కటే అనే భావనతో మెలిగేలా చూసుకోవాలి అన్నారు.

## నలుగురు మంత్రులకు మావోయిస్టుల పేరిట బెదరింపు లేఖలు

>> వ్యక్తిగతంగా శాఖాపరంగా ఎక్కడా ఎలాంటి తప్పులు లేవు. మావోయిస్టుల లేఖలు ఇలా ఉండవు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఇలా రాసి ఉంటారు అని అన్నారు. మావోయిస్టుల లేఖలు ఇలా ఉండవన్నారు.అరకును అభివృద్ధి చేస్తుంటే మావోయిస్టులు తప్పుపట్టారంటే నమ్మలేం.బెదిరింపు లేఖను ట్రాక్ చేస్తున్నామన్నారు.దీనిపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మంత్రి దుర్గేష్ కార్యాలయ అధికారులు తెలిపారు.

ప్రతి పల్లె పండుగను గమనిస్తూ. గ్రామీణ జీవన విధానాలు, సంస్కృతులను గుర్తిస్తూ పర్యాటక రంగ అభివృద్ధి దృక్పదంతో ముందుకు వెళ్తున్నారు.అందుకే చారిత్రక ప్రాధాన్యతతో పాటు.,గ్రామీణ ఆచారవ్యవహారాల అందరికి తెలిసే విధంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నా మన్నారు.కళలు, సాహిత్యం మన సంస్కృతికి జీవన రేఖలని.. చెట్టు వేర్లు వంటివని.. ఇవి ఎంత బలంగా ఉంటే మన సమాజం అంత బలంగా ఉంటుందని పేర్కొన్నారు. సృజనాత్మకతకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. స్థానిక పర్యా టకాన్ని, సంస్కృతిని, కళలు, సంప్రదాయాలను ఎప్పుడూ కాపాడుకోవాలని ముఖ్యమంత్రి చెబుతుం టారని పేర్కొన్నారు. డీసీఎం పవన్ కల్యాణ్‌కు చారిత్రకంశాలను వెలుగులోకి తీసుకుని రమ్మంటున్నారన్నారు.

## 14న బడ్జెట్

>> ఈసారి సమావేశాలను 17రోజులపాటు నిర్వహించాలని నిర్ణయించారు.ఫిబ్రవరి 12న తీర్మానం పై చర్చ ప్రారంభం కానుండా,ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు.ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 2026-27ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు.అదే రోజున వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు. దాదాపు 4వారాల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.15,16తేదీల్లో శివరాత్రి,ఆ మరుసటి రోజు శెలవు ప్రకటించారు.17,18తేదీల్లో బడ్జెట్ పైన చర్చ జరగనుంది. 18న బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి సమాధానం ఇవ్వనున్నారు.మొత్తం అసెంబ్లీ పనిదినాలు 11,12,13,14,17, 18,19, 20,21,22 అసెంబ్లీ కి సెలవు, 23,24,25,26 అసెంబ్లీ పనిదినాలు,ఫిబ్రవరి 28 మార్చి 1 అసెంబ్లీకి సెలవు,మార్చి 2,3,4,5,6,7 తేదీల్లో కొనసాగుతుంది. మార్చి 5,6,7 తేదీల్లో ఎమ్మెల్యేలకు క్రీడా పోటీలు అసెంబ్లీలో మొత్తం 6బిల్లులు ప్రభుత్వం



బుధవారం అసెంబ్లీ హాల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన బిఏసి సమావేశం

ప్రవేశపెట్టనుంది.సభ ప్రతిరోజూ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సమావేశమవుతుంది.ప్రశ్నోత్తరాల సమయం ఉదయం 10గంటలకు ముగుస్తుంది.కాగా వరుసగా 8రోజులపాటు బడ్జెట్ పద్దుల పై చర్చించి కేటాయింపులు ప్రాధాన్యతలు వివరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం 6ఆర్డినెన్స్‌లకు ఆమోదం తెలపనుంది.తర్వాత ప్రతి రోజూ జీరో అవర్ ఉంటుంది.గ్రాంట్ల డిమాండ్లపై చర్చలు 8రోజులపాటు జరుగుతాయి. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం తోపాటుగా ప్రతిష్టాత్మక కార్యక్రమాలు గురించి సభా వేదికగా ప్రజలకు వివరించాలని భావిస్తున్నారు. ప్రభుత్వం పైన వస్తున్న విమర్శలకు అసెంబ్లీ నుంచే స్పష్టత ఇవ్వనున్నారు. మెడికల్ కాలేజీ లతో సహా రుషికొండ పైన సభలో చర్చించే అవకాశం ఉందని తెలుస్తుంది.దీంతో ఈసారి సమావేశాలు మరింత ఆసక్తికరంగా మారే అవకాశం కనిపిస్తుంది.

## శ్రీకాళహస్తికి కూడా కల్తీ నెయ్యి సరఫరా

>> సంఘం బ్రాండ్లలో ఏదైనా సరఫరా చేస్తామంటూ టెండర్లలో పేర్కొన్నారు.అయితే మొదట కొంత మేరకు తిరుమల నెయ్యిని అందించగా అత్యధికంగా 'వైష్ణవి' నెయ్యి సరఫరా చేసారు.

**నాడు వార్త ఏం చెప్పిందంటే..** 'శివయ్యకు వాసన లేని నెయ్యి' సరఫరా అంటూ 2024 సెప్టెంబర్ 23 తేది వార్త దినపత్రికలో వార్త ప్రచురితమైంది.శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రసాదాల తయారి, పరివార దేవతలు,స్వామి అమ్మవార్ల గర్భగుడి వద్ద వెలిగించే దీపాలతో మసిబారుతుందని వాసన లేదని సేర్కొంది.అయితే నాడు అధికారులు కానీ అప్పటి పాలకులు కానీ పట్టించుకోలేదు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నెయ్యి సరఫరాకు పాలకులు ససేమిరా! అన్నారు. నెలకు 7 టన్నుల నెయ్యి(500 డబ్బాలు) కొనుగోలు చేసారు.ఈ నెయ్యి డబ్బాలపై ఎలాంటి వివరాలు లేకుండా సరఫరా చేసారు. అయితే దేవాదాయశాఖ నిబంధనల మేరకు మరే ఇతర ఏజెన్సిలకు అర్హత దక్కదు. దాంతో సుమతి ట్రేడర్స్, వినాయక ఏజెన్సిల ఇష్టారాజ్యంగా మారింది. వారు అడిందే ఆట పాడిందే పాటగా సాగింది. అయితే ఈ సరఫరా దారులు ఎవరి వాటాలు వారికి గుట్టుచప్పుడు లేకుండా అందించటం వల్ల ఎవ్వరూ పట్టించుకోరు. సరకులు వచ్చాయా? దిగుమతి చెసుకున్నామా? అన్నట్లు మారింది.

**ఏజెన్సి పేరు మార్పుతో:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి నాడు నెయ్యిసరఫరాలో కల్తీ జరిగిందని సిట్ విచారణలో తేలింది.అయితే ఈ సమాచారం బహుశా ముందుగానే పసిగట్టారో ఏమో కానీ ప్రస్తుతం శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎస్ ఎస్ ఎన్ ఆర్ పేరుతో సరఫరా జరుగుతుంది.మరి గతంలో జరిగిన అవకతవకలపై ఏం చర్యలు అనేది ప్రశ్నార్థంగా మారింది.

## 'భూముల' బిల్లుకు కేబినెట్ ఓకే

>> చర్చించింది. ఎన్నికల ఓటర్ల జాబితా ప్రచురణకు ఏడాదికి 4 అర్హత తేదీలను కల్పించేందుకు సవరణ బిల్లుకు కేబినేట్ ఆమోదించింది. యాగంటి పీఎస్పీ (1000 ఎండబ్ల్యూ), రాజుపాలెం పీఎస్పీ (800 ఎండబ్ల్యూ) ప్రాజెక్టులను ఏపీ జెన్కో స్వతంత్రంగా అమలు చేయడానికి ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఏపి ట్రాన్స్ కోలో కడప జోన్ పరిపాలన కోసం అసిస్టెంట్ సెక్రటరీ పోస్టు సృష్టి ప్రతిపాదనకు ఆమోదం తెలపింది. సుజ్లాన్‌యాక్సిస్ సంస్థల అభ్యర్థన మేరకు పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల అమలు గడువును మరో 2 సంవత్సరాలు పొడిగిస్తూ మంత్రివర్గం నిర్ణయించింది.ఇక మంత్రి మండలి సందర్భంగా చంద్రబాబు సేయుడు మంత్రులు, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రుల పనితీరు, ప్రవర్తనపై ఆయన స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. మంత్రులందరూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా అసెంబ్లీలో ఉండాలని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత తమ పేషీల్లో ఉండి ఎమ్మెల్యేల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అసెంబ్లీలో ఆవు కథలు చెప్పవద్దని, సమాధానాలు క్లుప్తంగా, అర్థమయ్యేలా ఉండాలని మంత్రులకు చెప్పారు. మాట్లాడే ప్రతి మాట బాధ్యతగా ఉండాలని హెచ్చరించారు. శైలంలో భక్తులపట్ల పోలీసుల తీరుపైనా సీఎం స్పందించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. క్యూలైన్‌లో ఇబ్బందిపడుతున్న పెద్దవాళ్లను బయటకు తీసుకొస్తున్న సమయంలో వారిని వేరేదారిలో తీసుకెళ్తున్నట్లు భక్తులు భావించారని హోంమంత్రి అనిత వివరించారు. అటువంటప్పుడు పోలీసులు ముందే అనౌన్స్ చేస్తే బాగుండేది కదా అన్న సీఎం చంద్రబాబు విషయాన్ని భక్తులకు అర్థమయ్యే రీతిలో మైక్‌లో చెప్పి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. జలజీవన్ మిషన్ కింద ఏపీకి 12వేల కోట్ల రూపాయలు విడుదలకు కేంద్రం అంగీకరించిందని చంద్రబాబు వెల్లడించారు. జలజీవన్ పనులు 3ఏళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుందని అన్నారు. జిల్లాల్లో జరుగుతున్న ప్రాజెక్టులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేసే విధంగా ఇంఛార్జ్ మంత్రులు చూడాలని దిశానిర్దేశం చేశారు.

## అవిశ్వాస తీర్మానం నోటీసులో లోపాలు

### తిరస్కరణకు గురయ్యే అవకాశం, అనుమతిస్తే, మార్చి 9న చర్చ?

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంలో లోపాలున్నట్లు సెక్రటేరియట్ అధికారులు గుర్తించారు. ఇదే విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు అధికార వర్గాలు తెలిపాయి. లోపాలు సవరించి మళ్లీ నోటీసులు ఇవ్వాల్సి ఉంది. లేదంటే ఆ తీర్మానం తిరస్కరణకు గురయ్యే అవకాశముందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అవిశ్వాస తీర్మానంలోని లోపాలు సరిదిద్ది అందజేస్తే, ఆ తీర్మానంపై మార్చి 9న అంటే రెండో విడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభంలో చర్చకు అనుమతించే అవకాశముందని సమాచారం. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలని కోరుతూ దేశంలోని ప్రతిపక్ష పార్టీలు అవిశ్వాస నోటీసును సమర్పించాయి. లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ గౌరవ్ గొగోయ్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సి) కింద ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

దీనికి 118 మంది ఎంపీల సంతకాలు ఉన్నాయి. బడ్జెట్ సమావేశాల్లో పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరించారని, ప్రతిపక్ష సభ్యులను మాట్లాడనివ్వలేదని వారు ఆయనపై ఆరోపణలు చేశారు. ఇదిలా ఉండగా, అవిశ్వాస తీర్మానంపై చర్చించి నిర్ణయం తీసుకునే వరకు బిర్లా సభా కార్యకలాపాలకు హాజరు కానని మంగళవారం స్పీకర్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## 11.. 11..11

>> కానుందని స్పీకర్ వివరించారు. అంతేకాకుండా అసెంబ్లీ రిజిస్టర్‌లో ఎమ్మెల్యేలు చేసే సంతకాలు చెల్లవని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో తాజాగా బులెటిన్ జారీ అయింది. సభలోకి రాకుండానే వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు సంతకాలను పెట్టి వెళ్లిపోతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పీకర్ తెలియజేశారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి తమకు కేటాయించిన సీట్లలో కూర్చుంటేనే వారి హాజరును గుర్తించేలా డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని ఈరోజు నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో అమ లు చేసేందుకు ఏపీ శాసనవ్యవస్థ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

## గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలపై సిట్

>> లు, అసలు ఓఎంఆర్ షీట్లలోని వివరాలు ఒకదానికొకటి సరిపోలుతున్నాయా? లేదా? అనే విషయాన్ని పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులు.. దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశమున్నందున వారందరినీ అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది. మార్చి 16లోగా నివేదిక సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి అనుబంధ పిటిషన్లను పరిష్కరించిన హైకోర్టు ప్రధాన వ్యాజ్యాలపై విచారణను వాయిదా వేసింది.

## అంబటి మెడకు బిగిసిన మరో ఉచ్చు

>> భారీ ఎత్తున లక్కీ డ్రా నిర్వహించారు. వంద రూపాయల టికెట్ పెట్టి కార్లు, బైకులు బహుమతులుగా ప్రకటిస్తూ కోట్లాది రూపాయల వసూళ్లకు పాల్పడ్డారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ లాటరీ నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవని, సచివాలయ వలంటీర్ల ద్వారా బలవంతంగా టికెట్లు అమ్ముతూ అవినీతికి పాల్పడ్డారని జనసేన నేత గాదె వెంకటేశ్వర రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేయక పోవడంతో ఆయన కోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు అంబటిపై కేసు నమోదైంది. గత మూడు రోజులుగా అంబటి రాంబాబు చుట్టూ పోలీసులు పాత కేసులతో ఉచ్చు బిగిస్తున్నారు. గతేడాది మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేసిన ఆందోళనలో పోలీసులపై దురుసుగా ప్రవర్తించారనే కేసులో ఇప్పటికే ఆయనపై పీటీ వారెంట్ అమలైంది. ఆ కేసులో బెయిల్ రాగా, ఇప్పుడు రెండేళ్ల క్రితం నాటి లక్కీ డ్రా కేసును పోలీసులు తెరపైకి తెచ్చారు. అంబటి రాంబాబును గురువారం కోర్టులో హాజరుపరచాలని న్యాయమూర్తి ఆదేశించడంతో, పోలీసులు ఆయనను మళ్లీ కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంది.

## వారం - వర్జ్యం

12-02-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
దశమి మ.12.20
జ్యేష్ఠ మ.1.40
వర్జ్యం : రా.3.11-4.57
దు.ఉ.10.27-11.13, మ.3.05-3.51
శుభసమయం:ఉ.5.30-6.30,సా.5.30-6.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** వృత్తి, ఉద్యోగాల విషయంలో గానీ, కుటుంబ వ్యవహారాలలోగానీ మానసికంగా శ్రమిస్తారు.క్రయ విక్రయాలలో లాభాలు.

**వృషభం:** అనతి కాలంలో ప్రారంభించ బోయే వ్యాపారాల నిమిత్తం, నిర్వహించ వలసిన శుభ కార్యాల నిమిత్తం వనరులు సమకూర్చుంటారు.

**మిథునం:** మిత్రవర్గంలోనికి కొత్తవారికి చోటు కల్పించకండి. పెట్టుబడుల విషయంలో జాగ్రత్త అవసరం.

**కర్కాటకం:** రావలసిన బిల్స్, క్లైమ్స్ కొంత జాప్యం మీద చేతికందివస్తాయి. సభలలో చురుకుగా పాల్గొంటారు.

**సింహం:** అన్ని కార్యక్రమాలు విజయవంతం కావాలనే దృఢ సంకల్పంతో మీరు అడుగులు ముందుకు వేస్తారు.

**కన్య :** ఓర్పు, సహనాలు కలిగి ఉండటం చెప్పదగినది. వ్యవహారాలలో తొందరపాటు వద్దు.కోర్టు వ్యవహారాలు వాయిదాలలో ఉంటాయి.

**తుల :** ఇతరులకు మాట ఇచ్చే ముందు మీ పరిధులను పరిగణలోనికి తీసుకోండి. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:** ప్రత్యర్థులు సమస్యలను సృష్టించిన అధిగమిస్తారు. వత్తిడికి లోనవుతారు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** మీ మనోభావాలను వ్యక్తపరచకుండా ఎదుటివారు చెప్పేది ఆసాంతం వినండి.వాహన సౌలభ్యం.

**మకరం:** తొందరపాటు తనం, దుడుకుతనం చోటుచేసుకుంటాయి. క్రయ విక్రయాలలో స్వల్పలాభాలు.

**కుంభం:** కొద్దిపాటి ఒడిదుడుకులు మినహా ఈ రోజు సాఫీగా సాగుతుంది.కళా, సినిమా రంగాలవారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**మీనం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



# తిరుపతిలో నకిలీ ఐపిఎస్ అరెస్ట్


**తిరుపతి,ఫిబ్రవరి11ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగాలుపేరుతో ఐపిఎస్ అధికారినంటూ నిరుద్యోగులను మోసంచేసిన నకిలీ ఐపిఎస్‌ను తిరుపతి అలిపిరి పోలీసులు అరెస్ట్ చేశారు. అమాయకులను దోచుకుంటున్న ఒక ఘరానా మోసగాడిని పట్టుకోవడంతో సంచలనం కలిగించింది. ఢిల్లీలోని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) లో ఐపిఎస్ అధికారి పేరుతో కె. సురేష్ కుమార్ అనే సూర్య ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. నిందితుడు సురేష్ కుమార్ తనను తాను ఉన్నతాధికారిగా పరిచయం చేసుకుంటూ ప్రజలను నమ్మించేవాడు. ఈ క్రమంలో ఒక రాపిడో డ్రైవర్‌కు ఎర వేశాడు. ఆదాయపన్ను శాఖలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని, తనకు ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని నమ్మబలికాడు. నమ్మిన డ్రైవర్ ఉద్యోగం కోసం 1.50 లక్షల రూపాయలును సురేష్‌కు అందించాడు. డబ్బులు తీసుకున్న తర్వాత నిందితుడు ముఖం చాటేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు అలిపిరి పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్ సిబ్బంది సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి, కటకటాల్లోకి నెట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని, నకిలీ గుర్తింపు కార్డులతో మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నలుగురు స్మగ్లర్లు అరెస్ట్

## - నీళ్లట్యాంకర్, 72 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



**తిరుపతి,ఫిబ్రవరి 11ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి శేషాచలం అటవీప్రాంతం నుండి అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న నలుగురు స్మగ్లర్లను సినిమా ఫక్కీలో తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ విభాగం పోలీసులు పట్టుకున్నారు. నీళ్లట్యాంకర్ తరహాలో ఎర్రచందనం దుంగలు అక్రమంగా రవాణాచేస్తూ ట్రాక్టర్‌ను, 72ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం సాయంత్రం తిరుపతి జిల్లా ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు మీడియాప్రతినిధులకు తిరుపతిలో వివరించారు. పట్టుబడిన దుంగలు, ట్రాక్టర్ విలువ 1.65 కోట్ల రూపాయలు ఉంటుందన్నారు. ఇద్దరు అంతరాష్ట్ర ఎర్ర చందన స్మగ్లర్లతోబాటు మరో ఇద్దరు చిత్తూరు జిల్లా వాసులు అరెస్ట్‌చేశామన్నారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం పింఛా ప్రాజెక్ట్ సమీపంలో అక్కడ ఒక ట్రాక్టర్ ఆపిఉంచారు. కొందరు ఎర్ర చందనం దుంగలు లోడ్ చేస్తూండగా. టాస్క్ ఫోర్సు పోలీసు లు వారిని వెంబడించి నలుగురిని పట్టుకోగలిగారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన తిరుపతి టాస్క్‌ఫోర్సు సిబ్బందిని టాస్క్ ఫోర్సు చీఫ్ సుబ్బారాయుడు అభినందించారు. సమావేశంలో టాస్క్ ఫోర్సు ఎస్పీ పి. శ్రీనివాస్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీసిటీలో డైకిన్ రెచీ ఇండియా నూతన ప్లాంటు నిర్మాణానికి భూమిపూజ

**సత్యవేడు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** శ్రీసిటీలో డైకిన్-రెచీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ నూతన పరిశ్రమ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. జపాన్‌కి చెందిన డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, తైవాన్‌కు చెందిన రెచీ ప్రెసిషన్ కంపెనీ లిమిటెడ్‌సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటవుతున్న డైకిన్-రెచీ కంపెనీలో ఏసీల విడి భాగాల(రోటరీ కంప్రెసర్లు) ఉత్పత్తి చేస్తారు. నూతన ప్లాంటు భూమిపూజ కార్యక్రమంలో డైకిన్ ఇండియా చైర్మన్, మేనే జింగ్ డైరెక్టర్ కన్వల్‌జీత్ బావా, డైకిన్-రెచీ ఇండియా డైరెక్టర్ సెకిదా నయోటో సహా పలువురు పరిశ్రమ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జావా మాట్లాడుతూ ప్రధాని మేక్ ఇన్ ఇండియా ఫర్ వరల్డ్ లక్ష్యా నికి అనుగుణంగా డైకిన్ లోకలైజేషన్ ప్రయాణంలో ఇది మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# ఇడి రంగప్రవేశంతో తేలనున్న 'కల్తీ' పాపం



**భారీగా లబ్ధి పొందిందెవరో వెలుగులోకి?**

**తిరుమల,ఫిబ్రవరి11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూప్రసాదాల తయారీకి రసాయనాలు కలిపిన నూనె, ఇతర శాఖాహారపదార్థాలతో కల్తీచేసిన నెయ్యిని సరఫరా చేశారని తేల్చిన సిబిఐ సిట్ అధికారులు నివేదికలతో అవినీతిని నిగ్గు తేల్చేందుకు ఇప్పుడు ఇడి రంగంలోకి దిగింది. ఇడి అధికారులు విజయవాడ, తిరుపతి ప్రధాన కేంద్రంగా చేతిలో ఉన్న నివేదికలు, ఆధారాలతో మరింత లోతుగా కీలక వ్యక్తులను దర్యాప్తు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ వ్యవహారంలో 237కోట్ల రూపాయలు వరకు అవినీతి జరిగిందనేది సిట్ అందించిన నివేదిక. ఇందులో ఎవరెవరి పాత్ర ఉంది, ఎంత మొత్తంలో ఎవరెవరి నుండి ఎవరికి చేరిందనే పూర్తి ఆధారాలతో ఇడి తేల్చితే అసలు దోషులు ఎవరనేది వెలుగుచూడనుందనేది టిటిడిలో గుప్పుమంటోంది. ఇప్పటికే ఏడాదిన్నర కాలంలో సిబిఐ సిట్ అధికారులు క్షేత్రస్థాయిలో అన్ని కోణాల్లో కీలక విచారణ చేపట్టి లడ్డూప్రసాదాల కల్తీనెయ్యి వాడకంపై పాత్రధారులను 36మందిని గుర్తించింది. ఇందులో 11మంది టిటిడి అధికారులే కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ కేసులో మరో ప్రధాన సూత్రధారి ,టిటిడి ఎఫ్ఎసిఎఒ ఓ.బాలాజీ పాత్ర కూడా ఉందని సిట్ అందించిన నివేదిక. ఆయన ఇప్పటికే దీర్ఘకాలిక సెలవు పెటేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే ఆయనకు సెలవు మంజూరు చేసిన అధికారులెవరనేది ఇప్పుడు సంచలనమే. ఆయన దేశం తప్పించుకోకుండా చూడాలని రాజకీయ వర్గాలు హెచ్చరించాయి. గత టిటిడి బోర్డు పెద్దలు, గత అధికారుల పనితీరుపై పలురకాల ఆరోపణలు, విమర్శల నేపథ్యంలో వారందరినీ ఇడి పిలిచి సమగ్ర దర్యాప్తు చేయనున్నారనేది గుప్పుమంటోంది. ఇదే జరిగితే అరెస్టుల వరకు కూడా ఇడి వెనుకంజవేయదనేది గుప్పుమంటోంది. లడ్డూల తయారీకి ఐదుమంది కాంట్రాక్టర్లు టెండర్లలో దక్కించుకున్న ఒప్పందం ప్రకారం సరఫరా చేయాల్సిన నాణ్యతప్రమాణాలతో నెయ్యికి బదులు నాసిరకంగా, జంతువుల కొవ్వునూనె కలిపారనేది తేల్చిన సిబిఐ. దేవుని లడ్డూల తయారీలో కల్తీనెయ్యితో గత వైసిపి ప్రభుత్వం, అప్పటి టిటిడి బోర్డు పెద్దలు, టిటిడి అధికారులు అపవిత్రం చేశారనే విమర్శలు చెలరేగాయి. లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి ఘటనపై టెండర్లు కేటాయించినప్పటినుండి నెయ్యి సరఫరా చేసిన రోజుల వరకు సమగ్రంగా దర్యాప్తు చేపట్టారు. ఇంకా ఈ అవినీతి మరకల్లో అసలు దోషులు ఎవరనేది రాబడుతున్నారు. కీలకంగా మారిన ఈ కేసులో రానున్న రోజుల్లో ఎలాంటి సంచనాలు ఉండబోతోందనేది గుబులు రేకెత్తిస్తోంది..ఇదిలా ఉండగా లడ్డూల తయారీకి సంబంధించి అవసరమైన నెయ్యిసరఫరాలో 2019వ సంవత్సరం నుండి 2024వరకు భారీగా కుట్రలు జరిగాయనేది సిఐబి సిట్ అధికారులు కూడా నిగ్గుతేల్చారు.అప్పట్లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఉత్తరప్రదేశ్ ఉత్తరాఖండ్ రూర్కె బోలేబాబాడైరీ కంపెనీ నెయ్యిసరఫరా చేసేందుకు 2022లో కూడా సిద్ధమైంది. అయితే టిటిడికి నెయ్యి సరఫరాచేసే డైరీ నుండి కిలోకు 25 రూపాయలు కమీషన్ తీసుకున్నారనేదిఆధారాలు.

# రహదారి భద్రత, నేర నియంత్రణకు

## విజయనగరంలో ఆకస్మిక తనిఖీలు



**విజయనగరం, ఫిబ్రవరి 11 ( ప్రభాతవార్త ప్రతినిధి ) :** విజయనగరంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో బుధవారం కూడా ముందుగా గుర్తించిన 140 ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు ఆకస్మికంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను ఎస్పీ దామోదర్ స్వయంగా పర్యవేక్షిఁచారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ విజయనగరంలో వాహన తనిఖీలు చేపట్టేందుకు 140 ప్రాంతాలను గుర్తించి, ఆ యా ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో సుమారు వెయ్యి మంది పోలీసు అధికారులు, సిబ్బందిని వినియో గించామన్నారు . ఈ తనిఖీల్లో వాహన పత్రాలు సక్రమంగా ఉన్నవి, లేనిది గుర్తించి, రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా సైలన్సర్లను మార్పులు చేసి, శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న వాహనాలను కూడా సీజ్ చేస్తామన్నారు. మైనరు డ్రైవింగు, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపైన కేసులు నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. వాహన తనిఖీల్లో ప్రజలకు రహదారి భద్రత పట్ల కూడా అవగాహన కల్పించి, హెల్మెట్ ధారణ ఎంత ప్రయోజనకరమో వాహనదారులకు వివరించామన్నారు. రహదారి భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తూ మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జైలుశిక్ష విధించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదాలు జరగకుండా లైన్ డిపార్టుమెంట్స్ సహకారంతో రహదారుల ప్రక్కన ఉన్న మొక్కలను తొలగిస్తున్నామని, ప్రమాదాలకు కారణమవుతున్న రహదారులను గుర్తించి, ఆయా డిపార్టుమెంట్స్ దృష్టికి తీసుకొనివెళ్ళి, మరమ్మత్తులు చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రహదారి భద్రత నియమాలు పాటించిన, హెల్మెట్ దరించిన వాహనదారులను ఎస్పీ అభినందించారు. ఈ తనిఖీల్లో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్పీలు ఆర్.గోవిందరావు, జి. భవ్య రెడ్డి, ఎస్.రాఘవులు, డిపిడిసి డిఎస్పీ వీరకుమార్, పలువురు సిఐలు, ఆర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మేల్‌ఛాట్‌వస్త్రం 'అవినీతి' మరకలెవరివి?

## -కొనుగోళ్లలో భారీ స్కామ్ - విచారణ ఎప్పటికో!

**తిరుమల,పిబ్రవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రతను కాపాడుతూ పుణ్యక్షేత్ర ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేందుకు సేవకులుగా పనిచేయాల్సిన కొందరు స్వార్థపరులు దేవునిపేరుతో భారీగా అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఇంకా గుప్పుమంటున్నాయి. ఇటీవల కాలంలో ఏకంగా వేంకటేశ్వరస్వామి ఆదాయానికి గండికొట్టి భారీ మొత్తంలో మేల్‌ఛాట్ వస్త్రాల కొనుగోళ్ళలో అవినీతికి పాల్పడ్డారనే దుమారం రేగింది. ఈ అవినీతి మరకలు ఎవరికి అంటుకుంటుందనే చర్చ జరుగుతున్నా దానిపై సమగ్ర దర్యాప్తు కేవలం ఆరోపణలకే పరిమితమైందనేది భక్తుల్లో చర్చ. మేల్‌ఛాట్‌వస్త్రాల కొనుగోళ్ళలోనూ అక్రమాలకు పాల్పడిన ఘనులెవరనేది తేల్చాల్సిన అంశంలోనూ టిటిడి పాలకమండలి, అధికారులు ఉదాసీనంగా ఉంటున్నారనే విమర్శలు లేకపోలేదు. భారీగా అవినీతికి పాల్పడిన గత ధర్మకర్తలమండలిలో పెద్దలెవరు? పాలుపంచుకున్న అధికారులెవరనేది ఇప్పుడు టిటిడి వర్గాల్లో దుమారం రేగింది. ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ప్రముఖులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన సందర్భంలో వారికి మర్యాదపూర్వక స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువలతో సన్మానించడం పరిపాటి. ఈ శాలువలు ఖరీదు మార్కెట్లో నాణ్యమైనవి కూడా 300-350రూపాయలు లోపే ఉంటుంది. అయితే ఈ శాలువలను గత టిటిడి బోర్డులోని పెద్దలు, ప్రొక్యూర్‌మెంట్‌సెల్ కమిటీలోని అధికారులు ఏకంగా నాలుగురెట్లు పెంచి 1,300రూపాయలు వెచ్చించి కొనుగోలుచేశారనేది తాజాగా తేలిన విషయం. ఇలా గత ఐదేళ్ళలో ఏటా కోట్లరూపాయల్లో అవినీతికి పాల్పడ్డారనేది ప్రస్తుతం టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,అధికారులు వెల్లడించిన సమాచారం. ఇదేగాక ఇంకా టిటిడి అవసరాలకు, తిరుమలలో నైవేద్యాలు తయారీ, లడ్డూప్రసాదాల తయారీకి అవసరమైన ముడిసరుకులు భారీ మొత్తంలో నాణ్యత ఉన్నవి కూడా టెండర్‌ద్వారా కొనుగోలుచేస్తారు. ఈ టెండర్లలో ఏమేరకు వ్యాపారులతో ధరలు ఖరారుచేశారనే అంశంపై కూడా ఆరాతీస్తున్నారు. టిటిడి కొనుగోలు విభాగంలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయని, దీనిపై అవినీతి నిరోధకశాఖ(ఏసిబి)తో సమగ్ర విచారణ జరపాలని నిర్ణయం తీసుకోవడం సంచలనమే. మరీ ధార్మికసంస్థ టిటిడిలో అక్రమాలు, అవినీతిని కనిపెట్టి దేవుని సొమ్ముదుబారా కాకుండా చూడాల్సిన బాధ్యత నిఘాభద్రత విభాగంపై కూడా ఉంది.


టిటిడి బోర్డుకు సంబంధించి కొందరు సభ్యులు, మార్కెటింగ్ విభాగం జిఎం నుండి సూపరింటెండెంట్ స్థాయి అధికారి వరకు కొనుగోళ్ళపై సుదీర్ఘంగా చర్చించి నిధులు మంజూరుచేస్తారు. అలాంటిది గత టిటిడి బోర్డులో భారీమొత్తంలో కొనుగోళ్ళలో అవినీతికి పాల్పడేలా ప్రోత్సహించిందెవరనేది కూడా ఇప్పుడు ఏసిబి విచారణలో వెల్లడికానుంది.

# కూతురే కొడుకై తండ్రికి తలకొరివి

**వడమాలపేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** పున్నామ నరకం నుంచి రక్షించేవాడే పుత్రుడు అన్న పాతకాలపు నమ్మకాలను పటాపంచలు చేస్తూ కన్నతండ్రిపైప్రేమను చాటుకుంది ఒక కూతురు. కన్న కొడుకు లేకపోయినా, తనే ఒక కొడుకుగా తండ్రి అంత్యక్రియలు నిర్వహించి అందరిని కంటతడి పెట్టించింది. వివరాలు ఇలా... తిరుపతి జిల్లా వడమాలపేట మండలం వడమాల గ్రామానికి చెందిన సానంబట్ల మునిశేఖర్ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు, ఆయనకు భార్య సంధ్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు మునసౌమ్య, హిమజ ఉన్నారు. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌ని తీర్చిదిద్దిన ఆ గురువు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళ వారం కన్నుమూశారు. సాధారణంగా హిందూ సాంప్రదాయం ప్రకారం తండ్రికి తలకొరివి కుమారుడు పెడతాడు. కానీ ఆ ఇంట్లో కుమారులు లేరు. ఈ తరుణంలో పెద్ద కుమార్తె సౌమ్య సంప్రదాయం కంటే ప్రేమే మిన్న అని చాటిచెబుతూ తండ్రిగ అంతిమ యాత్రలో అన్ని తానై వ్యవహరించింది.

బుధవారం శ్మశాన వాటికలో హిందూ సాంప్రదాయాల ప్రకారం తండ్రి చితికి తలకొరివి పెట్టి, తన తండ్రి ఆత్మకు శాంతి చేకూర్చింది. ఆడ పిల్లలంటే కేవలం బాధ్యత మాత్రమే కాదు, కడవరకఉ తోడుండే బలం అని ఆమె లోకానికి చాటి చెప్పింది.

# స్వచ్ఛాంధ్ర సాధనకు కలసికట్టుగా కృషిచేయాలి : పట్టాభి



మున్సిపల్ అధికారులతో వీడియో సమావేశంలో మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్రకార్పోరేషన్ చైర్మన్ పట్టాభి

**విజయవాడ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు చేసి స్వచ్ఛాంధ్ర సాధనకు అధికారులు, ప్రజలు కలిసికట్టుగా కృషిచేయాలని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి పిలుపునిచ్చారు. అమరావతిలోని కార్పోరేషన్ కార్యాలయం నుండి బుధవారం గుంటూరు, అనంతపురం రీజియన్‌లోని మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా పట్టాభి మాట్లాడుతూ గత ఏడాది స్వచ్ఛసర్వేక్షణ్‌లో జరిగిన లోపాలను సరిదిద్ది ఈసారి మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు కృషిచేయాలని కోరారు. మరో నెలరోజుల్లో జాతీయస్థాయిలో స్వచ్ఛసర్వేక్షణ్ బృందాలు మన రాష్ట్రానికి రానున్నాయని, ఈసారి మంచి ర్యాంకులు సాధించాలనే లక్ష్యంతో ముందుగానే పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ పనులను సమీక్షిస్తున్నట్లు తెలిపారు. వ్యర్థాలను వేరు చేయటం, పబ్లిక్‌టాయ్‌లెట్స్ నిర్వహణా, నాలాల క్లీనింగ్, పాఠశాలలు, పార్కులు, పర్యాటక ప్రాంతాల శుభ్రతపై దృష్టిసారించాలన్నారు. గత ఏడాది నెగెటివ్ మార్కుల కారణంగా ర్యాంకులు తగ్గిపోయాయని, ఈసారి వాటిని అధిగమించాలన్నారు. గతంలో నెగెటివ్ మార్కులు వచ్చిన అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. కాలువల్లో చెత్తపేరుకుపోవటం, డ్రైనేజీల్లో మురుగునీటి నిలిచిపోవటం, ఐఈసి, సిబీ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ప్రజలను భాగస్వాములను చేసేవిధంగా ఐఈసి, సిబీ కార్యక్రమాలను ఏఐఎల్ఎస్‌జీ, వాష్ ఏజన్సీలు నిర్వహిస్తున్నామన్నారు. సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌కు మార్కులను 500 నుండి 1000కి పెంచారని ప్రజల నుండి మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చేలా పనిచేయాలని పట్టాభి ఆదేశించారు. పబ్లిక్ టాయ్‌లెట్స్‌కు నిధుల సమస్య లేదని, కొత్తవి నిర్మించటానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పాఠశాలలు, ప్రయివేటు ప్రదేశాల్లో మహిళలు, వికలాంగులకు ప్రత్యేకంగా వారికి కావాల్సిన సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు.

# దుబాయ్ సదస్సుకు పేటశ్రీ



**తిరుపతి,ఫిబ్రవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్‌లో 15,16తేదీల్లో జరిగే ఎస్‌పిజె స్కూల్ ఆఫ్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ అంతర్జాతీయ సదస్సుకు తిరుపతి నుండి విశ్రాంత ఆచార్య పేటశ్రీకి ఆహ్వానం అందింది. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇంటర్ డిసిప్లెనరీ రీసెర్చ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ (2026)సదస్సు జరగనుంది. ఈ అంతర్జాతీయ సదస్సుకు "ఫర్‌ఫార్మింగ్ ఆఫ్ తిరుమల బ్రహ్మోత్సవమ్స్ ఎపి ఇండియా"అనే అంశంపై పరిశోధనపత్రాన్ని సమర్పిస్తారు. ఆచార్య పేటశ్రీ ఇదివరకే తిరుపతి గంగజాతర, తిరువీధులు, కోనేటిరాయని కథలు, తిరుపతి కథలు వంటి తిరుపతికి సంబంధించిన పుస్తకాలను ప్రచురించారు. ఈయన గతంలో ఆస్ట్రేలియా, చైనా, ఇండోనేషియా,

భూటాన్, థాయ్‌లాండ్, వియత్నాం, శ్రీలంక వంటి దేశాల్లోని అంతర్జాతీయ సదసుల్లో పాల్గొని పరిశోధనావ్యాసాలు సమర్పించారు.

# తిరుమల సమాచారం

## మకరవాహనంపై కపిలేశ్వరుడు అభయం



**తిరుమల, ఫిబ్రవరి 11ప్రభాత వార్త ప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి శేషవాహనంపై భక్తులకు అభయమిచ్చాడు. తన శిరస్సుపై పరమేశ్వరుడు శేషుని పడగలు గొడుగూగా వహించి పూజలందుకుంటున్నారు. ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తిగా కామాక్షి అమ్మవారితో కలసి మకరవాహనంపై ఊరేగారు. ఉదయం నిత్యకైంకార్యలు పూర్తిచేసుకున్న తరూవాత స్వామివారు ఆలయ పురవీధుల్లో ఊరేగడంతో భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మకరం గంగాదేవికి నిత్యవాహనం. మకరం జీవప్రకృతికి ఉదాహరణ. భగవంతుని ఆశ్రయించినంత వరకు జీవుడు నీటిలో మొసలిలా బలపరాక్రమంతో జీవించవచ్చును. మధ్యాహ్నం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారికి వేడుకగా విశేష స్నపనతిరుమంజనం నిర్వహించారు.

## వెంకన్న ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి



**తిరుమల,ఫిబ్రవరి11ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరికీ మంచిజరగాలని ,కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు హిందూ ధర్మపరిరక్షణ జరగాలని ఆధ్యాత్మిక నాయకురాలు సాధ్విరితంబర తెలిపారు. దేవదేవుని దర్శనం బాగా జరిగిందని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్‌లో సాధ్విరితంబర, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టీస్ శ్యామ్‌సుందర్ వేర్వేరుగా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులువేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆసుపత్రి నూతన భవనాలను గడువులోపు పూర్తిచేయాలి

### దేవాతామూర్తుల ఫోటోలు ఏర్పాటు : టిటిడి జెఇఒ డాక్టర్ శరత్



**తిరుమల,ఫిబ్రవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో నిర్మాణంలో ఉన్న పద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి భవనాలను నిర్దిష్ట గడువులోపు పూర్తిచేయాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. టిటిడి సాంకేతిక సలహాదారుడు ఆర్. కొండల రావుతో కలిసి నిర్మాణంలోని భవనాన్ని బుధవారం మధ్యాహ్నం జెఇఒ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్దిష్ట సమయంలోపు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. నూతన భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా జరుగుతుండడంపై ఆయన సంబంధించిన అధికారులపై అసహనం చెందారు. పనులు వేగవంతం చేయాలని ,ఆసుపత్రి పరిసరాలు చుట్టూ పచ్చదనం, ఆసుపత్రి లోపల ధైవభక్తి, మనోధైర్యం నింపేలా దేవాతామూర్తుల ఫోటోలను,సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రి భవనానికి అవసరమైన ఎలక్ట్రికల్ తదితర మౌళిక సదుపాయాల పరికరాల ఎంపికలో మరింత నాణ్యమైన వస్తువులను ఉపయోగించాలని జెఇఒ సూచనలు చేశారు. .ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ టి.వి. సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఆర్ ఎంవో డాక్టర్ భరత్, ఎస్.ఇలు వేంకటేశ్వర్లు, మనోహరం,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో 12.70 ఎకరాల్లో ఫైవ్ స్టార్ డీలక్స్ రిసార్ట్

## - స్థలం పరిశీలించిన కలెక్టర్, పర్యాటకశాఖ



**తిరుపతి,ఫిబ్రవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఎస్.వి.పురం గ్రామ పరిధిలో సుమారు 12.70 ఎకరాల్లో ఫైవ్ స్టార్ డీలక్స్ రిసార్ట్ నిర్మాణం చేపడుతున్నారు. సుమారు 150 నుండి 200 కోట్ల రూపాయలు వ్యయంతో నిర్మించనున్న ఈ రిసార్ట్‌లో డీలక్స్ గదులు, సూట్స్, కాటేజీలు, విల్లాలు కలిపి మొత్తం 149 గదులు ఏర్పాటు చేయనున్నారు. బుధవారం ఈ ప్రాజెక్టులను రాష్ట్ర పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. రమణ ప్రసాద్, తిరుపతి జిల్లా పర్యాటక ,సాంస్కృతిక శాఖ అధికారి ఎం. జనార్దన్ రెడ్డి , బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్‌ఎల్‌పీ సంస్థ అధీకృత ప్రతినిధి ప్రదీప్త కుమార్ మొహాపాత్ర తో కలసి తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి భూసరిహద్దులను గుర్తించారు. తిరుపతి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి మరో కీలక ప్రాజెక్టుకు శ్రీకారం పడింది. ఈ ప్రాజెక్టు ద్వారా రెస్టారెంట్లు, బ్యాంక్వెట్, కాన్ఫరెన్స్ హాళ్లు, స్పా, వెల్‌నెస్ సదుపాయాలు, ఇండోర్,అవుట్‌డోర్ వినోద కార్యకలాపాలు వంటి ఆధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా సుమారు 250 మందికి, పరోక్షంగా సుమారు వందమందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇలాంటి ప్రాజెక్టులు దేశీయ, విదేశీ పర్యాటకులను మరింత ఆకర్షిస్తాయని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ రిసార్ట్ నిర్మాణం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల్లో రిసార్ట్ నిర్మాణాన్ని పూర్తిచేసి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామన్నారు.

# రాష్ట్ర పాలన కాదు ఇది రాక్షస పాలన : భూమన కరుణాకర్‌రెడ్డి



**పలమనేరు, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సాగుతున్నది రాష్ట్ర పాలన కాదు రాక్షస పాలన అని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అన్నారు. బుధవారం చిత్తూరు జిల్లా పలమనేరు లోని వైసిపి కార్యాలయంలో జరిగిన నియోజక వర్గం స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన రాక్షస పాలనతో రాష్ట్రాన్ని అతలా కుతలం చేస్తున్నారని ఆరోపించారు. తాను చేస్తున్న తప్పులను నిలదీస్తే ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయించి జైలుకు పంపుతున్నారని విమర్శించారు. చివరకు కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వరుని కూడా వదలడం లేదని తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కల్తీ జరిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సాక్షాత్తు సుప్రీం కోర్టు ఆదేశాలతో సిబిఐ దర్యాప్తు చేసి కల్తీ జరగులేదని తేల్చిందని అలాగే ముఖ్యమంత్రి స్వయంగా వేసిన సిట్ దర్యాప్తు కూడా కల్తీ లేదని క్లీన్ చిట్ ఇచ్చిందని ఆరోపించారు. ఐతే ముఖ్యమంత్రి, నుండి ఉప ముఖ్యమంత్రి, కూటమి నాయకులు మాత్రం కల్తీ నెయ్యి పాపం జగన్‌దేనని తప్పుడు ప్రచారాలు మానడంలేదని విమర్శించారు. చేసిన పాపం ఊరికే పోదని ఎప్పుడో ఒకప్పుడు అనుభవించక తప్పదని హెచ్చరించారు. పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. తాను 2019లో ఒకే కండువా కప్పుకొని వైసిపి తరపున 35 వేల మెజార్టీతో గెలిస్తే అమరనాథరెడ్డి 2024 ఎన్నికల్లో మూడు కండువాలు కప్పుకొని తప్పుడు వాగ్దానాలతో కేవలం 25 వేల మెజార్టీతో గెలిచారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే నుండి ఆయన అనుచరులు అందిన మేరకు దోచుకోవడం, దాచుకోవడమే పనిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సాక్షాత్తు ఎమ్మెల్యే పిఎ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా విద్యానగర్ పాఠశాల ముందు ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తూ అడ్డంగా దొరికి పోయారని ఆరోపించారు. ఈ విషయంపై మున్సిపల్ కమీషనర్ ఆర్డీఓ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. చివరకు జిల్లా కలెక్టర్ జోక్యంతో స్థలం కబ్జా కాకుండా ఆపామని తెలిపారు.

వార్త

వచ్చినవాడు మిత్రుడైనా, శత్రువైనా చిరుదరహాసంతో స్వాగతం పలకడం ఉత్తమ లక్షణం.

-జాన్‌సావంత్

# అమలు చేయలేని చట్టాలెందుకు?

చేసింది చెప్పుకోవడం సులభం. కానీ చెప్పింది చేయడం మాత్రం ఎంతో కష్టతరం. అలా హామీలిచ్చి ఆ తర్వాత మాట మార్చిన నేతలెందరో కాలగర్భంలో కలిసిపోయారు. కేవలం కొందరు మాత్రమే ఇచ్చిన మాటను నిలబెట్టుకొని ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకొని చిరస్థాయిగా నిలిచిపోతారు. అందుకే మాట ఇచ్చే ముందు అన్ని కోణాల్లో ఆలోచించి ఆచరణయోగ్యమా కాదా, అందుకు తగిన వనరులున్నాయా? తదితర అంశాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించుకొని మాట ఇవ్వాలి. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన విషయంలో పాలకులు మాట నిలబెట్టుకోలేకపోతున్నారు. చట్టాల మీద చట్టాలు చేస్తున్నారు. అధికారుల మీద అధికారులను నియమిస్తున్నారు. అవేమీ ఆశించిన ప్రయోజనాలు చేకూర్చడం లేదు. అందుకు కారణం అమలులో చిత్తశుద్ధి లేకపోవడమే. చట్టాలు చేసేటప్పుడు నిబంధనలు విధించేటప్పుడు ఉన్నశ్రద్ధ ఆచరణకు వచ్చేసరికి ఉండడం లేదు. అందుకే ఈ వ్యవస్థ అంతగా పెరిగిపోతున్నది. మొన్న మహబూబ్‌నగర్ జిల్లాలో పదుల సంఖ్యలో బాల కార్మికులకు వెట్టిచాకిరి నుంచివిముక్తి కల్పించారు. దేశవ్యాప్తంగా కూడా అనేక రాష్ట్రాల్లో ఎంతోమంది బాలకార్మికులు ఈ కూపంలో మగ్గిపోతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కొంతమేరకు ఫలితాలుకూడా సాధించారు. కానీ మొన్నటి కరోనా రక్కసి విజృంభణ తర్వాత ఈవ్యవస్థ మరింతగా పెరిగిపోయింది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులు మరీ నిరుపేదల పిల్లలు బడిబాట మానేసి కార్మికుల అవతారం ఎత్తారు. అధికార లెక్కల ప్రకారమే కరోనా కాలం తర్వాత దాదాపు కోటి మందికిపైగా బాలబాలికలు చదువులకు స్వస్తి చెప్పి వ్యవసాయరంగంలోనూ, లేక పారిశ్రామిక రంగంలోనూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏదో ఒక పనుల్లో చేరిపోయారు. ఆ తర్వాత పాఠశాలలు తెరిచినా ప్రభుత్వం బడిబాట కార్యక్రమాలు ఏర్పాటు చేసినా ఆ వైపు రాలేదనే చెప్పొచ్చు. దీంతో బాలకార్మిక వ్యవస్థ మళ్లీ పెరిగిపోయింది. ఫలితంగా ఆటపాటలు, చదువు సంధ్యలతో ఆనందంగా గడపాల్సిన ఎంతోమంది బాలల జీవితాలు కళ్లముందే బుగ్గిపాలవుతు న్నాయి. పాత చట్టాలకు మరింత పదునుపెట్టి చట్టాలు తీసుకువచ్చామని, ఎన్నిసార్లు నేతలు ప్రకటిస్తున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఏదో ఒక మార్గంలో, ఏదో ఒకరూపంలో ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. అన్నింటి కంటే ప్రధానంగా ఈ కూపం నుంచి బయటకు వచ్చిన బాలకార్మికులకు ప్రత్యామ్నాయఏర్పాట్లు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని నిర్దిష్ట చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఇది ఎన్నో ఏళ్ల నుంచి జరుగుతున్నా చాలామందిఅధికారులకు తెలిసినా పాలకులను నమ్మించేందుకు కాగి తాల మీద ఏదో రాసుకొని కాలంగడుపుతున్నారు. ఇక మనరాజ్యాంగ నిర్మాతలు కూడా ఈవిషయంలోప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రాజ్యాంగంలోని 24వ అధికరణ బాలకార్మిక వ్యవస్థను సమూలంగా వ్యతిరేకిస్తున్నది. పధ్నాలుగు సంవత్సరాల వయసుగల పిల్లలను వ్యక్తులు కానీ, సంస్థలుకానీ, పనిలో పెట్టుకోకూడదనిఉద్దేశిస్తున్నది. రాజ్యాంగంలోని 39వ (ఇ)అధికరణ కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నది. లేత వయసులో ఉన్న పిల్లలను వారి వయసుకు మించిన పనుల్లో పెట్టకూడదని రాజ్యాంగ నిబంధనలు స్పష్టంచేస్తున్నాయి. తల్లిదండ్రులు తమ ఆర్థిక అవసరాల నిమిత్తం పిల్లలను వయసుకు మించినపనుల్లో నియమించరాదని రాజ్యాంగ నిబంధనలుఘోషిస్తున్నాయి. అయినా ఆచరణకు వచ్చేసరికి అది కాగితాలకే మిగిలిపోతున్నాయి. బయటకు తీసుకువచ్చామని, వారికి పునరావాసం కల్పించామని చెప్పుకుంటున్నా ఆ పిల్లల్లో అధిక శాతం తమతమ పాతపనుల్లోకే చేరిపోతున్నారు. కోట్లాది రూపాయలు వ్యయం చేసినా, ఆశించిన ఫలితాలుదక్కడం లేదు. ఇందుకు ప్రధాన కారణాలు, కారకులు ఎవరు అనే విషయంలోకి పాలకులు పోవడం లేదేమోననిపిస్తున్నది. తల్లిదండ్రులే తమ పిల్లలను నాలుగు డబ్బుల కోసం ఇలాంటిపనుల్లో చేర్పిస్తున్నారనే వాదనను కూడా తోసిపుచ్చలేం. పాలకులు మనసుపెట్టి ఆలోచిస్తే యధార్థమేందో వారికితెలుస్తుంది. లేత వయసులో చదువు సంధ్యలతో ఆడుతూ పాడుతూ కళ్లముందు ఉండాల్సిన పిల్లలు ఎక్కడో కన్పించని ప్రాంతాలకు పనికోసం పంపుతున్న ఆతల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభకు గురవుతుంటారో వేరే చెప్పక్కర్లేదు. ఏతల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగుతెంచుకొని పుట్టిన కన్నబిడ్డలను పదిరాళ్లకోసం పరాయి పంచకు పంపడానికి కారణం కేవలం ఆర్థికపరిస్థితేననేది సత్యం. ఆ పిల్లలు చేయరాని, చేయలేని, చేయకూడని పనులెన్నో చేస్తూ ఇంకెన్నో బాధలు అనుభవి స్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి ఆర్థికపరిస్థితులు వారిని నోరు విప్పనీయడం లేదు. తల్లిదండ్రులకు దూరమై, వారి ప్రేమవాత్సల్యంకోసం ఆ పసి హృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. ఇందుకు కేవలం వారిని పట్టిపీడిస్తున్న దరిద్రమే ఏకైకకారణం. ఆకోణంలో ఆలోచిస్తే ఈ సమస్యకు కొంతవరకైనా పరిష్కారం దొరు కుతుంది. అంతేకానీ మూలాలను వదిలిపెట్టి చట్టాలు తెచ్చుకున్నా, సమావేశాలు, సమీక్షలు చేస్తున్నామంటూ లక్ష్యాలు సాధించామనిప్రకటించుకోవడం మనల్ని మనం మోసం చేసుకోవడమే.

మనిషి ఉన్నతస్థితి అతడు సాధించిన అసాధారణ విజయాలను బట్టిగాక అతని రోజువారీ ప్రవర్తనను బట్టి అంచనా వేయవలసి ఉంటుంది.



పాస్కల్

మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చును.



గురునానక్

# ప్రజావాక్కు



### మంచి ముందడుగు

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సహాయం చేయడానికి ప్రజలను ప్రోత్సహించే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం రాహ్‌వీర్ పథకంను ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ప్రమాదబాధితులను రక్షించేందుకు ముందుకు వచ్చే వ్యక్తులను రాహ్‌వీర్గా గుర్తించి, వారి మానవతా సేవలకు గౌరవం చెల్లించనుంది. ఈ పథకం కింద బాధితులకు సహాయం చేసిన వారికి రూ. 25,000 నగదు ప్రోత్సాహకంతో పాటుప్రశంసా పత్రం అందజేయబడుతుంది. ప్రాణాలను కాపాడడంలో మంచి సమారిటన్ల పాత్రఎంతముఖ్యమో ఈపథకం స్పష్టంగా తెలియజేస్తుంది. రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేయడంలో భయంలేదా సంకోచంలేకుండా, సహాయకులకు పూర్తి చట్టపరమైన రక్షణ కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### కల్తీ మందులు

వ్యవసాయ రంగంలో కల్తీ పురుగు మందుల వాడకం రైతులకు పెను శాపంగా మారింది. దేశవ్యాప్తంగా సాగు వ్యయం పెరుగుతున్నతరుణంలో, నాణ్యత లేని మరియు నకిలీ మందులవల్ల రైతులు ఆర్థికంగా భారీగా నష్టపోతున్నారు. పంటలను తెగుళ్లనుండి రక్షించుకోవడానికి అధిక ధరలు వెచ్చించి మందులు కొనుగోలు చేస్తున్నప్పటికీ, అవి ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా, పంటను మరింత దెబ్బతీస్తున్నాయి. కల్తీమందుల ప్రభావంవల్ల పంట దిగుబడి తగ్గడమేకాకుండా, భూసారంకూడా దెబ్బతింటోంది. కల్తీ పురుగు మందుల వెనుక ఉన్న అక్రమ వ్యాపారాలు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నాయి. తక్కువ ధరకు వస్తాయని లేదా ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి రైతులు వీటిని కొనుగోలు చేస్తున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### డిజిటల్ నేరస్తులు

ఈమధ్యన సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల్లోకి జొరబడి కొంత సొమ్మును విడతల వారీగా స్థంభింప చేస్తున్నారు. ఆడబ్బుఎక్కడికీ పోదు. కాకపోతే సైబర్‌నేరాలకు సంబంధించిన డిపార్టుమెంటు వారు పరిశీలించి విడుదల చేస్తేనే కాని ఖాతాదారునికి చెల్లింపబడదని బ్యాంక్ వారు సమాధానమిస్తున్నారు. ఇలాఎన్నినెలలు కాలాయాపనచేయాలి.

- ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### చమురు కొనుగోలు ఆపేసిందా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలకు భారత్ లోబడి చమురుకొనుగోలును రష్యానుంచితగ్గించిందా లేక ఆపేసిందా? ఈ సందర్భంగా వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌ను అడిగితే, నాకు తెలియదు విదేశాంగ మంత్రి ఎస్‌జయశంకర్ సారుకే తెలుసునేమోనని అన్నారట. ఈయనేమో వాణిజ్య మంత్రికే ఎరుక అని అన్నారుట. రష్యానుంచి చమురుకొనుగోలు నిలిపివేస్తేనే సుంకాలు తగ్గించాము. లేకుంటే సుంకాలు యధావిధిగా కొనసాగిస్తామని అమెరికా నొక్కివక్కాణించింది. భారత్ మాత్రం అమెరికాకు బానిసైన వెనుజులా దేశం నుంచి చమురు దిగుమతి చేసుకోవాలని భారత్‌కు ఆంక్షలువిధించింది. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకున్నప్పటి నుండి భారత్ రష్యా స్నేహబంధం మరింత బలపడింది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మౌలిక వసతులు కల్పించాలి

ఒప్పందాలాన్నింటికి అమ్మలాంటిదిగా చెపుతున్న భారత్ యూరోపియన్ యూనియన్ ఒప్పందంలో కొన్ని భారత్ రైతాంగానికి ముప్పులున్నాయి. అవి హిమాలయ పర్వత శ్రేణుల్లో పండే ఆపిల్ అని గుర్తుపెట్టుకోవాలి. అంత మాత్రమే కాదు పాల ఉత్పత్తులు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. తద్వారా అమూల్ లాంటి సహకార సంఘాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ప్రభుత్వం నుండి నిర్థిష్టమైన ప్రకటన కరవు అయినా నేపథ్యంలో భారతదేశానికి ఆహార పదార్థాల సరఫరా దిగుమతులు తగ్గితే గ్రామీణాఆర్థికవ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రభుత్వం ఏమి చేయాలి. రైతులకు క్రెడిట్ సౌకర్యం పెంచాలి. అంతమాత్రమే కాదు సబ్సిడీలు కూడా అందించాలి. మౌలిక వసతులు కల్పన చేయాలి.

- భారత అవినాష్, జనగామ

### డేటా భద్రతకు ముప్పు!

దేశంలో ప్రభుత్వ, ప్రైవేటుసేవలకు ఆధార్ తప్పనిసరి గుర్తింపు పత్రంగా మారడంతో, దీని వినియోగం విశిష్ట స్థాయికి చేరుకుంది. ఈవిస్తృత వినియోగమే ఆధార్‌ను అత్యంత శక్తిమంతమైన సాధనంగా మార్చింది. అదేసమయంలో, ఇదికోట్ల మంది భారతీయుల సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని కలిగి ఉన్న అతిపెద్ద డేటాబేస్‌గా మారింది. దీంతో, ఈడేటా ఎంత సురక్షితం?అనే ప్రశ్నబలంగా వినిపిస్తోంది. స్కానింగ్‌ల రూపంలో ఆధార్‌ను నిర్లక్ష్యంగా సేకరించి నిల్వ చేయడం డేటా భద్రతకు తీవ్ర ముప్పుగా మారుతోంది.

-కె.రామారావు, నల్గొండ

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రమాణాలు లేని ఫలితాలు ప్రమాదకరం!

*తరగతి గదిలో సరదాగా సుహృద్భావ వాతావరణం నెలకొనాలి. ఫలితాలు తేవడం ఉపాధ్యాయులకు కష్టమైన పనికాదు. వాటిపైనే ఆధారపడి గ్రేడింగ్ ఇవ్వాలనుకుంటే అది పూర్తిగా అసంబద్ధమైన విషయం. ప్రమాణాలు పెంచే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. విద్యావేత్తలతో సంప్రదింపులు జరిపి సలహాలు సూచనలు తీసుకోవాలి. కేవలం ఫలితాలు ముఖ్యం అనుకుంటే అది అజ్ఞానమే అవుతుంది. అందుకేనేమో తరగతి పరీక్షల్లో సఫలమైన చాలామంది నిజజీవిత పరీక్షలో మాత్రం విఫలం కావడం గమనార్హం. అందుకు బాధ్యత మన విద్యా వ్యవస్థదే. దానిని నడిపిస్తున్న మన అధికారులదే. మనం నేర్పే విద్య సమాజానికి పనికొచ్చే పౌరులను, జీవితంలో సమస్యలను ఎదుర్కొని సాగిపోయే వ్యక్తులను తయారు చేయాలి.*

శ్రీ శ్రీ కుమార్

పిల్లవాడికి మొదటి గురువు తల్లి. చిన్న చిన్న విషయాలను ఎన్నింటినో నేర్పుతుంది. తర్వాత స్థానం తండ్రి ఆక్రమిస్తాడు. చేయదగినవి చేయకూడని పనులు తండ్రి శిక్షణలో పిల్లవాడు నేర్చుకుంటాడు. తన వయసు పిల్లలు దొరికితే వారి నుండి అనేకం నేర్చుకుంటాడు. ఇక బడికి పోవడం మొదలుపెడితే అక్కడ గురువు చెప్పేది అతడికి వేదం. గురువు మాట, గురువు ప్రవర్తన విద్యార్థి మానసిక వ్యవ స్థపై బలమైన ముద్ర వేస్తాయి. చిన్న స్థాయి నుండి కూడా గురువు మీద గురి ఎక్కువగా ఉంటుంది. అతడిని ఆదర్శంగా తన రోల్‌మోడల్‌గా భావిస్తాడు. ప్రతి తరగతిలో అతడు రాసిన పరీక్షలు అతడి నిజ జీవితానికి బాటలు వేస్తాయి. అవి అతడి భవిష్యత్తును నిర్ణయిస్తాయి. భారత దేశంలో కోటిమందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 25 కోట్ల మంది విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో చదువు నేర్చుకుంటున్నారు. అదే విధంగా రాష్ట్రంలోనూ దాదాపు 17 లక్షల మంది విద్యార్థులున్నారు. వారందరికీ సరి యైన విద్య అందుతున్నదా అనేది మన ముందున్న ప్రశ్న. ప్రీ ప్రైమరీ, అంగన్వాడి, ప్రాథమిక, ప్రాథమికోన్నత, సెకం డరీ పాఠశాలలు ఉండగా మరో ప్రక్క గిరిజన ప్రాంతాల్లో గిరిజన విద్యా వికాసకేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు, పేద విద్యార్థుల కోసం వివిధ యాజమాన్యాల కింద గురుకులాలు నడుస్తున్నాయి. ఇవన్నీ పాఠశాల విద్య కిందకే వస్తాయి. ఇంతకాలం ఇంటర్మీడియట్ విద్య కోసం ఒక ప్రత్యేక బోర్డు నడుస్తున్నది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణ యంలో భాగంగా ఇంటర్మీడియట్ విద్య పాఠశాల విద్యలో విలీనం కానున్నది. అంటే ఒకటి నుండి ఇంటర్ వరకు పాఠ శాల విద్యగా పరిగణించబడుతుంది. ఇది పూర్తిగా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానానికి అనుగు ణంగా తీసుకున్న నిర్ణయం. ఒకప్రక్క నూతన విద్యా విధానాన్ని ఈ రాష్ట్రం అమలు చేయబోవడం లేదంటూనే మరో పక్క దాని మార్గదర్శకాలను అమలు చేయడం ద్వంద్వనీతి అవుతుంది. విద్యార్థి మొదటి తరగతి నుండి పదవ తరగతి ఇంటర్మీడియట్ వరకు నెలకుఒకసారి, త్రైమాసిక, అర్ధవార్షిక పరీక్షలతో పాటుగా వార్షిక పరీక్షలు రాస్తాడు. అతడురాసిన విషయాన్ని బట్టి మార్కులు సాధిస్తాడు. ఈ అభ్యసనా సామర్థ్యాలు కేవలం అతడు సాధించిన మార్కుల బట్టి నిర్ణయించలేము. ఎందుకంటే దానికి చాలా అంశాలు కారకాలుగా కారణాలుగా ఉంటాయి. విద్యార్థి గృహ వాతావరణం ముఖ్యంగా తల్లిదండ్రుల ఆర్థిక, సామాజిక అక్షరాస్యత నేప థ్యాలు అతడిని బాగా ప్రభావితం చేస్తాయి. పాఠశాలలో చేరిన తర్వాత అక్కడి వాతావరణం కూడా విద్యార్థి మన సుపై ప్రభావం చూపుతుంది. బడిలో కనీస సౌకర్యాలు తరగతి గది, బెంచీలు, టాయిలెట్స్, మంచినీటి వసతి, క్రీడా ప్రాంగణం వారి చదువు పట్ల ఆసక్తి పెంచుతుంది. ముఖ్యంగా అతడిని ఒక తల్లిలాగా తండ్రిలాగా అనునయి స్తూ అభినందిస్తూ ప్రోత్సహిస్తూ అక్కును చేర్చుకునే గురువులకు బాగాదగ్గరవుతారు. అది అతడి అభివృద్ధికి దోహద పడుతుంది. పాతకాలంలో గురువులు తాము పని చేసే ఊరిలోనే నివసిస్తూ గ్రామస్తుల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేస్తూ ఊరికి అండదండగా ఉండేవారు. మారిన కాలమాన పరిస్థితుల్లో ఉపాధ్యాయుల పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కొన్ని సబ్జెక్టులలో వెనుకబాటుకు ఉపాధ్యాయుల కొరతే ప్రబల కారణం. వారుపై తరగతులకు చేరుతున్న ఆసబ్జెక్టులలో పట్టణ విద్యార్థులతో పోటీ పడలేకపోవడం సహజమే. మరి ఇలాంటి చోట్ల 100 ఫలితాలు రావాలని పెర్ఫార్మెన్స్ ప్రాతిపదికన టీచర్లకు గ్రేడింగ్ అమలు జరిపితే దానికి ఉపాధ్యాయులు ఎలా కారణమవుతారు? అందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించవలసి



ఉంటుంది. తనబాధ్యత నిర్వర్తించకుండా ప్రభుత్వం కేవలం ఉపాధ్యాయులనే బాధ్యులు చేస్తామనడం నిర్హేతుకం, అశాస్త్రీయం. విద్యార్థుల మానసిక స్థాయిలు కూడా పరిగణనలోనికి తీసుకోవాలి. మొదటగా విద్యార్థులలో ప్రమాణాలు పెంపొందించే దిశగా చర్యలుచేపట్టాలి. ఇటీవల జరిగిన అధ్యయనంలో ఐదవ తరగతి విద్యార్థికి రెండవ తరగతి స్థాయి అభ్యసన సామర్థ్యాలు, 8వ తరగతి చదువుతున్న వారికి ఐదవ తరగతి స్థాయి అభ్యసనా సామర్థ్యాలు ఉన్నట్లు తేలింది. ప్రభుత్వం అధికారులు వీటిని పరిశీలించిలోపం ఎక్కడ ఉన్నదో గ్రహించి చర్యలు చేపట్టాలి. ముఖ హాజరుతో పాఠశాల ముఖచిత్రం మారదుకదా! దానివల్లఒరిగిందేమిటి? హాజరుపై ఉన్న శ్రద్ధ బోధనపై కొరవబడుతుంది. తరగతిగది ఒత్తిడికి దూరంగా ప్రశాంతమైన వాతావరణంలో నడవాలి. మన విద్యాశాఖలో పర్యవేక్షణ లోపంచాలా ఉంది. ఆసక్తి, అనుభవమున్న టీచర్లను ఫార్మాట్లు నింపడానికి, పై అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం పంపడానికి వినియోగిస్తే పాఠశాలల్లో ప్రమా ణాలు ఎట్లా పెరుగుతాయి? వారికి బోధనేతర పనులు అప్పగిస్తే బోధన చతికిలబడుతుంది. బోధనా అంశాలలో బోధనా పద్ధతులలో వచ్చే నూతన పోకడలలో ఉపాధ్యాయులకు శిక్షణ నివ్వాలి. అది కూడా తరగతులకు నష్టం జరగకుండా మాత్రమే. ప్రభుత్వానికి ఫలితాలు కావాలా? ప్రమాణాలు కావాలా?ప్రమాణాలతో కూడిన ఫలితాలు కావాలా? గత కొన్నిఏళ్లుగా ఫలితాలు పదవ తరగతి స్థాయిలో చాలా బాగా వస్తున్నాయి. నేటి రోజుల్లో 10వ తరగతి ఫెయిల్ కావడం చాలాకష్టం. కానీ పదవతరగతిలో ఉత్తీర్ణులై ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు పాస్ కాలేకపోతున్నారు. ప్రమాణాలు లేని ఫలితాలు ప్రమాదకరం. మన రాష్ట్రంలో అనేక కళాశాలల్లో ప్రయోగశాలలుండవు. ఉన్నా దాని లోని పరికరాలనుఉపయోగించరు. అందుకే విద్యార్థులు తర్వాత కాలంలో వృత్తి విద్యాకోర్సుల్లో చేరినప్పుడు వారి బాధలు వర్ణనాతీతం. ఫలితాలగూర్చి ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తే బోధన దారి తప్పుతుంది. సంవత్సరం పొడవునా బోధించినప్పటికీ ఆశించిన ఫలితాలు రావనే భయం ఉన్నవారు ఇతర మార్గాలకై అన్వేషిస్తారు. ఏడాది మొత్తం కష్టపడిన దానికంటే పరీక్ష రోజు 'కాసేపు కష్టపడితే' ఉపాధ్యాయుడు ప్రభుత్వం ఆశించే ఫలితాల కంటే మిన్నగా తెప్పించగలుగుతాడు. కానీ ప్రమాణాలు ఎలా పెరుగుతాయి? మెడమీద కత్తి పెడితే జరిగేది బోధన కాదు, అభ్యసనం కాదు. ఫలితాలు ఆకాశంలో ప్రమాణాలు పాతాళంలో ఉంటాయి. చిన్నతరగతుల నుండే లేని ప్రమాణాలు ఒకేసారి పదవ తరగతిలోను లేక ఇంటర్మీడియట్ స్థాయిలోను అకస్మాత్తుగా ఎలా వస్తాయి? ప్రమాణాలతో కూడిన ఫలితాలు రావాలంటే అందుకు కొంత సమయం అవసరం. అది ఆరో తరగతినుండి ప్రారంభమైతే ఆ రెండింటిని జమిలిగా సాధిం చవచ్చు. అంతేకానీ ఫలితాలైనా ప్రమాణాలైనా తెల్లారేసరికి ఆకాశంనుండి ఊడిపడవనీ మన అధికారులు ఏనాడు గ్రహి స్తారో? పరీక్షలంటే విద్యార్థికి భయం కలుగకూడదు. పరీక్షనాడు జరిగే ఒక చిన్న సంఘటన విద్యార్థి జీవితాన్ని మొత్తాన్ని మార్చకూడదు. పరీక్షలు కూడా ఏదో ఒక మూడు గం టలు జరిపి విద్యార్థి స్థాయిని భవిష్యత్తును నిర్ణయించడం సరికాదు. అది ఒక నిరంతర ప్రక్రియగా సాగాలి. ఫిబ్రవరి మాసం ప్రవేశించింది. ఇళ్లలో వార్షిక పరీక్షల దృష్ట్యా గంభీరమైన వాతావరణం నెలకొనడం సహజమే. పరీక్షలు, మార్కులు, ర్యాంకుల పేరుతో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారు. పరీక్ష ముఖ్యమే కానీ జీవితం అంతకంటే ముఖ్యమని అం దరూ గుర్తెరగాలి. పరీక్షను సరదాగా రాసినవాడు జీవితాన్ని కూడా ఒక ఆటలాగా ఎదుర్కొంటాడు. ఒడిదుడుకులకు భయపడడు. విద్యాభ్యాసం ఆహ్లాదకర వాతావరణంలో జరగాలి. అసలు విద్యార్థులు ఎంతమంది సంతోషంగా బడికి వెళ్తున్నారు? తరగతి గదిలో సరదాగా సుహృద్భావ వాతావరణం నెలకొనాలి. ఫలితాలు తేవడం ఉపాధ్యాయులకు కష్ట మైన పనికాదు. వాటిపైనే ఆధారపడి గ్రేడింగ్ ఇవ్వాలనుకుంటే అది పూర్తిగా అసంబద్ధమైన విషయం. ప్రమాణాలు పెంచే దిశగా ప్రభుత్వం ఆలోచనచేయాలి. విద్యావేత్తలతో సంప్రదింపులు జరిపి సలహాలు సూచనలు తీసుకోవాలి. కేవలం ఫలితాలు ముఖ్యం అనుకుంటే అది అజ్ఞానమే అవుతుంది. అందుకేనేమో తరగతి పరీక్షల్లో సఫలమైన చాలామంది నిజజీవిత పరీక్షలో మాత్రం విఫలం కావడం గమనార్హం. అందుకు బాధ్యత మన విద్యా వ్యవస్థదే. దానిని నడిపిస్తున్న మన అధికారులదే. మనం నేర్పే విద్య సమాజానికి పనికొచ్చే పౌరులను, జీవితంలో సమస్యలను ఎదుర్కొని సాగిపోయే వ్యక్తులను తయారు చేయాలి. •

# సంపూర్ణ ఆరోగ్యమే నిజమైన సంపద

ఎం.దామోదర్

మనిషి ఆరోగ్యంగా ఉండాలను కోవడం తప్పు కాదు. శ్రీమంతుడిగా, గౌరవంగా, సుఖసంతోషాలతో జీవించాలనుకోవడం కూడా దురాశ కాదు. ఇవన్నీ ప్రతి పౌరుడి సహజమైన ఆకాంక్షలే, ప్రాథమిక హక్కులే. కానీ ఈ లక్ష్యాలు నిజమవ్వాలంటే ముందుగా మన జీవనశైలిపై మనకే నియంత్రణ ఉండాలి. ఈరోజుల్లో చాలామంది విజయం అంటే డబ్బు, హోదా, అధికారమేనని భావిస్తున్నారు. కానీ ఆరోగ్యం లేకపోతే ఆ విజయం కూడా భారమే. శరీరం, మనస్సు రెండూ సమతుల్యంలో ఉన్నప్పుడే మనిషి నిజమైన ఆనందాన్ని అనుభవించగలడు. అందుకే చిత్తశుద్ధి, సంకల్పబలం, క్రమశిక్షణతో కూడిన మంచి జీవనశైలిని అవలంబిస్తే ఆరోగ్యం, సంపద, సంతోషం మన వెంటనే నడుస్తాయి. ఏ మంచి కార్యమైనా, ఏ అద్భుతమైన విజయమైనా రాత్రికి రాత్రే సాధ్యం కాదు. ఓర్పు, స్థిరత్వం, నిరంతర ప్రయత్నం అవసరం. లాభనష్టాలు, కష్టసుఖాలు సహజం. వాటిని గుండెధైర్యంతో ఎదుర్కొంటూ ముందుకు సాగేవాడే జీవితంలో గెలుస్తాడు. అలాంటి జీవన విధానమే మనిషిని అంతిమ విజేతగా నిలబెడుతుంది. అదే పరిపూర్ణ జీవితానికి బాటలు వేస్తుంది. నేటి మనిషి జీవనశైలిలో ఆరోగ్య అలవాట్ల కంటే అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లే ఎక్కువయ్యాయి. ఫాస్ట్‌ఫుడ్, అధిక కొవ్వులు, చక్కెరతో నిండిన ఆహారం, సమయానికి భోజనం చేయకపోవడం వంటి అలవాట్లు మనశరీరాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, గుండెజబ్బులు, కాలేయ సమస్యలు విపరీతంగా పెరుగుతున్నాయి. మనిషి అనారోగ్యంతో బాధపడినప్పుడే ఆరోగ్యం విలువ తెలుస్తోంది. అప్పటికి చాలా ఆలస్యమై ఉంటుంది. దేశవ్యాప్తంగా 45ఏళ్లలోపు వ్యక్తుల మరణాలకు సుమారు 42శాతం మేర జీవనశైలి లోపాలే కారణమని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) అధ్యయనం చెబుతోంది. ధూమపానం, మద్యం సేవనం ప్రధాన రిస్క్ ఫ్యాక్టర్లుగా మొదటిస్థానాల్లో ఉన్నాయి. అంతేకాదు, ఏ వ్యసనాలు లేకపోయినా శారీరక కదలికలు లేకపోవడం, ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవడం, అధిక స్క్రీన్‌టైం కూడా ప్రాణాంతక రోగాలకు దారితీస్తోంది. ఐటీరంగంలో పనిచేసే యువత రోజుకు 10నుంచి12 గంటలు కంప్యూటర్ల ముందు కూర్చునే పరిస్థితి. దీనివల్ల వెన్నుముక సమస్యలు, మెడనొప్పులు, కండరాల బలహీనత పెరుగుతున్నాయి. మరోవైపు ఫ్యాట్ లివర్ లాంటి సమస్యలు నిశ్శబ్ద హంతకుల్లా వ్యాపిస్తున్నాయి. దాదాపు మూడోవంతు భారతీయులకు ఈ సమస్య ఉన్నట్టు అంచనాలు చెబుతున్నాయి. ఇవన్నీ మనకు ఒకే సందేశం ఇస్తున్నాయి మన జీవనశైలి మారకపోతే మనభవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. వ్యసనాల బారినపడి ఎవరైనా మరణిస్తే, అది ఆవ్యక్తి ఒక్కరి నష్టం కాదు. అతని కుటుంబానికి చేసిన ఘోరమైన నమ్మకద్రోహం. చెట్టు కూలితే పిట్టలు ఎలా అల్లాడిపోతాయో, అలాగే ఆ కుటుంబం అంతా బాధపడుతుంది. అందుకే ముందే జాగ్రత్త పడటం అవసరం. పెద్దలు చెప్పినట్లే ఆరోగ్యం చేజారితే కీర్తి, ధనం, గౌరవం ఏదీ మనిషికి ఆనందాన్ని ఇవ్వదు. ఈ ఆధునిక ప్రపంచంలో ఏకార్యం సాధించాలన్నా ముందుగా కావలసింది ఆరోగ్యం. నిజంగా ఆరోగ్యంగా ఉన్నవాడే అసలైన ధనవంతుడు. ప్రతి మనిషిలో ఏదోఒక ప్రతిభ ఉంటుంది. ప్రతి జీవితానికి ఓ అర్థం, ఓప్రయోజనం ఉంటుంది. జీవితంలో అన్నీ కోల్పోయినా ఒక్కటి మాత్రం మిగిలే ఉంటుంది భవిష్యత్తు. దానిని తీర్చిదిద్దుకోవడం మన చేతుల్లోనేఉంది. మంచి ఆహారం, క్రమమైన వ్యాయామం, తగిన నిద్ర, సానుకూల ఆలోచనలు, కుటుంబంతో గడిపే నాణ్యమైన సమయం ఇవన్నీమంచి జీవనశైలిలో భాగాలు. అలాగే టైం మేనేజ్మెంట్ కంటే ముఖ్యమైనది సెల్ఫ్ మేనేజ్మెంట్. మనల్ని మనం నియంత్రించుకున్నప్పుడే కాలాన్ని సద్వినియోగం చేసుకోగలం. ప్రతి ఒక్కరూ టైం బిలియనీర్లే. కానీ ఆ కాలాన్ని ఎలా వినియోగిస్తున్నామన్నదే ముఖ్యం. ఆరోగ్యం, వికాసం, ఆర్థిక విజయం కోసం కాలాన్ని సరైనదిశలో పెట్టుబడిపెట్టినప్పుడే జీవితం అర్థవంతమవుతుంది. మనిషి కలకాలం జీవిస్తానన్నట్టు శ్రమించాలి, ఈరోజే మరణిస్తానన్నట్టు జీవించాలి. అంటే భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి, కానీ ఈక్షణాన్ని పూర్తిగా ఆస్వాదించాలి. సుఖదుఃఖాల మేళవింపే జీవితం అని గ్రహించాలి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి, బంధాల్ని నిలబెట్టుకోవాలి. ఈ గొలుసు కట్టుతోనే మనిషి జీవితానికి సార్థకత వస్తుంది. •

# ప్రశ్నార్థకంగా మారుతున్న ప్లాస్టిక్ నియంత్రణ

చిలగాని జనార్ధన్

ప్లాస్టిక్ నియంత్రణ ప్రశ్నార్థకంగా మారింది. ఇది ప్రపంచానికే పెనుముప్పుగా మారింది. ప్రధానంగా మన భారత దేశంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. వాటర్ బాటిల్స్, ఆహార పదార్థాలు, నిత్యావసర సరకులకు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్స్ వల్ల క్యాన్సర్, గుండె జబ్బు, మెదడు, తదితర వ్యాధులకు గురౌతున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తోన్నా చెవికెక్కడం లేదు. మన దేశంలో రోజుకు రెండు కోట్ల సింగిల్ యూస్ ప్లాస్టిక్ బాటిల్స్ రీసైక్లిన్ అవుతున్నట్లు లెక్కలు చెబుతుండగా..లెక్కించలేనంతగా భూమి, జలాషయాల్లో ప్లాస్టిక్ కూరుకపోవడం, జంతూ జీవరాశులపై తీవ్ర ప్రభావం పడడం ఆందోళనకు గురి చేస్తుంది. కుగ్రామంలో సైతం వాటర్ బాటిల్స్ దర్శనమిస్తున్నాయి. పల్లె, పట్నం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో వాటర్ బాటల్స్, ప్లాస్టిక్‌ను విరివిగా వినియోగిస్తున్నారు. కిరాణా, షాపింగ్, బస్టాండ్, హోటల్స్ ఇలా ఏ దుకాణం ముందు చూసినా వాటర్ బాటిల్స్ వందల సంఖ్యలో ప్రదర్శిస్తున్నారు. ఆయా స్టాళ్ల ముందు గుట్టలు గుట్టలుగా వాటర్ బాటల్స్‌ను ప్రదర్శిస్తున్నారు. అవి ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ ఉంటాయి. వాస్తవానికి 25 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రత ఉన్న సురక్షిత ప్రాంతాల్లో వాటర్ బాటిల్స్‌ను నిల్వ ఉంచాలనే నిబంధనలను దుకాణాదారులు తుంగలో తొక్కుతున్నారు. సరైన ల్యాబ్‌లు లేకుండా, నీటి నాణ్యతా ప్రమాణాలు లేకుండానే ఆయా కంపెనీలు ప్యాకెడ్ వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తున్నట్లు విమర్శలున్నాయి. దాహార్తితో వచ్చే ప్రయాణికులు, ఇతరులు వీటిని వినియోగిస్తూ, వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. పీల్చే గాలి సైతం కలుషితమౌతుంది. వాయువులో ప్లాస్టిక్ రేణులున్నట్లు ఇటీవల కాలంలో వెల్లడి కావడం ఆందోళనకు గురి చేస్తుంది. తాగే ప్లాస్టిక్ బాటిల్‌లో సైతం నానో ప్లాస్టిక్ ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి రక్తనాళాల్లో పేరుకపోయి గుండె జబ్బులు, క్యాన్సర్‌లాంటి వ్యాధులకు కారణమోతున్నట్లు స్పష్టమోతుంది. మైక్రో ప్లాస్టిక్ మెదడుకు కూడా హాని చేస్తున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో నలుగు వందల రకాల హానికలిగించే కారకాలున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ను హై రిస్క్ కేటగిరీలో చేర్చినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. అనేక నిబంధనలున్నప్పటికీ వాటిని పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సిబ్బంది కరువయ్యారు. ప్రతీ సంవత్సరం వాటర్ బాటిల్ కంపెనీలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. అవసరమైతే నిర్వాహ



కులపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఎక్కడా కార్యాచరణలో పెట్టడం లేదు. స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల పేరుతో యేటా వేలాది కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నాయి. అయినప్పటికీ ఫలితాలను ఇవ్వడం లేదు. గ్రామ, పట్టణాల్లో నల్లా నీటిని సరఫరా చేస్తున్నా వాటిని ప్రజలు తాగడం లేదు. గతంలో తెలంగాణలో కార్పోరేషన్ ద్వారా అప్పులు చేసి మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టారు. రాష్ట్రంలో 57లక్షల కుటుంబాలకు తలసరి వంద లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 25 శాతం ప్రజలు కూడా ఈ నల్లా నీటిని వినియోగించడం లేదంటే అతియోశక్తి లేదు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి కోసం ఆరో ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. గ్రామానికి ఒటి రెండు చొప్పున రివర్స్ ఆస్మాసిస్ (ఆర్‌వో) ప్లాంట్లు నిరంతరం పని చేస్తున్నాయి. కొన్నిచోట్ల స్వచ్ఛంద సంస్థలు, మరికొన్ని చోట్ల పంచాయతీలూ నిర్వహిస్తున్నాయి. బబుల్(క్యాన్)కు రూ. ఐదు నుండి 20 వరకు వసూలు చేస్తున్నాయి. ఆశ్చర్యకరమేమంటే.. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారిక, అనధికారిక కార్యక్రమాల్లో సైతం ఆర్‌వో ప్లాంట్ల నీటిని వినియోగిస్తున్నారు. సభలు, సమావేశాల్లో వాటర్ బాటిల్స్‌నే వినియోగిస్తున్నారు. అయితే ఈ నీరు ఎంత వరకు సురక్షితమనేది ప్రశ్నార్థకమే. ఫిల్టర్స్‌ద్వారా ఆరోగ్యాన్నిచ్చే ఖనిజాలు సైతం వేరు చేయడం, ఈ నీటిని దీర్ఘకాలికంగా వాడడం వల్ల అనారోగ్యపాలౌతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. కాల్షియం, మెగ్నిషియం లాంటి ఖనిజాలు ఈ నీటిలో లేకపోవడంతో కీళ్లు, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నట్లు తెలుస్తుంది. రక్తహీనతతో పాటు వ్యాధి నిరోధక శక్తి సైతం కోల్పోతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. వాటర్‌ప్లాంట్ల ప్రమాణాలు, నిబంధనలు, ల్యాబ్ తదితర అంశాలతో పాటు అనుమతుల జారీ లాంటి అంశాల్లో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలతో పాటు ప్రజారోగ్య పరిధిలోని ఫుడ్ సేఫ్టీ విభాగం కూడా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. వాటర్ పాంట్ల తనిఖీలు, అనుమతుల విషయంలో సంబంధిత అధికారుల పాత్ర నామమాత్రంగానే ఉంటుంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు క్షేత్ర స్థాయిలో అన్ని పరిశీలించాకే అనుమతులు ఇవ్వాలి. పంచాయతీ రాజ్ శాఖలో నీటి నాణ్యతను పరిశీలించే ప్రత్యేక విభాగం గతంలో ఉండేది. ప్రస్తుతం ఎత్తేశారు. దీంతో విచ్చలవిడిగా అనారోగ్యాన్నిచ్చే వాటర్ ప్లాంట్లు వెలుస్తున్నాయి. జిల్లా కేంద్రాల్లో అక్కడక్కడ ఫుడ్ సేఫ్టీ ధికారులున్నా కలెక్టర్లు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ఇలా అన్ని వర్గాల వారు తాగునీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. •



# జనగణమనకు ముందే వందేమాతరం.. ఆలాపన

## కేంద్ర ప్రభుత్వం ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** జాతీయ గేయం వందేమాతరంఆలపించే విషయంలో కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించాలని ఆదేశించింది. జాతీయ గీతం జనగణమన పాడటానికి ముందు వందేమాతరం కూడా పాడాలని ఆదేశించింది. బుధవారం ఉదయం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ తప్పనిసరిగా నిలబడాలి. గేయంలోని ఆరు చరణాల్ని ఆలపించాల్సిందే. వీటిలో కాంగ్రెస్ 1937లో తొలగించిన నాలుగు చరణాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా ఆలపించాలి. గతంలో నెహ్రూ ఆధ్వర్యంలో సెక్యులర్ అంశాలను సాకుగా చూపి, ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు గేయంలోని నాలుగు చరణాలను తొలగించారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం వాటిని కూడా తిరిగి చేర్చింది. ఈ అంశంపై గత ఏడాది కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటలయుద్ధం నడిచింది. తాజా మార్గదర్శకాల ప్రకారం సినిమా హాళ్లలో వందేమాతరం ప్లే చేయాల్సిన అవసరం లేదు. అలాగే థియేటర్లలో లేదా న్యూస్ రీల్స్‌లో ఈ గేయం ప్లే అవుతుంటే నిలబడాల్సిన అవసరం లేదు. ఇలాంటి చోట్ల ఎక్కువ మంది నిలబడటం వల్ల కార్యక్రమానికి ఆటంకం కలగడం, అలాగే శాంతి భద్రతల సమస్యను దృష్టిలో ఉంచుకుని తాజా ఆదేశాలిచ్చింది. వందేమాతర్ం ఆలపించడానికి మూడు నిమిషాల 10 సెకండ్ల సమయం పడుతుందని కేంద్రం వెల్లడించింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు అయినటువంటి రాష్ట్ర వేడుకలు, పౌర సన్మానాలు, రాష్ట్రపతి పర్యటన, గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు, మంత్రులు పాల్గొనే వేడుకలు, జాతీయ పతాకావిష్కరణ వంటి కార్యక్రమాల సందర్భంగా ఇకపై వందేమాతరం ఆలపించాలి. ఇప్పటికే పద్మ వంటి కేంద్ర అవార్డులు ప్రదానం చేసే వేడుకల్లో ఈ గేయాన్ని ఆలపిస్తున్నారు. ఈ నిబంధనలు అతిక్రమించి జాతీయ గేయాన్ని అవమానిస్తే వారికి గరిష్టంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. 'వందేమాతర్ం గేయాన్ని 1875లో బంకించంద్ర ఛటర్జీ రచించారు. తర్వాత దీన్ని ఆయనే తన ఆనంద్ మఠ్ అనే నవలలో భాగం చేశారు. ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగానే తాజా ఆదేశాలిచ్చింది.

# కెనడా స్కూలులో కాల్పులు



## 10 మంది మృతి, 25 మందికి గాయాలు

**ఒట్టావా, ఫిబ్రవరి 11:** కెనడాలోని బ్రిటీష్ కొలంబియాలో కాల్పుల ఘటన జరిగింది. ఆ కాల్పుల్లో 10 మంది మృతిచెందారు. మరో 25 మంది గాయపడ్డారు. కాల్పులకు తెగించిన వ్యక్తిని ఓ మహిళగా గుర్తించారు. ఆమెకు బ్రౌన్ కలర్ జుట్టు ఉన్నట్లు రాయల్ కెనిడియన్ మౌంటెడ్ పోలీసులు వెల్లడించారు. కాల్పులు జరిపిన తర్వాత స్కూల్ పరిసరాల్లోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. స్కూల్‌లోనే ఆరుగురి మృతదేహాలను గుర్తించారు. ఆస్పత్రికి తీసుకెళ్తున్న సమయంలో ఓ వ్యక్తి మరణించాడు. ఆ స్కూల్ కమ్యూనిటీ వద్ద ఉన్న ఓ ఇంట్లో మరో ఇద్దరి మృతదేహాలను గుర్తించారు. టంబ్లర్ రిడ్జ్ సెకండరీ స్కూల్‌లో కాల్పుల ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఫైరింగ్ ఘటనలో రెండో షూటర్ ఉన్నారేమో అన్న అనుమానాలు పోలీసులు వ్యక్తం చేశారు. బాధితుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. టంబ్లర్ బ్రిడ్జ పట్టణంలో సుమారు 2500 మంది జనాభా ఉంటారు. అయితే ఈ ఘటన నేపథ్యంలో అక్కడ భద్రతను పెంచారు. స్కూల్‌ను వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఘటన జరిగిన సమయంలో స్కూల్‌లో సుమారు వంది మంది ఉన్నారు. వారిలో విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు. అయితే వాళ్లందర్నీ సురక్షిత ప్రదేశానికి తరలించినట్లు పోలీసులు చెప్పారు.

ఏ కారణం చేత ఆ మహిళా షూటర్ ఇంత దారుణానికి పాల్పడిందో అర్థం కావడం లేదని పోలీసులు చెబుతున్నారు. కాల్పులు జరుగుతున్న సమయంలో కొందరు విద్యార్థులు ప్రాణాలు రక్షించుకునే ప్రయత్నం చేశారు. టంబ్లర్ బ్రిడ్జ్‌లో జరిగిన షూటింగ్ ఘటన తమను కలిచివేసినట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నే తెలిపారు. టంబ్లర్ రిడ్జ్ సెకండరీ స్కూల్‌లో సుమారు 175 మంది విద్యార్థులు ఉన్నట్లు ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా తెలిసింది. వారంతా 7 నుంచి 12వ గ్రేడ్ విద్యార్థులు.

# ఆమె మాట్లాడిన తీరు బాగోలేదు.. అందుకే టారిఫ్‌లు పెంచా

## స్విస్ నేతపై యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 11:** ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై సుంకాల మోత మోగిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. స్విట్జర్లాండ్‌పై టారిఫ్‌లు పెంచడం వెనక విచిత్రమైన కారణాన్ని చెప్పారు. ఆ దేశానికి చెందిన నేత మాట్లాడిన తీరు తనకు నచ్చలేదని.. అందుకే అదనంగా మరో 9 శాతం పెంచానని చెప్పారు. ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'స్విట్జర్లాండ్‌పై 30 శాతం టారిఫ్‌లు విధించాను. అసలు ఆ మొత్తం చాలా తక్కువ. సుంకాల విధింపు తర్వాత నాకు ఒక ఎమర్జెన్సీ కాల్ వచ్చింది. ఆ దేశ ప్రధాని కాల్ చేశారని అనుకున్నాను అప్పుడు ఆ నేత మాట్లాడిన తీరు నాకు నచ్చలేదు. 'సర్.. మాది చాలా చిన్నదేశం. ఈ సుంకాలు మేం భరించలేం' అని అన్నారు. మీది చిన్నదేశమే అయినా అమెరికాతో జరుపుతోన్న వాణిజ్యంలో 42 బిలియన్ డాలర్ల మిగులు ఉందని చెప్పాను. అయినా మాది చిన్నదేశం అంటూ ఆమె పదేపదే అదే మాట చెప్పారు. నాకు ఆమె మాట్లాడిన తీరు నచ్చలేదు. అందుకే సుంకాలు తగ్గించడానికి బదులు.. 30 శాతం నుంచి 39 శాతానికి పెంచాను. ఎలాంటి సుంకాలు చెల్లించకుండా మా దేశానికి స్విస్ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. స్విస్ ఫెడరల్ కౌన్సిల్ సభ్యురాలైన కరిన్ కెల్లర్ సట్టర్ నుంచి ఈ ఫోన్ కాల్ వచ్చింది. కొన్ని వారాల క్రితం కూడా దావోస్ వేదికగా ఈ ఐరోపా దేశాన్ని ఉద్దేశించి ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు.

# డేకేర్ సెంటర్‌లో దుండగుడి కాల్పులు

## 34 మంది మృతి, వారిలో 23 మంది చిన్నారులు

**స్లోంకా, (థాయిలాండ్), ఫిబ్రవరి 11:** థాయ్‌లాండ్‌లో దారుణం చోటుచేసుకుంది. దక్షిణ థాయ్‌లాండ్‌లోని స్లోంకాలో ఓ డేకేర్ సెంటర్‌లో దుండుగులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి 34 మందిని పొట్టనబెట్టుకున్నారు. మృతుల్లో 23 మంది చిన్నారులు ఉన్నట్టు గుర్తించారు. తుపాకులతో డే కేర్ స్కూల్‌లోకి చొరబడిన ఆగంతకులు కాల్పులకు పాల్పడ్డారు. దీంతో భయపడిపోయిన విద్యార్థులు, సిబ్బంది హాహాకారాలు చేస్తూ బయటకు పరుగులు తీశారు. ఇందుకు సంబంధించిన విజువల్స్ ప్రస్తుతం వైరల్‌గా మారాయి. హాట్ యా స్కూల్‌లోకి బుధవారం మధ్యాహ్నం తుపాకితో 18 ఏళ్ల యువకుడు చొరబడి, కాల్పులు జరిపినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో పిల్లలు, సిబ్బంది సహా పలువురు గాయపడినట్టు తొలుత పోలీసులు ప్రకటించారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4.45 గంటల ప్రాంతంలో జరిగినట్టు మీడియా కథనాలు వెలువడ్డాయి. ఎంత మంది చనిపోయారు, ఎందరు గాయపడ్డారనేది అధికారులు ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదని తెలిపాయి. నిందితుడ్ని ఖేమ్‌గా గుర్తించినట్టు పేర్కొన్నాయి. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు, భద్రతా సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అయితే, అప్పటికే నిందితుడు ఘటనా స్థలి నుంచి పరారయ్యాడని, దుండగుడు కాల్పులకు వినియోగించిన ఎం4 రైఫిల్.

# భారతమాతను అమ్మేశారు!

- ట్రేడ్‌డీల్‌పై కేంద్రాన్ని నిశితంగా విమర్శించిన రాహుల్ - ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై కూడా ప్రతిపక్ష నేత విసుర్లు - బడ్జెట్‌లో కీలక రంగాలను విస్మరించారంటూ విమర్శలు - రాహుల్ ఆరోపణలను ఖండించిన కేంద్రమంత్రి హార్‌దీప్‌సింగ్ - అవగాహన లేకనే రాహుల్ మాటలు: కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** భారత్– అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. భరతమాతను అమెరికాకు అమ్మేశారని, ఇది మీకు సిగ్గుగా అనిపించడం లేదా? అని ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో రాహుల్ ధ్వజమెత్తారు. ప్రపంచ క్రమంలో అస్థిరత నెలకున్న వేళ భారత వ్యూహాత్మక ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం రాజీ పడిందని, వాణిజ్య ఒప్పందంతో భారత్‌కు అమెరికాకు అమ్మేసిందని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. బుధవారం లోక్‌సభలో బడ్జెట్‌పై ప్రసంగాన్ని రాహుల్‌గాంధీ ప్రారంభిస్తూ, ట్రేడ్ డీల్ అంశాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మీరు భారతదేశాన్ని అమ్మేశారని నేను అంటున్నాను. భరతమాతను అమ్మేయడం మీకు సిగ్గుగా అనిపించడం లేదా? మన తల్లి భారతమాతను అమ్మేశారు... ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సాధారణ పరిస్థితుల్లో దేశాన్ని ప్రధాన మంత్రి అమ్మరని నాకు తెలుసు. ఆయన భారత్‌ను ఎందుకు అమ్మేశారో తెలుసా? ఎందుకంటే వాళ్లు ఆయన గొంతు పిసుకుతున్నారు. ప్రధాని కళ్లలో మనం భయాన్ని చూడొచ్చు... ఇక్కడ రెండు విషయాలు ఉన్నాయి.. మొదటిది ఎప్‌స్టీన్ ఫైల్స్" అని రాహుల్ గాంధీ అన్నారు. "ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో వ్యాపారవేత్త అనిల్ అంబానీ పేరుందని, మరి ఆయనను ఎందుకు జైల్లో పెట్టలేదు.. హార్దీప్ పూరిని కూడా నేను అడగాలనుకుంటున్నాను.. అతడ్ని ఎప్‌స్టీన్‌కు ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా అధికార పక్ష సభ్యులు లేచి రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఇటు రాహుల్‌గాంధీకి మద్దతుగా ప్రతిపక్ష సభ్యులు లేచినిలబడి అధికార పక్ష సభ్యులకు దీటుగా నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. స్పీకర్ ఇరుపక్షాలకు సర్దిచెప్పి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం రాహుల్‌గాంధీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, బడ్జెట్‌లో కీలక రంగాలను విస్మరించిందని విమర్శించారు. బడ్జెట్‌లో కేంద్ర బిందువుగా అదానీ కంపెనీ ఉంది. ఆ కంపెనీ చెప్పినట్టుగానే రక్షణ రంగ బడ్జెట్‌ను కూర్చారు అంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు గుప్పించారు. ఇక ట్రేడ్ డీల్‌ను మరోమారు ప్రస్తావిస్తూ, ఒకవేళ, ఇండియా కూటమి. వాణిజ్య ఒప్పందంపై డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపి ఉంటే తమ వైఖరి ఏలా ఉండేదో రాహుల్ వివరించారు. విధా నాలను నిర్ణయించడంలో చంచల స్వభావానికి పేరుగాంచిన ట్రంప్ తో వ్యవహరించడంలో భారత్ ఆదర్శంగా వ్యవహరించాల్సింది ఏంటి అనే దానిపై ఆయన మూడు అంశాలను ప్రధానంగా పేర్కొన్నారు. "ట్రంప్‌తో ఇండియా కూటమి వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపి ఉంటే.. తాము ఏమి చేసే వాళ్లమో మీకు చెబుతాను.

ఇందులో అతి ముఖ్యమైన విషయం ఏంటంటే.. మీరు (ట్రంప్) మీ డాలర్‌ను రక్షించుకోవాలనుకుంటున్నారు.. మేము మీ స్నేహితులుగా అందుకు మిమ్మల్ని అభినందిస్తు న్నాము. మీ డాలర్‌ను రక్షించుకోవడానికి తాము మీకు సహాయం చేయాలనుకుంటున్నాం.. కానీ మీరు మీ డాలర్‌ను రక్షించుకోవాలనుకుంటే దానిని రక్షించగల అతిపెద్ద ఆస్తి భారతీయ ప్రజల వద్ద ఉందని దయచేసి గుర్తుంచుకోండి. మీరు ఈ డేటాను యాక్సెస్ చేయాలనుకుంటే, దయచేసి మీరు మాతో సమానంగా మాట్లాడాలని అర్థం చేసుకోండి. తాము మీ సేవకులమని అనుకోవద్దు అని చెప్పేవాళ్లమని రాహుల్ వ్యాఖ్యానించారు.

భారత్ అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఏకపక్షంగా ఉందని, దీనివల్ల భారత రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. ఈ ట్రేడ్ డీల్ అమల్లోకి వస్తే, భారత మార్కెట్‌లోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ప్రవాహం భారీగా పెరుగుతుందని రాహుల్ తెలిపారు.

### రాహుల్ ఆరోపణలు ఖండించిన కేంద్ర మంత్రి హార్దీప్ సింగ్ పూరీ

వివాదాస్పద అమెరికన్ వ్యాపారవేత్త జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్నాయంటూ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర మంత్రి హార్దీప్ సింగ్ పూరీ ఘాటుగా స్పందించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌కు సంబంధించి తనపై వచ్చిన వార్తలపై ఆయన పార్లమెంటు వెలువల క్లారిటీ ఇచ్చారు. రాహుల్ గాంధీకి ఆరోపిణలు చేయడం అలవాటుగా మారిందని.. ఆయన కామెంట్స్ కేవలం వినోదం కోసం మాత్రమేనని ఎద్దేవా చేశారు. ఎప్‌స్టీన్‌తో భేటీ వెనుక అసలు నిజం ఎప్‌స్టీన్‌ను తాను కలిసిన మాట వాస్తవమేనని.. అయితే అది పూర్తిగా అధికారిక, అంతర్జాతీయ ప్రతినిధి బృందంలో భాగంగా జరిగిందని కేంద్ర మంత్రి హార్దీప్ సింగ్ పూరీ వివరించారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో తన ప్రసంగం ముగియగానే వెళ్లిపోతారని, ఇతరుల మాటలు వినే ఓపిక ఆయనకు లేదని పూరీ విమర్శించారు. రాహుల్‌కు అవగాహన లేదు.. అందుకే ఇలా మాట్లాడుతున్నారు: కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఖండించారు. రాహుల్‌కు రాజ్యాంగ నియమాల గురించి తెలియదని.. ఏదైనా ఆరోపణలు చేసే ముందు వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలను దగ్గరపెట్టుకొని మాట్లాడాలన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే రాహుల్ బడ్జెట్ గురించి కాకుండా మిగతా విషయాల గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేవలం రాజకీయ లాభాల కోసం మాత్రమే సభలో రాహుల్ మాట్లాడారని.. అందుకే బడ్జెట్ గురించి తప్ప మిగతా అన్నింటిపై మాట్లాడారని చెప్పుకొచ్చారు.

# భారత్ ఆకాంక్షలను గౌరవిస్తాం..

## యుఎన్‌ఎస్‌సిలో శాశ్వత సభ్యత్వంపై చైనా సంచలన నిర్ణయం!



**బీజింగ్, ఫిబ్రవరి 11:** సుదీర్ఘ కాలంగా సరిహద్దు వివాదాలతో అట్టుడుకుతున్న భారత్–చైనా సంబంధాల్లో సానుకూల మార్పు కనిపిస్తోంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం పొందాలన్న భారత్ ఆకాంక్షలను తాము అర్థం చేసుకుంటామని, అలాగే గౌరవిస్తామని చైనా అధికారికంగా ప్రకటించింది. భారత్ పర్యటనకు వచ్చిన చైనా కార్యనిర్వాహక ఉప విదేశాంగ మంత్రి మా జావోక్సు, భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్‌మిస్రీ మధ్య జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది.

**శాశ్వత సభ్యత్వంపై మారిన స్వరం..**

సాధారణంగా ఐరాస భద్రతా మండలిలో భారత శాశ్వత సభ్యత్వాన్ని చైనా ఎప్పుడూ బహిరంగంగా సమర్థించలేదు. ఇతర అగ్రరాజ్యాలు భారత్‌కు నేరుగా మద్దతు ఇచ్చినప్పటికీ.. చైనా మాత్రం భారత్ ఐరాసలో కీలక పాత్రం పోషించాలని కోరుకుంటున్నాం అంటూ దాటవేసే ధోరణిని అవలంబించేది. అయితే తాజా భేటీలో భారత్ ఆకాంక్షలను గౌరవిస్తాం అని చైనా పేర్కొనడం గమనార్హం. ఇటీవల సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ తర్వాత చైనా నుంచి వచ్చిన మొదటి ప్రధాన సానుకూల సంకేతం ఇదే. కాగా అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇది భారత్‌కు పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వడమేనా? లేక దౌత్యపరమైన మౌనమా? అని కూడా నిపుణులు ఆలోచిస్తున్నారు.

**సరిహద్దుల్లో శాంతి.. వాణిజ్య పురోగతి**

సరిహద్దుల్లో శాంతి, సుస్థిరత నెలకొంటేనే ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడతాయని విక్రమ్‌మిస్రీ ఈ భేటీలో స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలను రాజకీయ, వ్యూహాత్మక కోణంలో పరిష్కరించుకోవాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. వాణిజ్య రంగంలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించి, ఆర్థిక బంధాన్ని బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించారు. ఇటీవల ప్రారంభమైన కైలాష్ మానస సరోవర్ యాత్ర గురించి మిస్రీ ప్రస్తావిస్తూ.. యాత్రను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. 8 నుంచి 10 వకు జరిగిన బ్రిక్స్ షెర్పా సమావేశాల్లో భాగంగా.. ఇరు నేతలూ భేటీ అయ్యారు. ఈ క్రమంలోనే కేవలం రాజకీయ అంశాలే కాకుండా.. ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించుకోవడానికి ఇరు దేశాలు మొగ్గు చూపాయి. వీసా నిబంధనలను సరళతరం చేయడం ద్వారా పర్యాటకం, విద్యా రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు.

# అమెరికా మమ్మల్ని టాయిలెట్‌పేపర్‌కంటే హీనంగాచూసింది

## పాక్ పార్లమెంటులో రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 11:** గతంలో అమెరికాతో జతకట్టి తప్పు చేశామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్‌అన్నారు. ఆఫ్ఘన్ యుద్ధం సమయంలో ఆ నష్టం భారీగా జరిగిందన్నారు. పాకిస్థాన్ పార్లమెంట్‌లో ఆయన ప్రసంగించారు. వ్యూహాత్మక అవసరాల కోసం అమెరికా తమను వాడుకున్నదని, లక్ష్యాలు నెరవేరిన తర్వాత తమను వదిలేసిందన్నారు. టాయిలెట్ పేపర్ కన్నా హీనంగా తమను అమెరికా చూసిందని మంత్రి ఖవాజా అన్నారు. గతంలో మిలిటెంట్లకు సపోర్టు చేసి తప్పు చేశామని ఆసిఫ్ అంగీకరించారు. దీన్ని వ్యతిరేకించడం వల్ల తమకు దీర్ఘకాలిక నష్టం జరిగిందన్నారు. గతంలో మిలిటరీ పాలకులు చేసిన తప్పిదాల వల్ల పాకిస్థాన్‌లో ఉగ్రవాదం పెరిగినట్లు మంత్రి ఆసిఫ్ చెప్పారు. రెండు ఆఫ్ఘన్ యుద్ధాల్లో పాకిస్థాన్ పాలుపంచుకోవడం తప్పిదమే అని వెల్లడించారు. సెప్టెంబర్ లెవన్ దాడుల తర్వాత అమెరికాతో తాము సన్నిహితంగా ఉన్నామని, తాలిబాన్‌ను వ్యతిరేకించామన్నారు. ఆఫ్ఘన్ నుంచి అమెరికా సేనలను ఉపసంహరించిన తర్వాత పాకిస్థాన్ ఒంటరి అయిందన్నారు. దీని వల్ల హింసా, విప్లవం, ఆర్థిక సమస్యలు ఉత్పన్నమైనట్లు చెప్పారు. ఆఫ్ఘన్ యుద్ధాల్లో పాకిస్థాన్ కలిసినట్లు వస్తున్న ఆరోపణలను మంత్రి ఖండించారు.

# ఎస్సీఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్ - కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని, క్రీమీ లేయర్‌ను మినహాయించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. నిర్ణీత సమయంలోపు సమగ్ర నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. 2024లో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఉపవర్గాలుగా విభజించేందుకు (కోటాలో కోటా) అనుమతినిస్తూ చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఆ తీర్పు వెలువడిన తర్వాత కేంద్ర ప్రభుత్వం క్రీమీ లేయర్ అమలుపై లేదా వర్గీకరణపై తీసుకున్న చర్యలు ఏమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం ఒకే వర్గానికి లేదా ఆ వర్గాల్లోని సంపన్నులకే పరిమితం కాకుండా అత్యంత వెనుకబడిన ఉపకులాలకు చేరాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో వివిధ ఉపకులాల ప్రాతినిధ్యంపై స్పష్టమైన డేటాను సేకరించాలని, అలాగే క్రీమీ లేయర్‌ను గుర్తించేందుకు అవసరమైన ప్రమాణాలను నిర్ణయించాలని పిటిషనర్లు కోర్టును కోరారు. వర్గీకరణపై స్పష్టమైన నిబంధనలు ఆగస్టు 2024 నాటి తీర్పులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించే అధికారం ఇచ్చింది. అయితే ఈ ప్రక్రియ ఏకపక్షంగా ఉండకూడదని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా శాస్త్రీయ ఆధారం, తగిన డేటా ఆధారంగానే వర్గీకరణ జరగాలని స్పష్టం చేసింది.

అంతేకాకుండా ఓబిసి తరహాలోనే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా క్రీమీ లేయర్ అమలును పరిశీలించాల్సిన అవసరం ఉందని అప్పట్లోనే అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై తన వివరణ ఇవ్వాలని ఆదేశించిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సమాధానం, గణాంకాల ఆధారంగానే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్ అమలుపై ఒక తుది నిర్ణయం వచ్చే అవకాశం ఉంది.

# 330 గ్యాలన్ల సల్ఫ్యూరిక్ యాసిడ్ కొనుగోలు చేసిన ఎప్‌స్టీన్?



**వాషింగ్టన్, ఫిబ్రవరి 11:** ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి అమెరికా న్యాయ శాఖ మరిన్ని పత్రాలను (ఎప్‌స్టీన్ ఫైల్స్) విడుదల చేసింది. ఇందులో విస్తుపోయే అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసుపై 2018లో ఎఫ్‌బిఐ దర్యాప్తు మొదలుపెట్టిన రోజున ఎప్‌స్టీన్ 330 గ్యాలన్ల సల్ఫ్యూరిక్ యాసిడ్ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేర కు ఫైళ్లలో ఆధారాలు లభ్యమయ్యాయి. 55 గ్యాలన్ల సల్ఫ్యూరిక్ యాసి డ్ డ్రమ్‌ను 2018, జూన్ 12న ఎప్‌స్టీన్ లిటిల్ సెయింట్ జేమ్స్ ద్వీపంలో డెలివరీ చేసినట్లు అతడి మెయిల్స్‌లో రసీదు ఉంది. దర్యాప్తు అధికారులు ఆధారాలు దొరకకుండా జాగ్రత్త పడేందుకు ఎప్‌స్టీన్ సల్ఫ్యూరిక్ యాసిడ్‌ను కొనుగోలు చేసి ఉంటాడని పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆ యాసిడ్‌తో సాక్ష్యాలు, మానవ అవశేషాలను నాశనం చేసి ఉండొ చ్చని పలు నివేదికలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు తన ద్వీపంలోని ఆర్వో నీటి శుద్ధీ కరణ వ్యవస్థ నిర్వహణ కోసం ఎప్‌స్టీన్ సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని వినయోగించే వాడని అతడి ఫైల్స్‌లో ఉన్న వివరాల ద్వారా తెలుస్తోంది. ఆర్వో ప్లాంట్ నిర్వహణ కోసమే అయితే, ఇంత పెద్ద మొత్తంలో యాసిడ్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదట. దీంతో యాసిడ్ కొనుగోళ్ల వెనుక ఉన్న అసలు విషయంపై అస్పష్టత నెలకొంది.

# సంక్షిప్తంగా..

### ముంబయి మేయర్‌గా రీతూతావ్డే, డిప్యూటీ మేయర్‌గా సంజయ్‌ఘాడీ



**ముంబయి, ఫిబ్రవరి 11:** ముంబై మేయర్ పీఠం విషయంలో కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. బృహన్ ముంబై కార్పొరేషన్ మేయర్‌గా బీజేపీకి చెందిన రీతూ తావ్డే, డిప్యూటీ మేయర్‌గా శివసేన (షిండే) వర్గానికి చెందిన సంజయ్ ఘాడీ ఎన్నికయ్యారు. బుధవారం ఎన్నిక జరగాల్సి ఉంది. ఏకగ్రీవంగా ఇద్దరినీ ఎన్నుకున్నారు. దీంతో 25 ఏళ్లపాటు థాక్రే ఆధ్వర్యంలోని శివసేన చేతిలో ఉన్న ముంబై మేయర్ పదవి ఇప్పుడు బిజెపి పరమైంది. రితూ తావ్డే మూడుసార్లు కార్పొరేటర్‌గా గెలిచారు. ఆమె ఘట్‌కోపర్ (132వ వార్డు) స్థానం నుంచి ఇటీవల గెలిచారు. గతంలో బీఎంసీకి చెందిన ఎడ్యుకేషన్ కమిటీ చైర్‌పర్సన్‌గా పని చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. తర్వాత 2012లో బీజేపీలో చేరారు. బీఎంసీలో జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే హాజరయ్యారు.

### నరవణే బుక్‌పై పెంగ్విన్‌కు ఢిల్లీ పోలీసుల నోటీసులు




**న్యూఢిల్లీ:** భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుందే నరవణే రచించిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం విడుదలకు ముందే సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతుండటం వివాదాస్పదమవుతోంది. దీనిపై ఇప్పటికే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు తాజాగా పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియా కు నోటీసులు పంపారు. ప్రచురితం కాని పుస్తకానికి సంబంధించి పలు ప్రశ్నలు సంధిస్తూ వాటికి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. నరవణే పుస్తకం చుట్టూ నెలకొన్న వివాదంపై పెంగ్విన్ సంస్థ 24 గంటల్లో రెండుసార్లు సామాజిక మాధ్యమాల్లో వివరణ ఇచ్చింది. ఈ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని తొలుత పేర్కొంది. విడుదల కాబోతోన్న పుస్తకం, ప్రీ ఆర్డర్‌కు అందుబాటులో ఉన్న పుస్తకం, పబ్లిష్డ్ పుస్తకం ఒకటి కాదని మార్కెట్లో అన్ని చోట్ల అందుబాటులోకి వచ్చినప్పుడే పబ్లిష్డ్‌గా పరిగణించాలని రెండోసారి వివరణలో పేర్కొంది.

### అమెరికాతో ట్రేడ్‌డీల్లో స్పష్టమైన చర్చలు జరిపాం: రాజేశ్ అగర్వాల్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** వాణిజ్య ఒప్పందాలలో, సున్నిత రంగాలపై భారతదేశం ఎల్లప్పుడూ స్పష్టమైన వైఖరితో చర్చలు జరిపిందని, అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలోనూ వ్యవసాయం సహా కీలక రంగాల ప్రయోజనాలను కాపాడేలా ముందుకు వెళ్లామని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వెల్లడించారు.

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

దేశానికి అత్యంత కీలకమైన రంగాలను దృష్టిలో ఉంచుకుని స్పష్టమైన వైఖరితోనే వాణిజ్య చర్చలు జరిపినట్లు తెలిపారు. అన్ని ఒప్పందాల విషయంలో ఇలా స్పష్టమైన వైఖరితోనే ఉన్నామని అన్నారు. మన రైతులు, మత్స్యకారులు, పాడిపరిశ్రమ సహా ప్రభావితమవుతాయని భావించిన రంగాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని రక్షించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

### క్షమాపణ చెప్పిన ఇరాన్ అధ్యక్షుడు

**టెహ్రాన్, ఫిబ్రవరి 11:** ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తీవ్ర ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆందోళనకారులను అడ్డుకోవడానికి భద్రతా బలగాలు వారిపై ఉక్కుపాదం మోపి, హింసాత్మకంగా అణచి వేశాయి. దీనిపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఆ సమయంలో భద్రతా బలగాల అణచివేతలో కుటుంబ సభ్యులను కోల్పోయిన, గాయపడిన వారు అనుభవించిన బాధ తనకు తెలుసని అన్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని కట్టడి చేయలేకపోయినందుకు ప్రభుత్వం సిగ్గుపడుతోందన్నారు.



విధులకు ఆలస్యంగా వచ్చి సంతకాలు చేస్తున్న లెక్చరర్స్

# లక్షల్లో జీతాలు... విధుల్లో నిర్లక్ష్యం!

**• సమయపాలన పాటించని కొందరు రెగ్యులర్ లెక్చరర్స్ • తమ క్లాసులను గెస్ట్ లెక్చరర్స్‌తోనే చెప్పిస్తున్న వైనం • పర్యవేక్షణను గాలికి వదిలేసిన ప్రిన్సిపాల్ • ఇది ప్రభుత్వ అనంత ఆర్ట్స్ కళాశాలలోని పరిస్థితి • 'వార్త' పరిశీలనలో వెలుగులోకి**

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ఎందరో మహానుభావులు చదివిన కళాశాలలో కొందరు రెగ్యులర్ లెక్చరర్స్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డ్యూటీకి వచ్చి ఎఫ్ఆర్ఎస్ వేసి బయటికి వెళ్లి సొంత పనులు చేసుకుంటున్నారు. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో కళాశాలకు వచ్చి ఎఫ్ఆర్ఎస్ వేస్తున్నారు. పైగా తమ క్లాసులు కూడా మీరే చెప్పాలని గెస్ట్ లెక్చరర్స్‌కు హుకుం జారీ చేస్తున్నారు. రెగ్యులర్ లెక్చరర్స్ డ్యూటీకి ఏ సమయానికి వస్తున్నారు, తిరిగి ఏ సమయానికి ఇంటికి వెళుతున్నారో అన్నది అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తే బయటపడుతుంది. అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ, పీజీలో దాదాపు 4 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్కడ దాదాపు 90 మందికి పైగా రెగ్యులర్ లెక్చరర్స్, దాదాపు 40 మందికి పైగా గెస్ట్ లెక్చరర్స్ పనిచేస్తున్నారు. కొన్ని సబ్జెక్టులు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మరికొన్ని సబ్జెక్టులు మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని కళాశాల నిర్ణయించింది. ఆ విధంగా లెక్చరర్స్ విధులకు హాజరు కావాల్సి ఉంది. అయితే బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు వార్త రిపోర్టర్ కళాశాలను పరిశీలించడం జరిగింది.

అప్పుడు ఒంటిగంటకు డ్యూటీకి రావాల్సిన లెక్చరర్స్‌లో కొందరు రెగ్యులర్ లెక్చరర్స్ 1:30 గంటలకు వచ్చి ప్రిన్సిపల్ ఛాంబర్ బయట ఉన్న అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తూ కనిపించడం జరిగింది.

ఆ తర్వాత పలు తరగతి గదుల వద్దకు వెళ్లగా... అప్పుడు కూడా కొందరు మాత్రమే లెక్చరర్స్ ఉన్నారు. కొన్ని తరగతి గదుల్లో విద్యార్థులు ఉన్నారు. కానీ లెక్చరర్స్ లేరు. అలా మధ్యాహ్నం రెండు గంటల వరకు లెక్చరర్స్ డ్యూటీకి వస్తూనే ఉన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కచ్చితంగా డ్యూటీకి రావాల్సిన లెక్చరర్స్ మధ్యాహ్నం రెండు గంటల వరకు వస్తూనే ఉండటాన్ని చూస్తే విధులు పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతుంది.

**గెస్ట్ లెక్చరర్స్‌తోనే క్లాసులు:**

కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్స్ లక్షల్లో జీతాలు తీసుకుంటున్నారు. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం డ్యూటీకి వచ్చే రెగ్యులర్ లెక్చరర్స్‌లో కొందరు లెక్చరర్స్ డ్యూటీకి వచ్చి ఎఫ్ఆర్ఎస్ వేసి తమ క్లాసులు చెప్పకుండా గెస్ట్ లెక్చరర్స్‌తోనే చెప్పిస్తున్నారు. వారు ఆ సమయంలో బయటికి వెళ్తున్నారని, తిరిగి డ్యూటీ ముగిసే సమయానికి కళాశాలకు వచ్చి ఎఫ్ఆర్ఎస్ వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా బుధవారము ఎకనామిక్స్ లెక్చరర్ కళాశాలకు వచ్చి ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోయిందని ఆ విభాగం విద్యార్థులు వచ్చి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా కంప్యూటర్ సైన్స్ విభాగంలో దాదాపు 10 ఏళ్లకు పైగా పనిచేస్తున్న ఒక రెగ్యులర్ లెక్చరర్ ఇప్పటివరకు ఒక్క క్లాసు కూడా చెప్పకుండా మొత్తం క్లాసులు గెస్ట్ లెక్చరర్స్‌తోనే చెప్పిస్తున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి.

అదేవిధంగా ఆర్ట్స్, సైన్స్‌లోని పెద్ద విభాగంలోని కొందరు రెగ్యులర్ లెక్చరర్స్ కూడా క్లాసులు చెప్పకుండా గెస్ట్ లెక్చరర్స్‌తోనే క్లాసులు చెప్పిస్తున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం రెగ్యులర్ లెక్చరర్స్ సమయపాలన పాటిస్తున్నారా? లేదా? క్లాసులు చెబుతున్నారా? లేదా? అని పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత కళాశాల ప్రిన్సిపాల్ దే. ప్రిన్సిపల్ పరిరక్షణ సరిగ్గా లేకపోవడంతోనే ఆ కొందరు రెగ్యులర్ లెక్చరర్స్ తమ విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి. అలాంటి కొందరి లెక్చరర్స్ వలన ఎంతో గొప్ప పేరు ఉన్న కళాశాలకు చెడ్డ పేరు వస్తుందని, లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటున్నప్పటికీ దానికి న్యాయం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి లెక్చరర్లపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.




ఓ తరగతి గదిలో లెక్చరర్ లేని దృశ్యం

**విచారణ చేసి చర్యలు తీసుకుంటాం: ఉన్నత విద్యాశాఖ ఆర్జేడీ జ్ఞానేశ్వర్**

అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పనిచేస్తున్న కొందరు రెగ్యులర్ లెక్చరర్స్ సమయపాల పాటించడం లేదని, క్లాసులు చెప్పకుండా గెస్ట్ లెక్చరర్స్‌తో క్లాసులు చెప్పిస్తున్నారు అన్న విషయాలు పై విచారణ చేసి చర్యలు తీసుకుంటాము. ప్రతి లెక్చరర్ సమయపాలన పాటించాలి. క్లాసులు కూడా కచ్చితంగా చెప్పాలి.

## శాస్త్రోక్తంగా కైలాసనాధుని ధ్వజ పూజలు



ధ్వజస్థంభంపై చీరలు అధిరోహిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాత వార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా, కన్నుల పండుగా కైలాస నాధుని తిరునాళ్ళకు ధ్వజపూజలు నిర్వహించారు. దాతలు అందించిన కొత్త వెండిపల్లకీల్లో స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చి వచ్చినదానికి చేరుకున్న తరువాత స్వామి గర్భగుడి ఎదురుగా స్థానిక సంప్రదాయ మేరకు పంచమూర్తుల్ని ప్రతిష్ఠించారు. వెండిపల్లకిలో భోళాశంకరుని, దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని పడమర దిక్కుగా ప్రతిష్ఠించగా ఎదురుగా ధ్వజస్థంభం తూర్పు అభిముఖంగా దర్శనమిచ్చింది. అలాగే ఉత్తరాభిముఖంగా వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని దక్షిణాభిముఖంగా వినాయకుని ప్రతిష్ఠించారు. ఆలయ అభిషేకగురుకుల్ డాక్టర్ స్వామినాథన్, ప్రధానార్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్స్ పర్యవేక్షణలో వరదా గురుకుల్, వేదపండితులు, పారోహితులు అర్ధగిరి, శ్రీనివాస శర్మ వేదమంత్రాల్ని పఠిస్తుండగా అష్ట దిక్పాలకులు, పంచపాలకులు, వరుణదేవుని కలశాల్ని ప్రతిష్ఠించారు. వాటి ముందు ప్రధాన కలశాన్ని దాని ముందు హోమాన్ని ఏర్పాటు చేశారు. శాస్త్రోక్తంగా సంకల్పం జరిపారు. స్వామి అమ్మవార్లకు పండ్లు, పత్రి, పూలతో కూడిన పళ్ళెమల్లి ఊరేగింపుగా నాయకులు, అధికారులు తీసుకొని ధ్వజ స్థంభం నుంచి స్వామి గర్భగుడిలో ప్రదక్షిణలు జరిపారు. అనంతరం మళ్లీ హోమాలు జరిపారు. ఆలయ సంప్రదాయం మేరకు సుమారు రెండు గంటలకుపైగా వేదపండితుల వేదఘోషతో కార్యక్రమాలు సాగాయి. అనంతరం శాస్త్రోక్తంగా మొదట ఆలయం నుంచి ధ్వజ మింటిని ఆరోహించారు. ఆ తాడుతో పాటు ధ్వజ సంకేతం కల్గిన పటాన్ని ధ్వజస్థంభం మీదికి అధిరోహింపజేశారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పూజలు, వేదమంత్రాలతో పునీతమైన కలశాల్లోని నీటితో ధ్వజస్థంభానికి అభిషేకాలు జరిపారు. బలి ముద్దల నివేదన జరిపాక ఉత్సవర్లకు ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం గర్భాలయంలో మూలవిరాట్టుకు దీపారాధన జరిపారు. దాంతో ధ్వజారోహణ కార్యక్రమాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఉభయదారులు బయ్యా నాగమ్మకుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఏర్పాట్లను ఇఒ డి.బాపిరెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షించారు. వచ్చిన భక్తులకు ఉభయదారులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ఇఒ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎఇఒలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుదర్శనం, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి పర్యవేక్షణలో వారి సిబ్బంది పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితారెడ్డి, కోలా వైశాలి, పాలకమండలి సభ్యులు, మార్కెట్ కమిటి చైర్మన్ రంగినేని చెంచయ్యానాయుడు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్, పట్టణ తెలుగుదేశం మహిళ అధ్యక్షురాలు సుమతి తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్, ఫార్మా మాఫియాపై 14న సిపిఐ ఆందోళన

**• పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య • నేటి సార్వత్రిక సమ్మెకు సిపిఐ మద్దతు**

విజయవాడ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా మెడికల్, ఫార్మా రంగాల్లో నెలకొన్న మాఫియా ధోరణులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. ఈ ప్రజా ఉద్యమంలో ప్రజలు, మెడికల్ రంగంలోని నిరుద్యోగ యువత, ప్రజా సంఘాలు, మేధావులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా రాష్ట్రంలో మెడికల్ రంగం ఒక పెద్ద మాఫియాగా రూపాంతరం చెందిందని, నకిలీ మందుల వినియోగం ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళనలకు సంబంధించిన పోస్టర్‌ను విజయవాడ దాసరి భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఈశ్వరయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు మెడికల్, ఫార్మా మాఫియాను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా బోగస్ మందుల విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ వైద్య సేవలు సామాన్యులకు అందని స్థితికి చేరుకున్నాయని, అనవసర పరీక్షలు, మందులు సూచించి వ్యాపార దృష్టితో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఫార్మా కంపెనీలు లాభాపేక్షతో నాణ్యతా ప్రమాణాలను విస్మరిస్తున్నాయని, ప్రజారోగ్యాన్ని వ్యాపారంగా మార్చే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. పిపిపి పేరిట వైద్య కళాశాలలను ప్రైవేటీకరించే చర్యలు ప్రభుత్వం చేపడుతోందని, దీనివల్ల ప్రభుత్వ వైద్యసంస్థలు నిర్వీర్యమవుతున్నాయని విమర్శించారు. రోగాల వారీగా చికిత్స ఖర్చులు, మందుల ధరలు, ఫీజులు నిర్ధారించే చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ప్రజా ఉద్యమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**సార్వత్రిక సమ్మెకు సిపిఐ మద్దతు**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు మద్దతు ప్రకటించి, సమ్మెను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కోరారు.

మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరించిందని, 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు.

కార్పొరేట్ ప్రయోజనాల కోసమే చట్టాలు మార్పు చేశారని ఆరోపించారు. సిపిఐ శ్రేణులు, ప్రజా సంఘాలు విస్తృతంగా పాల్గొని సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి, పి.దుర్గాభవాని, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయింపు

## ఉపముఖ్యమంత్రికి ధన్యవాదాలు

## పవన్ కల్యాణ్‌ని కలసిన పలువురు ఎన్‌డిఏ శాసనసభ్యులు

విజయవాడ, ఫిబ్రవరి 11: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకి చెందిన పలువురు శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం కలిశారు. తమ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో పల్లెపండగ 2.0, సాస్కి నిధులతో రోడ్లు, డ్రెయిన్లతోపాటు జేజేఎం నిధులతో రక్షిత మంచినీటి పథకాల పనులు, పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం శాసనసభలో జరిగిన ఎన్డీఏ ఎల్పీ భేటీ అనంతరం వీరంతా పవన్ కల్యాణ్‌ని కలిశారు. కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, మండపేట శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు, ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు, అమలాపురం శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు తదితరులు ఉప ముఖ్యమంత్రిని కలసిన వారిలో ఉన్నారు.

**రూ.65.15 కోట్ల సాస్కి నిధులతో 4 నియోజకవర్గాల్లో 40 రోడ్ల అభివృద్ధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఆయా నియోజకవర్గాల పరిధిలో రూ.65.15 కోట్ల సాస్కి నిధులతో 40 ప్రధాన రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. అందులో మండపేట నియోజకవర్గానికి రూ.22.75 కోట్లు, అమలాపురం నియోజకవర్గానికి రూ.16.18 కోట్లు, కొత్తపేటకు రూ.14.93 కోట్లు, ముమ్మిడివరం నియోజకవర్గానికి రూ.11.28 కోట్లు కేటాయించారు. 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి వాడపల్లి క్షేత్రానికి వెళ్లే కరకట్ట రోడ్డు నిర్మాణానికి స్థానిక శాసన సభ్యులు సత్యానందరావు అభ్యర్థన మేరకు సాస్కి నిధుల నుంచే రూ.6 కోట్లు పవన్ కల్యాణ్ మంజూరు చేశారు.

శాసన సభలో ఉపముఖ్యమంత్రి పవన్‌ని పలువురు శాసన సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్, గన్నవరం శాసన సభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పవన్ కల్యాణ్‌ని కలసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గాల పరిధిలో పలు సమస్యలను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. శ్రీకాళహస్తిలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ బొజ్జల సుధీర్ రెడ్డి ఆహ్వానపత్రిక అందజేశారు.

## మహా శివరాత్రి పండుగ సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా

**విద్యుత్ డిస్కాములకు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు**

విజయవాడ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త ప్రతినిధి: రాబోయే మహా శివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాలు, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో ఏ విధమైన అంతరాయం లేకుండా నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ డిస్కమ్‌లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ఇంధన శాఖ మంత్రి బుధవారం డిస్కమ్‌ల సిఎండిలు ఎల్.శివశంకర్, ఐ.పృథ్వీ తేజ్, పి.పుల్లారెడ్డిలతో పాటు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

రాబోయే శివరాత్రి పండుగను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరా సన్నద్ధతపై ఆయన సమీక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రధాన శివాలయాలు, ఇతర దేవాలయాలకు వెళ్లే అవకాశం ఉన్నందున, నిరంతర విద్యుత్ సరఫరా అత్యంత అవసరం అని మంత్రి పేర్కొన్నారు. భక్తుల సౌకర్యం కోసం, ధార్మిక కార్యక్రమాలు అంతరాయం లేకుండా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. పండుగ కాలంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే ప్రత్యామ్నాయ విద్యుత్ అందించేలా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేందుకు 24గంటలూ మెయింటెనెన్స్ బృందాలు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. అనుకోని సమస్యలు తలెత్తకుండా ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పంపిణీ లైన్లపై ముందస్తు తనిఖీలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా తక్షణ పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా సిద్ధంగా ఉండాలని, ఫీల్డ్ అధికారులందరూ అలర్ట్‌గా ఉండి కచ్చితమైన పర్యవేక్షణ కొనసాగించాలని మంత్రి ఆదేశించారు.

మహా శివరాత్రి సందర్భంగా విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ఉండేలా చూడటం ప్రాధాన్యమైన, కాలపరిమితి కలిగిన పని అని, భక్తులు ఎలాంటి అసౌకర్యం లేకుండా భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకునేలా ప్రతి డిస్కమ్ సక్రమంగా చర్యలు తీసుకోవాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.




# ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తాం!

**విద్యుత్ ఉద్యోగుల పని ఒత్తిడి తగ్గించేందుకు నూతన నియామకాలు**

**బిసి ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణలో మంత్రి గొట్టిపాటి రవికుమార్**

విజయవాడ, ఫిబ్రవరి 11: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతతో పరిష్కరిస్తుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్‌తో కలిపి మంత్రి గొట్టిపాటి సచివాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ప్రజల్లో సంతృప్త స్థాయిలు పెరిగేలా విద్యుత్ ఉద్యోగులు విధులు నిర్వహించాలని సూచించారు. విద్యుత్ ఉద్యోగులపై ఉన్న పనిఒత్తిడిని తగ్గించేందుకు సిఎం చంద్రబాబు అనుమతితో త్వరలోనే నియామకాలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. మెడికల్ ఇన్సూరెన్స్ లిమిట్‌కు సంబంధించి ఏవైనా సమస్యలుంటే పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. అదే విధంగా విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన డిమాండ్లలో 90 శాతంపైగా పరిష్కరించామని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వం ధ్వంసం చేసిన విద్యుత్ వ్యవస్థను గాడిలో పెడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ట్రూ అప్ ఛార్జీలను ట్రూ డౌన్ చేసిన రాష్ట్రం కూడా దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే అన్నారు. ప్రైవేటు సంస్థల నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లను తగ్గించడమే కాకుండా రాష్ట్రంలో ఉన్న వనరులను వినియోగించుకుని రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ఏదేమైనా విద్యుత్ ఉద్యోగులకు అన్ని విషయాల్లోనూ సహాయ, సహకారాలు అందిస్తామని మంత్రి గొట్టిపాటి భరోసా ఇచ్చారు. పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశ పెట్టిన విద్యుత్ సంస్కరణలను నేడు దేశంలో అనేక రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. టిడిపి అంటేనే బిసిలు అని, బిసిలు అంటేనే టిడిపి అని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. పిఆర్సీ, డిఎ, ఇంక్రిమెంట్లతో పాటు విద్యుత్ శాఖలో కారుణ్య నియామకాల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కె.అప్పారావు, ఫైనాన్స్ సెక్రటరీ ఎస్.వెంకటరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ జి.రాము, బిసి సంఘం నేత కేశన శంకర్రావుతో పాటు వివిధ జిల్లాల నుంచి నేతలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వెండి అంబారిలో ఆదిదంపతుల రాజసం



వెండి పల్లకిలో స్వామి అమ్మవార్ల దర్శనం


శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎన్నో ప్రత్యేకతలు చోటు చేసుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాలకే ప్రాధాన్యత ఇస్తారు. ఈనేపథ్యంలో బుధవారం దేవరాత్రి సందర్భంగా స్వామి అమ్మవార్లు వెండి అంబారిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాన్ని 'ఆహ్వానోత్సవం' అని కూడా పిలుస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ధ్వజారోహణం జరిగిన తరువాత సాయంత్రం స్వామి అమ్మవార్లతో పాటు పంచమూర్తుల్ని ముస్తాబు చేసి పురప్రదర్శనకు తరలించారు. ముందు వినాయకుడు వెళుతుండగా వెనుక వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి, వెనుక జ్ఞాన ప్రసూనాంబ సమేత సోమాస్కందమూర్తి వెండి అంబారిలో భక్తులకు దివ్యదర్శనం ఇస్తూ నాలుగుమాడావీధుల్లో వెలసిన నవసంధి వినాయకులతో పాటు పరివార దేవతలకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానంగా వర్ణిస్తారు. ఈ ఉత్సవంలో ఉమాదేవి సమేత చంద్రశేఖర్ స్వామి కొలువుదీరిన త్రిశూలాలను పల్లకిలో ప్రతిష్ఠించి ప్రతి ఆలయం వద్ద ఆపి అక్కడి దేవతల్ని ఆహ్వానించే కార్యక్రమాల్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఉత్సవాలలో సమయపాలనతో సాగాలని ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి పాటిస్తూ భక్తులకు కనువిందు చేసే దర్శనాన్ని అందిస్తున్నారు.



## భక్తుల భద్రతే లక్ష్యం: ఎస్పీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, భద్రతే ప్రధానంగా పోలీసులు పనిచేయాలని తిరుపతి జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు సూచించారు. శివరాత్రి విధి నిర్వహణ ఓ బాధ్యతగా గుర్తించాలని ఆయన సూచించారు. ఇక్కడకు వచ్చే విఐపిలు, సామాన్య భక్తులకు, ట్రాఫిక్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, దేవస్థానం ఇఒ బాపిరెడ్డి, పోలీస్ శాఖ, దేవస్థానం అధికారులతో కలిసి శ్రీకాళహస్తిలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తుల నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, క్యూలైన్ నిర్వహణను సక్రమంగా అమలు చేయాలని, దర్శనానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన మార్గదర్శకాలు అమలు చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలు సజావుగా జరిగేలా పోలీస్ శాఖ, దేవస్థానం అధికారులు, ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహర ఆచారి (శాంతిభద్రతలు), శ్రీనివాసులు, సంబంధిత డిఎస్పీలు, సిఐలు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

# సముద్రపు కోత నివారణ అడ్డుకట్ట పనులు పూర్తి చేయండి



నరసాపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: నరసాపురం మండలం పెద్దమైనవాని లంక వద్ద నిర్మాణంలో ఉన్న సముద్రపు కోత నిరోధక అడ్డుకట్ట నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు ఎప్పటికీ పూర్తవుతాయి, ఇంకా ఏ పనులు చేపట్టాలి, తదితర వివరాలను డిలైట్ కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టి తీసుకురావాలని డిలైట్ ప్రతినిధులకు సూచించారు. అనంతరం రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ సహకారంతో మొంథా తుపాన్ పునరావసర పథకం కింద మత్స్యకారులకు అందజేయ దానికి సిద్ధం చేస్తున్న బోట్లు నిర్మాణ పనులను, వలలను స్వయంగా పరిశీలించి నిర్మాణ ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. పూర్తిస్థాయిలో బోట్లు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి తెలియజేస్తే, లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. బోట్లు వినియోగానికి లబ్ధిదారుల పేరున లైసెన్స్ పొందడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మత్స్య శాఖ ఎఫ్డిఓను ఆదేశించారు. వందమంది మత్స్యకారులకు ఒక్కొక్కరికీ రూ.50 వేలు విలువ కలిగిన పడవ, రూ.20 వేలు విలువ కలిగిన వలను అందజేయనున్నారు. చివరిగా పడవలు ప్రారంభానికి అనువైన సముద్ర బ్యాక్ వాటర్ చానల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు మైల వసంతరావు, మత్స్య శాఖ ఎఫ్డిఓ ఏ.దుర్గ ఏడుకొండలు, తహసీల్దార్ ఐవివి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.




కాణిపాకం దేవస్థాన తరపున పట్టువస్త్రాలను సమర్పించేందుకు శ్రీశైలంలో ఊరేగింపుగా తీసుకెళుతున్న ఆలయ ఛైర్మన్, ఇఓ, అధికారులు, అర్చకులు

# శ్రీశైలం మల్లన్నకు గణనాధుని పట్టువస్త్రాలు

కాణిపాకం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: శ్రీశైలం శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రతిఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం దేవస్థానం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు కాణిపాకం ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఇఓ పెంచల కిషోర్, ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు, అర్చకులు, శ్రీశైలం చేరుకుని స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలను సమర్పించేందుకు శ్రీశైలం దేవస్థానంకు చేరుకున్న వారికి శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ రమేష్‌నాయుడు, ఇఓ శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు మంగళవాయిద్యాల నడుమ పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయంలో అందజేశారు. నూతన పట్టు వస్త్రాలను స్వామి, అమ్మవార్లకు అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, పాలకమండలి సభ్యులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి ఛైర్మన్ రమేష్‌నాయుడు, ఇఓ శ్రీనివాసరావులు స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ సూపరింటెండెంట్‌లు కోదండపాణి, బాలరంగస్వామి, పాలకమండలి సభ్యులు నాగరాజులు నాయుడు, సతీష్, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, వసంతమ్మ, కృష్ణవేణి, చంద్రకళ, రాజ్యలక్ష్మీ, శ్రీశైలం దేవస్థానం అధికారులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

# శివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

● కనకదుర్గమ్మ ఆలయ సేవకుల కోసం అమ్మవారి సేవ యాప్ ● తిరుమల తరహాలో కనకదుర్గమ్మ అమ్మవారి సేవకుల నిర్వహణ ● ఆలయ ఇఓ వికె సీనా నాయక్ వెల్లడి... అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షచేస్తున్న ఇఓ

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయం లో రాబోయే మహాశివరాత్రి పర్వదినాన భక్తులకు కల్పించే సౌకర్యాలు, ఏర్పాట్లపై ఆలయ ఇఓ వికె సీనా నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కొండపైకి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రిఫ్యాబ్రికేటెడ్ ఫ్రేమ్స్ తో పటిష్టమైన క్యూ లైన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో భక్తులను మల్లికార్జున మహామండపం ద్వారా మళ్ళించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. నదీ స్నానాలు చేసే భక్తుల కోసం దుర్గా ఘాట్ మరియు ఇతర స్నానపు ఘాట్ల వద్ద పారిశుద్ధం, భద్రత మరియు కనీస సౌకర్యాలను (మరుగుదొడ్లు, తాగునీరు) పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు ఆన్‌లైన్ లావాదేవీల పెంపుగౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆలయ సేవలను మరింత పారదర్శకం చేసేందుకు కింది చర్యలపై చర్చించారు. దర్శన టికెట్లు, ప్రసాదం కొనుగోలు మరియు ఇతర సేవల కోసం ఆన్‌లైన్ లావాదేవీలను ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఆలయ పరిసరాలు, ఘాట్ల వద్ద నిరంతరం శుభ్రత పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో మజ్జిగ, పాలు, తాగునీరు పంపిణీ చేయాలని అధికా రులను ఆదేశించారు. మహాశివరాత్రి నాడు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఆధ్యాత్మిక వాతావ రణంలో దర్శనం చేసుకునేలా అన్ని విభాగాలు సమన్వ యంతో పనిచేయాలని ఈవో స్పష్టం చేశారు. క్యూ లైన్లలో మరియు కౌంటర్ల వద్ద వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు డిజిటల్, ఆన్‌లైన్ బుకింగ్ సిస్టమ్‌ను పటిష్టం చేయాలని ఐటీ విభాగానికి సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏఈలు, ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సూపరిటెండెంట్లు, ఫెస్టివల్ సెక్షన్, ఐటీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

**కనకదుర్గమ్మ ఆలయ సేవకుల కోసం అమ్మవారి సేవ యాప్:** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేందుకు దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, తిరుమల శ్రీవారి ఆలయ తరహాలో ఇక్కడ కూడా సేవకుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలనే దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలు ప్రకారం సేవకుల రిజిస్ట్రేషన్ జరుపుతుంది. ఇందులో భాగంగా సేవకుల రిజిస్ట్రేషన్, హాజరు పర్యవేక్షణ కోసం అమ్మవారి సేవ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వికె శీనానాయక్ తెలిపారు. సాధారణ రోజుల్లో 30 నుండి 40 వేల మంది, వారాంతాల్లో 50 నుండి 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ భారీ రద్దీని క్రమబద్ధీకరించేందుకు సేవకుల తోడ్పాటు ఎంతో అవసరమని ప్రభుత్వం భావించింది. తిరుమల తరహాలో ఇక్కడ కూడా సేవకులను పారదర్శకంగా వినియోగించుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ఈ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో సేవకులు తమ ప్రొఫైల్ మేనేజ్ చేసుకోవడం, సేవా చరిత్రను చూసుకోవడం మరియు సేవా స్థితిని తనిఖీ చేయడం వంటి వసతులు ఉన్నాయి. క్యూ లైన్ల నిర్వహణ, అన్న ప్రసాదం, ప్రసాదం కౌంటర్స్, భక్తుల ఫీడ్ బ్యాక్ సేకరణ, ఆన్ లైన్ సేవా కౌంటర్స్, భక్తులకు మంచి నీరు అందించడం, ఉపాలయాల్లో క్యూ లైన్ల నిర్వహణను సేవకులు చేయవలసిఉంటుందని ఈవో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు గూగుల్ ప్లే స్టోర్ నుండి అమ్మవారి సేవ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలని ఈవో ప్రకటించారు.

**దాతల విరాళాలు:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అన్నదాన పథకానికి రూ.1లక్షను విరాళంగా విశాఖపట్నంకు చెందిన ఎమ్ వెంకటేశ్వర్లు, ఎమ్.లక్ష్మీరాజ్యంల కుమార్తెలు జి విద్య, కె.దీప్తి, అల్లుళ్ళ కె.రాజేష్, సతీష్ సూర్యనారాయణలు అందించారు. అలాగే నిడదవోలుకు చెందిన మెట్టపల్లి రామదేవి మరియు కుటుంబసభ్యులు రు. 1,01,116ల విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. దాతలకు దుర్గమ్మవారి ఏర్పాటు చేసి, దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.





దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

# ఆంధ్రప్రదేశ్ శాసనసభలో నేటి నుంచి సరికొత్త టెక్నాలజీ

విజయవాడ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ శాసనసభలో గురువారం నుంచి సరికొత్త టెక్నాలజీ అందుబాటులోకి రానుంది. ఇకపై సభ్యులు తమకు కేటాయించిన సీట్లలో కూర్చుంటేనే వారి హాజరు నమోదవుతుంది. ఈ మేరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత హాజరు విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం వెల్లడించారు. ఈ బడ్జెట్ సమావేశాల నుంచే ఈ విధానం అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీలో మీడియాతో మాట్లాడిన అయ్యన్నపాత్రుడు, ఇప్పటివరకు రిజిస్టర్‌లో సంతకాల ద్వారా హాజరు నమోదు చేసే పద్ధతికి స్వస్తి పలుకుతున్నట్లు తెలిపారు. నూతన ఏఐ విధానం ద్వారా సభ్యుల హాజరును మరింత కచ్చితంగా, పారదర్శకంగా నమోదు చేసేందుకు వీలు కలుగుతుందని వివరించారు. పెద్ద కార్పొరేట్ సంస్థల సీఈఓలు సైతం బయోమెట్రిక్ విధానాన్ని వాడుతున్నారని, పార్లమెంట్‌లోనూ ఇలాంటి టెక్నాలజీని తీసుకురావాలని యోచిస్తున్నారని ఆయన గుర్తుచేశారు.

# గవర్నర్ ప్రసంగం అబద్ధాలు, కాకి లెక్కలు



విజయవాడ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త ప్రతినిధి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగం అబద్ధాలు, కాకి లెక్కలతో ఉందని గవర్నర్ ప్రసంగం అబద్ధాలు, కాకి లెక్కలతో ఉందర్ తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రసంగంపై బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామనే భయంతోనూ, వైఫల్యాలను ప్రశ్నించకూడదనే ఉద్దేశంతోనూ వైసిపికి ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని అన్నారు. 164 మంది సభ్యులు 11మందికి సమాధానం చెప్పలేకపోతున్నారని పేర్కొన్నారు. సంపద సృష్టిస్తామని 20 నెలల్లోనే రాష్ట్రాన్ని నిండా అప్పుల్లో ముంచేశారని విమర్శించారు. విజనరీ పాలనలో వింతపోకడలేగానీ విషయం లేదన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీకి రావడానికి వైసిపి సిద్ధంగా ఉందని, ప్రతిపక్ష హోదాపై గరవ్నర్ కూడా చొరవ చూపాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల నుండి విధ్వంసం పేరుతో వైసిపిని విమర్శించడం తప్ప పేదలకు చేసిందేమీ లేదని తెలిపారు. అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం, కంపెనీల ఏర్పాటు పేరుతో విశాఖలో భూముల పంపకం తప్పించి ప్రభుత్వం చేసింది శూన్యమని పేర్కొన్నారు. పింఛన్లు తొలగించారని, ఆరోగ్యశ్రీని ఇబ్బందుల్లో పెట్టారని, గిట్టుబాటు ధరలు లేవని తెలిపారు. వీటన్నిటిపై చర్చించాలంటే సభలో ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరారు.

# ఆర్థికనేరాలను సిఐడి, ఆర్‌బిఐ పరస్పర అవగాహనతో నియంత్రించవచ్చు

విజయవాడ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త ప్రతినిధి: ఆర్థిక నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి. ప్రజా ప్రయోజనాలను కాపాడటానికి చట్టం అమలు సంస్థలు, ఆర్‌బిఐ వంటి నియంత్రణ తదితరంశాలపై సీఐడీ పోలీసులకు సమన్వయం,. అవగాహన అవసరమని ఐజి డాక్టర్ ఎ.రవిశంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఐడీ పోలీస్ అధికారుల కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఎపి) ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమం విజయవాడలోని ఓ సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. డాక్టర్ ఎ.రవిశంకర్ సమావేశాన్ని ఉద్దేశించించి మాట్లాడుతూ సీఐడీ. ఆర్‌బిఐ మధ్య సన్నిహిత సమన్వయం ఉండాలన్నారు. ఈ కార్యక్రమం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విధులు. అమలు పాత్రపై ఆర్‌బిఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సంతోష్ కేతినేడి ఒక సమాచారాత్మక సెషన్‌ను నిర్వహించారు. ఆర్థిక. సైబర్ ఆధారిత నేరాల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా, ఆర్థిక మోసాలు, సైబర్ భద్రతా సమస్యలు, సోషల్ మీడియా సంబంధిత నేరాలు మరియు అక్రమ డిపాజిట్-సేకరణ కార్యకలాపాలను నిర్వహించడంలో పోలీసు అధికారుల అవగాహన మరియు దర్యాప్తు సామర్థ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. సోషల్ మీడియా నేర పరిశోధన మరియు ఆర్థిక మోసం కేసుల దర్యాప్తు, సైబర్ భద్రతపై సెషన్‌లను ముఖేష్ చౌదరి ప్రసంగించారు. అన్ ఇన్ కార్పొరేటెడ్ బాడీలు డిపాజిట్లను స్వీకరించడాన్ని నిషేధించడం మరియు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు అనధికార డిపాజిట్ స్వీకరణపై ఆర్‌బిఐ డిప్యూటీ లీగల్ అడ్వైజర్ అమీత్ టంక్సాలి మరో కీలక సెషన్‌ను నిర్వహించారు. చట్టపరమైన నిబంధనలు, సాధారణ ఉల్లంఘనలు మరియు అక్రమ డిపాజిట్ పథకాలను గుర్తించడంలో, వాటిపై చర్యలు తీసుకోవడంలో పోలీసుల పాత్రను సెషన్ స్పష్టంగా వివరించింది.



# నీలయ్యవలస సమస్యలు డి.సిఎంకి తెలియజేయండి

రాజాం (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: వంగర మండలం నీలయ్యవలస గ్రామంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి వారు గత కొన్ని సంవత్సరాలుగా పడుతున్న ఇబ్బందులు (ప్రధాన రహదారి మరియు త్రాగునీరు సమస్య)ను తెలియజేస్తూ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్ళి మా ఈ సమస్యను పరిష్కరించేలా చూడగలరని కోరారు. ఈ సమస్యను జనసేన పార్టీ శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు దృష్టికి ఇది వరకే తీసుకువెళ్లామని, మళ్ళీ ఇప్పుడు ఈ సమస్య వేగంగా పరిష్కారం అయ్యేలా జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారమయ్యేలా ప్రయత్నిస్తానని జనసేన ఇన్‌చార్జ్ సురేష్ బాబు వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త పొగిరి సురేష్ బాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, లెంక వెంకటరమణ, డబ్బాద కృష్ణ, 4 మండలాలకు చెందిన జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

# ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా ఎపికి రూ.569.86 కోట్ల నిధులు

సముద్రంలో విడుదల అవుతున్న పరిశ్రమల వ్యర్థాలపై ఓషనోగ్రఫీ పరిశీలన

ఎంపి మేడా రఘునాథరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమాధానం



రాజంపేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: సముద్రంలో విడుదల అవుతున్న పరిశ్రమల వ్యర్థాలతో మత్స్య సంపద తగ్గిపోతోందని వైసీపీ రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో కాకినాడ/ ఉప్పాడ ప్రాంతాలలో చేపల నిల్వలు తగ్గడం, పరిశ్రమల కాలుష్యం కారణంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పరిశ్రమల కాలుష్య అంశాలు పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తాయని, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్ల చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఉప్పాడ సమీపంలో సముద్రంలో విడుదల అవుతున్న పరిశ్రమల వ్యర్థాలపై పరిశీలన ప్రారంభించిందన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, ఆంధ్ర విశ్వ విద్యాలయ నిపుణులతో ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసి వేగవంతమైన పర్యావరణ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ సముద్ర చేపల ఉత్పత్తి 2019-20లో 5.64 లక్షల టన్నుల నుంచి 2024-25లో 6.51 లక్షల టన్నులకు పెరిగిందని, సముద్ర చేపల నిల్వల్లో పెద్దగా తగ్గుదల కనిపించలేదని తెలిపారు. మత్స్య సంపద పరిరక్షణ కోసం కృత్రిమ రీఫ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సముద్ర రాంచింగ్, 61 రోజుల చేపల వేట నిషేధం, చిన్న చేపల వేట నియంత్రణ, టర్టిల్ ఎక్స్‌క్లూడర్ పరికరాల వినియోగం వంటి చర్యలు అమలు చేస్తున్నట్లు వివరించారు.

అదనంగా, ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.2416.92 కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం ఇచ్చి, అందులో రూ.569.86 కోట్లు కేంద్ర వాటాగా మంజూరు చేసినట్లు తెలిపారు. పడవలు, వలలు, ఫిషింగ్ హార్బర్లు, ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజీలు వంటి మౌలిక వసతులకు నిధులు కేటాయించబడు తున్నాయన్నారు.

చేపల వేట నిషేధ కాలంలో సామాజిక ఆర్థికంగా వెనుకబడిన సంప్రదాయ మత్స్యకార కుటుంబాలకు సంవత్సరానికి 3,000 రూపాయల ప్రభుత్వ సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. మత్స్యకారుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, అవసరమైన చర్యలు తీసుకుంటుందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ లిఖిత పూర్వక వివరణలో పేర్కొన్నారు.

# వెస్టిండీస్‌కు రెండో విజయం

ఇంగ్లండ్ జట్టుపై 30 పరుగుల తేడాతో విక్టరీ

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా షెర్ఫానే రూథర్‌ఫోర్డ్ ఎంపిక



**ముంబయి, ఫిబ్రవరి 11:** టి20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ రెండో విజయం సాధించింది. ముంబయి వాంఖడే స్టేడియంలో ఇంగ్లాండ్‌తోజరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 30 పరుగుల తేడాతో వియం సాధించింది. 197 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టు 19 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌట్ అయింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో సమ్‌కరన్ 30 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్స్‌లు చేసి 43 పరుగులుసాధించి టాప్ స్కోరరుగా నిలిచాడు. ఇక జాకబ్ బెథెల్33, ఫిల్‌సాల్ట్30, జోస్ బట్లర్ 21, హ్యారీబ్రూక్ 17 పరుగులుచేసారు. టామ్ బాంటన్ 2విల్‌జాక్స్ రెండు పరుగులేచేసి విఫలం అయ్యారు. విండీస్ బౌలర్లలో గుడాకేష్ మోటి 3రోస్టన్‌ఛజ్ర 2, రోమారియో షెఫర్డ్ అకీల్ హుస్సేన్, షమర్ జోసెఫ్‌లు తలో వికెట్‌తీసారు. ముందు బ్యాటింగ్‌చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో ఆరువికెట్ల నష్టానికి 196 పరుగులుచేసింది. ఐదోస్థానంలో వచ్చిన రూథర్‌ఫోర్డ్ 42 బంతుల్లో ఏడు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 76 పరుగులుచేసి ఇంగ్లీష్ బౌలర్లను తికమక పెట్టా డు. రోస్టన్‌ఛేజ్ 29 బంతుల్లో ఆరుఫోర్లతో 34, జేస్ హోల్డర్ 17 బంతుల్లో ఒక ఫోర్, నాలు గు సిక్స్‌లతో 33 పరుగులు, షిమ్రోన్ హిట మెయిర్ 12 బంతుల్లో రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 23 పరుగులుచేసి రాణించారు. విండీస్ చివరి తొమ్మిది ఓవర్లలోనే 113 పరుగులు రాబట్టింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా 42 బంతుల్లో 76 పరుగులుచేసిన షెర్ఫానే రూథర్‌ఫోర్డ్ ఎంపికయ్యాడు. ఇక క్రిక్ ఇన్ఫో మోస్ట్‌వాల్యుబుల్ ప్లేయర్‌గా రోస్టన్ ఛేజ్ నిలిచాడు.

# ఎపి పర్యాటక సంస్థ 50యేళ్ల వేడుకల సందర్భంగా 'లోగో' డిజైన్ పోటీలకు ఆహ్వానం

- పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి

సచివాలయం, ఫిబ్రవరి 11,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ స్థాపించబడి 50వసంతాలు పూర్తవుతున్న శుభసందర్భాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 18వ తేది నుంచి గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా ప్రారంభం కానున్నాయని, ఈ వేడుకల కోసం ప్రత్యేకంగా రూపొందించే ఏపిటిడిసి లోగో డిజైన్ల కోసం ప్రతిభావంతులైన రూపకర్తల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. కమిటి ద్వారా ఎంపికైన ఉత్తమలోగోకు రూ.20,000ల నగదు పారితోషికంతోపాటు అధికారిక సత్కారం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు తమ డిజైన్లను ఈనెల 14వ తేది సాయంత్రం 5గంటల్లోపు gmmktg@aptdc.in, jayahobharathiyam@gmail.comకి మెయిల్ పంపాల్సి ఉంటుందన్నారు.

# కాంబోడియాలోని సైబర్ నేరగాళ్ల డెన్‌లపై మిలటరీ ఆపరేషన్

● 11 వేల మంది విదేశీయులకు విముక్తి ● 1,200 మంది నేరగాళ్ల అరెస్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారిన గోల్డెన్ ట్రయంగల్‌లో ఒకటిగా వున్న కాంబోడియా దేశంలోని మారు మూల అటవీ ప్రాంతంలో రహస్యంగా కొనసాగుతున్న సైబర్ నేరాల స్థావరాలపై ఆ దేశానికి చెందిన సైన్యం మంగళవారం మెరుపు దాడులు చేబట్టింది. ఈ దాడుల్లో సైబర్ డెన్‌లలో బంధింపబడి నేరగాళ్ల ఒత్తిడితో సైబర్ నేరాలు చేస్తున్న 11 వేల మంది విదేశీయులకు విముక్తి లభించింది. ఈ దాడుల్లో 1200 మంది సైబర్ నేరగాళ్లను ఆ దేశ సైన్యం అరెస్టు చేసింది. ఈ సందర్భంగా వేల సంఖ్యలో సెల్‌ఫోన్లతో పాటు లక్షల సంఖ్యలో సిం కార్డులను పట్టుకున్నారు. ఈ సెల్‌ఫోన్‌లు, సిం కార్డులలో 90 శాతం భారత్‌కు చెందినవిగా తెలిసింది. కాంబోడియాలోని సైబర్ డెన్‌లలో ఈ స్థా యిలో దాడులు జరగడం ఇటీవల కాలంలో ఇదే తొలిసారిగా చెబుతున్నారు.

సైబర్ డెన్‌లలో భారత్‌కు చెందిన సిబిఐ, ఈడీ సహా అనేక పోలీసు వి భాగాల పేరిట ఏర్పాటైన ప్రత్యేక కేంద్రాలు వుండగా వాటిని ఆ దేశ సైన్యం ధ్వంసం చేసింది. ఆసియా దేశాలకు చెందిన నిరుద్యోగులను ముఖ్యంగా భారతీయులను సైబర్ నేరగాళ్లు విదేశీ ఉద్యోగాల పేరిట ఎరవేసి వారిని బలవంతంగా కాంబోడియా తరలిస్తూ వారిచేత సైబర్ నేరాలు చేయిస్తుండ డం తెలిసిందే. సైబర్ నేరాలు చేసేందుకు నిరాకరించిన వారికి అన్న పానియాలు లేకుండా చేయడం, కరెంటు షాక్‌లు ఇవ్వడం, చావబాదడం వం టివి చేస్తున్నారు సైబర్ నేరగాళ్లు. సైబర్ నేరగాళ్ల దాడుల్లో కొందరు చనిపోతుండగా మరికొందరు జీవచ్ఛవాలుగా మారి ఇష్టం లేకున్నా నేరాలు చేస్తు న్నారు. కొందరు మాత్రం భారీగా డబ్బులు చెల్లించి బయటపడుతున్నారు. ఇలా బయటపడ్డ వారు భారత్‌కు వచ్చి తమ సహచరుల కష్టాలను నలు గురికి చెప్పడంతో కొందరిని కాంబోడియా సైన్యం కాపాడుతోంది.

ఇలాంటిదే తాజాగా సైన్యం చేబట్టిన భారీ ఆపరేషన్. ఈ ఆపరేషన్‌లో పది వేల మందికి పైగా సైన్యం ఆయుధాలతో పాల్గొందని సమాచారం. సైన్యం దాడుల కారణంగా సైబర్ నేరగాళ్లు అనేక మంది పారిపోగా వారిని వెంటాడి పట్టుకున్నారు.

కాగా సైబర్ డెన్లలో బంధింపబడి విముక్తి పొందిన 11 వేల మందిలో ఎనిమిది వేల మంది భారత్‌కు చెందిన వారేనని తెలిసింది. వీరిలో 1500 మంది తెలుగు రాష్ట్రాల వారు వున్నట్లు సమాచారం. దీనిపై కాంబోయా దేశం భారత్‌కు సమాచారం అందించిందని తెలిసింది.

# నేడే బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు

బిఎన్పీ, జమాత్-ఇ-ఇస్లామ్‌ల మధ్యనే పోటీ



**ఢాకా, ఫిబ్రవరి 11:** బంగ్లాదేశ్ సంక్షోభం తర్వాత తొలిసారి పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. విద్యార్థుల ఆందోళనతో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయింది. ఆ సమయంలో పెద్ద ఎత్తున అల్లర్లు జరిగి ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల ఒక యువ రాజకీయ నాయకుడు హత్య తర్వాత కూడా భారీ స్థాయిలో ఘర్షణలు జరిగాయి. ఇక ఇటీవలి కాలంలోహిందువులే టార్గెట్‌గా మారణహోమం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో గురువారం 12వ తేదీ బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం 7:30 గంటలకు పోలింగ్ ప్రారంభం అవుతుంది. 300 స్థానాలకు గాను 299 స్థానాలకు ఓటింగ్ జరుగుతుంది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌తో పాటు బంగ్లాదేశ్ రాజ్యాంగం సవరణకు సంబంధించిన జాతీయ చార్టర్‌పై కూడా ప్రజలు ఓటు వేయనున్నారు. ఇక బంగ్లాదేశ్ ఎన్నికల కమిషన్ ప్రకారం పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4:30 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుంది. పేపర్ బ్యాలెట్‌లతో మాత్రమే ఓటింగ్ నిర్వహిస్తున్నారు. రేపు రాత్రికి లేదా అర్ధరాత్రికి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. శుక్రవారం ఉదయానికి పూర్తి ఫలితాలు వచ్చేయనున్నాయి. హింస, ఉద్రికత్తల నేపథ్యంలో పోలింగ్ కోసం 1 మిలియన్ భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. 5 లక్షల మందితో కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఇక అనేక దేశాల నుంచి వచ్చిన 350 మంది విదేశీ పరిశీలకులు ఎన్నికలను పర్యవేక్షించ నున్నారు. ఈ ఎన్నికల్లో షేక్ హసీనా ఆవామీ లీగ్‌పై నిషేధం విధించడంతో ఇపుడు బంగ్లాదేశ్ నేషనల్‌పార్టీ విజృంభించింది. ఇపుడు ఎన్నికల్లో బిఎన్‌పితో పాటు జమాత్ ఇ ఇస్లామ్ పార్టీలు రెండే కీలకంగా నిలిచాయి.

మాజీ ప్రధాని ఖలీదాజియా మరణం తర్వాత బిఎన్‌పి చీఫ్‌గా తారిక్ రహమాన్ బాధ్యతలుస్వీకరించిన సంగతి తెలిసిందే. వీటికితోడు జెన్‌జడ్ మిత్రుడుగా కొనసాగుతున్న జమాత్ ఇటీవలే చైనా దౌత్యవేత్తలనున కలుసు కోవడం కూడా తీవ్ర చర్చ నీయాంశం అయింది.

తన ప్రతిష్టను కాపాడు కోవడంకోసమే జమాత్ జెన్‌జడ్ మిత్రుడు చైనా దౌత్యవేత్తలను కలిసారని, దీనివల్ల ఇపుడు బంగ్లా దేశ్‌లో చైనా ప్రాబల్యం కూడా పెరుగుతుందని పరిశీలకులు చెపుతు న్నారు. బిఎన్పీ పరంగా చైనా, అమెరికా, భారత్‌లతో సమన్వ యంతో కూడిన విదేశాంగ విధానం అనుసరిస్తామని ఇప్పటికే ప్రకటించింది. మరోపక్క అమెరికా కూడా బంగ్లాదేశ్ ఎన్నికలపై నిఘా వేసింది. ఇపుడు ఎన్నికల్లో హిందూ మైనార్టీల ఓట్లే అత్యధికప్రభావం చూపిస్తాయన్నది పరిశీలకుల అంచనా.

# నేడు సార్వత్రిక సమ్మె




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: భారత్- అమెరికాల మధ్య జరిగిన ట్రేడ్‌డీల్ వల్ల భారత వ్యవసాయ రంగానికే అత్యధికనష్టం వాటిల్లుతున్నదని, ఇందుకునిరసన తెలుపుతూ ఈనెల 12వ తేదీ దేశవ్యాప్త ఆందోళనకు 10 సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు పిలుపునిచ్చాయి. సుమారు 30 కోట్లమంది కార్మికులు ఈసమ్మెలో పాల్గొంటారని అంచనా. ఎఐటియుఇ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ నిరసనలో 30 కోట్లమంది పాల్గొంటారని గుర్తుచేసారు. దేశంలోని 600 జిల్లాల్లో ఈబంద్‌ప్రభావం ఉంటుందని, కేంద్రం ద్యోగ వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్పొరేట్ సానుకూల విధానాలతో సాగుతున్నదని, కార్మిక సంక్షేమాన్ని పక్కనపెట్టిందని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు రైతు సంఘాలు పెద్దఎత్తున ఈ బంద్‌లో పాల్గొంటాయన్నారు. నిత్యావసర సేవలు మాత్రమే కొనసాగుతాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలు, రాష్ట్ర రవాణా సర్వీసులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థలు, పారిశ్రామిక యూనిట్లు, ఉత్పత్తిరంగ హబ్‌లు, బొగ్గు, ఉక్కు ఇతర కీలక రంగాలు, గ్రామీణ ఉపాధి కార్మికులు ఎంజిఎన్‌రేగా కూలీలు మొత్తం పాల్గొంటారని అమర్‌జీత్‌కౌర్ తెలిపారు. సంయుక్త కిసాన్‌మోర్చా పూర్తిస్థాయిలో ఈ సమ్మెకు మద్దతిస్తున్నది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ సమ్మె ప్రభావం ఉంటుందని, ఒడిశా, అస్సాంలలో కూడా పూర్తిగామూసివేత ఉంటుందని అంచనావేస్తున్నారు. సమ్మె నోటీసును అన్ని ప్రభుత్వరంగ సంస్థలకు, ఆయా ప్రభుత్వశాఖలకు అందచేసినట్లు అమర్‌జీత్‌కౌర్ తెలిపారు.

# లైసెన్స్ లేని వాహనదారులపై వల

## ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

## పట్టుబడుతున్న వారిలో మహిళలే అధికం!

**హైదరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగం గా జంట నగరాలలో ఓవైపు డ్రంకన్ డ్రైవ్, రాంగ్ సైడ్ డ్రైవ్‌లను అడ్డుకునేందుకు స్పెషల్ డ్రైవ్ చేబట్టిన ట్రాఫిక్ పోలీసులు తాజాగా లైసెన్స్‌లు లే కుండా వాహనాలు నడిపే వారిని నిలువరించేందుకు దాడులు ముమ్మరం చేసింది. రాష్ట్రంలో జరిగే రోడ్డు ప్రమాదాలలో జంట నగరాల వాటా తక్కువగానే వున్నా నగరంలో జరిగే ప్రమాదాల్లో మృతుల సంఖ్య నాలుగు వందలకు పైగానే వుండడం గమనార్హం. ఇందులో ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా వుంటున్నారు. వీరిలో ప్రమాదాల సమయంలో హెల్మెట్లు ధరించని వారు, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారు, రాంగ్ సైడ్ డ్రైవ్‌లో వస్తున్న వా రు, పాదచారులు ఎక్కువగా వున్నారు. ఇందులో పాదచారుల మరణాలను పూర్తిగా ఆపేందుకు అనేకచోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించగా మరికొ న్నిచోట్ల నిర్మాణంలో వున్నాయి. పాదచారులు ఎక్కడపడితే అక్కడ రోడ్లు దాటకుండా వుండేందుకు రహదారుల మధ్యన ఎత్తైన నిర్మాణాలు చేబట్టా రు. ఇవి పాదచారులు ఎక్కడపడితే అక్కడ రోడ్లను దాటకుండా నిలువరిస్తున్నాయి. ఇక ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్లు ధరించేలా చే సేందుకు పోలీసులు తమ వంతుగా ప్రయత్నం చేస్తున్నారు. ఇక ట్రిపుల్ రైడింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై పోలీసుల స్పెషల్ డ్రైవ్ రెండు నెలలుగా ని రంతరంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా పట్టుబడుతున్న వారికి భారీగా జరిమానాలు విధిస్తూ కొన్ని రోజుల పాటు వాహనాలను జప్తు చేస్తునా న్నరు. రోడ్డు ప్రమాదాల మరణాలకు ఈ రెండు అంశాలు కూడా కారణమవుతున్నాయి. దీంతో పాటు రాంగ్ సైడ్ డ్రైవింగ్ కారణంగా సరైన పద్ధతిలో డ్రైవింగ్ చేస్తున్న వారు కూడా అనేక సందర్భాలలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనల్లో తమ తప్పులేకున్నా చాలా మంది మరణి స్తుండడం లేదా గాయపడు తున్నారు. ఇలాంటి ఘటనలను నివారించేందుకు పోలీసులు మరింత కఠినంగా వుండాలని నిర్ణయించారు. వీటికి తోడు గా లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపే వారివల్ల జరుగుతున్న ప్రమాదాలను పూర్తిగా నివారిం చాలని పోలీసులు నిర్ణయించారు. సాధారణంగా లై సెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపే వారిలో మైనర్లే ఎక్కువగా వుండడం తెలిసిందే. ఇప్పుడు ఈ జాబితాలో మహిళలతో పాటు యువకులు కూడా చేరిపోయారు. ఉదాహరణకు టూ వీలర్ లైసెన్స్ పొంది ఫోర్ వీలర్లు నడుపుతున్న వారి సంఖ్య ఇటీవల ఎక్కువగా వుంటోం ది. ఈ విషయంలో మహిళల సంఖ్య కూడా ఎక్కువగానే వుండడం ఆందోళనగా మారిందని పోలీసులు అంటున్నా రు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారు ఒక ర కమైన లైసెన్స్‌లు వుండి మరోరకం వాహనం నడిపే వారి సంఖ్య కూడా బాగా పెరిగింది. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారు, ఒక రకమైన లైసెన్స్‌లు వుండి మరో రకం వాహనం నడిపే వారి వల్ల ప్రమాదాలు సంభ వించిన సమ యంలో ఎవరైనా మరణించినా, గాయపడ్డా బాధి తులకు బీమా కంపెనీలు నష్ట పరి హారం అందడం లేదు. ఈ విషయంలో బీమా కంపెనీలు కచ్చితంగా నిబంధనలు పాటిస్తున్నాయని పోలీసులు అంటున్నారు. దీని కారణం గా రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారి కుటుంబాలకు న్యాయం జరగడం లేదని పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో లైసె న్స్ లేకుండా వాహనాలు నడిపే వారు, ఒక ర కమైన లైసెన్స్‌లు వుండి మరో రకం వాహనం నడిపే వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని పోలీసులు నిర్ణ యించారు. ఈ విషయంలో ఇప్పటికే మొదలైన స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడ్డవారికి రవాణా చట్టం అనుసరించి భారీ గా జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను జప్తు చేస్తున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ రెండు నెలల పాటు కొనసాగనుంది.

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు..

## భూసేకరణ షురూ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 11:** రాష్ట్రంలో మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మూసీ అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఫేజ్ ఏ1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ ఏ2లో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్లు పరిధిలో అధికారులు భూసేకరణ చర్యలు చేపట్టనున్నారు. హైదరాబాద్, గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరించేందుకు ప్రక్రియ ప్రారంభమైంది. భూయజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆయా యజమానులు తమ హక్కుల పత్రాలు(పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు) నిర్దేశిత సమయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏమైనా అభ్యంతరాలుంటే నిర్ణీత సమయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు. సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను కూడా ప్రకటించారు. ల్యాండ్ అక్విజేషన్ యాక్ట్ 2013 నిబంధనల ప్రకారం.. ఈ భూసేకరణ ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసి అభివృద్ధి పనులు దశలవారీగా కొనసాగనున్నాయి. మొత్తం గండిపేట నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల పరిధిలో, 14 మండలాలు, 46 గ్రామాల్లో మూసీ అభివృద్ధి జరగనుంది.

## మహిళపై అడవి పంది దాడి

**వేమనపల్లి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** అడవి పంది దాడిలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వేమనపల్లి గ్రామానికి చెందిన తుమ్మిడ ప్రేమన్నకు వ్యవసాయ చేనులో పనిచేస్తున్న తొర్రెం మధునక్కపై అడవి పంది



ఆకస్మికంగా దాడి చేసింది. ఉదయం వ్యవ సాయ పనులు నిర్వహిస్తున్న సమయం లో ఈ ఘటన చోటు చేసుకోవడంతో ఆమెకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనను గమ నించిన స్థానిక రైతులు, గ్రామస్తులు వెంటనే స్పందించి గాయపడిన మధునక్కను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బాధితురాలని మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించాలని కోరారు. ఈ సంఘటనతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. గత కొంతకాలంగా గ్రామ పరిసరాల్లో అడవి పందుల సంచారం పెరిగిందని రైతులు చెబుతున్నారు. పంటలకు నష్టం కలిగించడమే కాకుండా, రైతుల ప్రాణా లకు కూడా ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని అడవి జంతువుల సంచారాన్ని నియంత్రించి రైతులకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## దిగొస్తున్న కోడిగుడ్ల ధరలు!

### ఒక్కోటి రూ.6కు విక్రయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** సామాన్యులకు గుడ్‌న్యూస్. తెలంగాణలో కోడిగుడ్ల ధరల భారీగా తగ్గాయి. ఒకేసారి వీటి ధరలు పడిపోయాయి. మొన్నటి వరకు కోడిగుడ్ల ధరలు ఆకాశాన్నంటాయి. ఒక్కో గుడ్డు ధర రిటైల్ మార్కెట్లో రూ.10 పలికింది. కానీ ప్రస్తుతం కొద్దిరోజులుగా ధరలు దిగొస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో కోడిగుడ్డు ధర రూ.6 పలుకుతోంది. గత నెలలో ఈ ధర ఏకంగా రూ.10కి చేరుకుంది. ప్రస్తుతం హోల్‌సేల్ షాపుల్లో ఒక్కో గుడ్డు ధర రూ.5కే లభిస్తోంది. దీంతో హోటల్స్, బేకరీలతోపాటు వీధి వ్యాపారం చేసేవారికి పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. కాగా.. తగ్గిన చికెన్ ధరలు కూడా తెలంగాణలో తగ్గిపోయాయి. గత నెలలో సంక్రాంతి పండుగ డిమాండ్ కారణంగా చికెన్ ధరలు కొండెక్కాయి. కేజీ చికెన్ ఏకంగా రూ.350కి చేరుకుంది. ప్రస్తుతం రూ.100 మేర ధరలు తగ్గాయి. ప్రస్తుతం షాపుల్లో కేజీ చికెన్ రూ.240 నుంచి రూ.250 మధ్య లభిస్తోంది.

## రాష్ట్రంలో ఎఫ్‌పిఒల ఏర్పాటు అత్యవసరం

### ప్రభుత్వానికి తెలంగాణ రైతు కమిషన్ నివేదిక

**హైదరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** రైతులు ఉత్పత్తి చేసిన పాడి, పంటలకు మెరుగైన ధర లభించేలా కృషి చేస్తున్న ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో)ల ఏర్పాటు విషయంలో తెలంగాణ రాష్ట్రం వెనకబడిపోయిందని ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి విన్నవించారు. ఈ మేరకు సచివాలయంలో బుధవారం సీఎంవో సెక్రెటరీ శేషాద్రితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రైతు కమిషన్ ఇప్పటి వరకు ఇతర రాష్ట్రాల్లో చేసిన పర్యటనలు, అక్కడ అమలవుతున్న వ్యవసాయ, మార్కెటింగ్ విధానాలపై తయారు చేసిన నివేదికలను సమర్పించారు. ప్రధానంగా ఎఫ్‌పీవోల విషయంలో తెలంగాణ రాష్ట్రం వెనుకంజలో ఉందని, ఇతర రాష్ట్రాల్లో ఎఫ్పీవోలు బలంగా పనిచేస్తున్నాయని గుర్తుచేశారు. కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రైతులు ఆర్థికంగా బలోపేతం కావడంలో ఎఫ్పీవోలు కీలకంగా పనిచేస్తున్నాయని చెప్పుకొచ్చారు. రైతు కమిషన్ కేరళ, మహారాష్ట్రలోని నాసిక్ లో పర్యటించిన సమయంలో ఎఫ్‌పీవోల ప్రభావం స్పష్టంగా కనిపించిందన్నారు. కేంద్రం కూడా ఎఫ్‌పీవోల ఏర్పాటుకు సానుకూలంగా ఉన్న విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు. నాసిక్ లోని సహ్యాద్రి ఎఫ్ పీవో దేశంలోనే ఆదర్శంగా పనిచేస్తుందని వివరించారు. తెలంగాణలో కూడా ఎఫ్‌పీవోల ఏర్పాటులో ప్రభుత్వం చొరవ తీసుకుంటే బాగుంటుందన్నారు. అదేవిధంగా మార్కెటింగ్ వ్యవస్థ, కౌలు రైతు విధానాలపై కేరళ రాష్ట్రంలో అమలవుతున్న పాలసీలపై కమిషన్ రూపొందించిన నివేదికలను సైతం సీఎంవో సెక్రెటరీకి అందించారు.

## బ్రూవరీస్‌కు డ్రా నిబంధన లేదు

### ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మైక్రో బ్రూవరీస్‌కు సంబంధించి లైసెన్సు మంజూరు విషయంలో లక్కీ డ్రా నిబంధన లేదని ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో నియమ నిబంధనలకు అనుగుణంగానే వెళ్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ లక్కీ డ్రా తీసి మైక్రో బ్రూవరీస్ కేటాయింపులు చేయాలని నిబంధన పెట్టనందునే ఆ ప్రక్రియను అమలు చేయడం లేదన్నారు.

2025 సెప్టెంబరులో మైక్రోబ్రూవరీల స్థాపన కోసం నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు తీసుకున్నామని చెప్పారు. మైక్రో బ్రూవరీలకు టీసీయూఆర్ పరిధిలో 99 దరఖాస్తులు, ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి 7 అప్లికేషన్లు, మొత్తం 106 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో హైదరాబాద్ డీసీ పరిధిలో 33 దరఖాస్తులు, రంగారెడ్డి డీసీ పరిధిలో 64, కరీంనగర్, మెదక్ డీసీ పరిధిలో రెండేసి, ఖమ్మం డీసీ పరిధిలో 3, వరంగల్, మహబూబ్నగర్ డీసీల పరిధిలో ఒక్కో అప్లికేషన్ వచ్చిందని వివరించారు. వీటి పరిశీలన నిమిత్తం సంబంధిత డీసీలకు పంపించామని తెలిపారు. ఆబ్కారీ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి తమ శాఖ పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే గతంలో ఉన్న 12 శాతం వడ్డీని 10 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నామని తెలియచేశారు. ఈ 2 శాతం తగ్గింపుతో ఉద్యోగులపై ఆర్థిక భారం తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. అత్యవసర చికిత్సల కోసం నగదు అందించడం, అవసరమైన వారికి రుణ సదుపాయం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

# ఒక్క క్లిక్‌తో పొలం వద్దకే యంత్రాలు

### మొబైల్‌లో బుక్ చేసుకునేలా ప్రత్యేక ఫామ్‌యాప్

### కొత్త డిజిటల్ విధానానికి వ్యవసాయ శాఖ శ్రీకారం

**హైదరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** వ్యవసాయంలో యాంత్రీకరణను వేగవంతం చేయడానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ కొత్త డిజిటల్ విధానానికి శ్రీకారం చుడుతోంది. టాక్సీ సేవల మాదిరిగా ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, డ్రోన్లు వంటి వ్యవసాయ యంత్రాలను మొబైల్‌లోనే బుక్ చేసుకునేలా ప్రత్యేకంగా ఫామ్ యాప్ ను అభివృద్ధి చేసేందుకు కసత్తు ప్రారంభించింది. యూరియా యాప్ రూపొందించిన విధంగానే తాజాగా సాగులో అవసరమైన యంత్రాలను సైతం డిజిటల్ పద్ధతిలో రైతులకు సరఫరాచేసేందుకు నిర్ణయించింది. ఈ విధానంతో ముఖ్యంగా రైతుల పనిభారం తగ్గించడమే కాకుండా త్వరితగతిన వ్యవసాయ పనులు పూర్తయ్యే లక్ష్యంగా ఈ యాప్‌ను తీసుకొస్తోంది. ఈ యాప్ అందుబాటులోకి వస్తే రైతులు తమ గ్రామ పరిధిలో ఉన్న యంత్రాల వివరాలు మొబైల్‌లోనే చూసి, అవసరమైన తేదీ సమయం ఎంచుకుని బుక్ చేసుకునే వెసులుబాటు, సమయం ఆదా అవుతుంది. బుకింగ్ చేసిన వెంటనే యంత్ర యజమాని వివరాలు అందుతాయి. నిర్ణయించిన సమయానికి యంత్రం పొలం వద్దకు చేరుకుని దున్నడం, నాట్లు వేయడం, మందులు పిచికారీ చేయడం వంటి పనులు పూర్తి చేస్తుంది. కాగా ప్రతీ పంటల సీజన్లలో యంత్రాల కొరత రైతులకు పెద్ద సమస్యగా మారుతోంది. ఒకేసారి కోతలు మొదలైతే హార్వెస్టర్లు, మక్కజొన్న కోసే యంత్రాలు దొరకక రైతులు రోజులు వేచి చూడాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు గత కొన్ని సంవత్సరాలుగా పరిశీలనలో ఉన్న ప్రణాళిక ఇప్పుడు కార్యరూపం దాల్చే దశకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ సేవలకు వాడుతున్న యాప్ నమూనాను పరిశీలించి, మరింత విస్తృతంగా అమలు చేయాలనే ఆలోచనలో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు. ఫామ్ యాప్ వల్ల రైతులు కూలీలపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుంది. గ్రామాల్లో పెరుగుతున్న కూలీల కొరత కారణంగా పంటలు ఆలస్యమవుతున్న పరిస్థితికి చెక్ పడుతుంది. యంత్రాలతో పనులు త్వరగా పూర్తవడంతో సమయం ఆదా అవుతుంది. అంతేకాకుండా ధరల విషయంలో పారదర్శకత పెరిగి, మధ్యవర్తుల సమస్య కూడా తగ్గే అవకాశం ఉంది. డ్రోన్ల వినియోగం వల్ల ఎరువులు, పురుగుమందులు శాస్త్రీయంగా పిచికారీ చేయవచ్చు.



బుధవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ బలిదాన్ దివస్ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శ్రద్ధాంజలి ఘటించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులు

## రాజకీయాలు ప్రజాసేవ కోసమే

### ఆచరణతో చూపిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** ఆడంబరం, ప్రదర్శన కోసం రాజకీయాలు కాదని, కేవలం సేవ కోసమేనని తన జీవిత ఆచరణతో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ చూపించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. హంగామా, ఆర్భాటాలకు కేంద్రంగా మారిన నేటి రాజకీయాల్లో ఆయన జీవితం ప్రతీ రాజకీయ నాయకుడు నేర్చుకోవాల్సిన పాఠమని సూచించారు. ఈ మేరకు నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం దీన్‌దయాల్ ఉపాధ్యాయ బలిదివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి రాంచందర్‌రావు తదితర నేతలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ జనసంఘ్ స్థాపకుల్లో ఒకరుగా, పార్టీ సిద్ధాంతకర్తగా ఆయన చూపిన మార్గం దిక్సూచి వంటిదన్నారు. భారతీయ జనసంఘ్‌గా ప్రారంభమైన ఆ ఉద్యమం 1980లో భారతీయ జనతా పార్టీగా ఆవిర్భవించి, నేడు దేశవ్యాప్తంగా అధికారం లోకి రావడం ఆయనలాంటి మహనీయుల త్యాగ ఫలితమేనని స్పష్టం చేశారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అత్యంత సాధారణమైన, నిరాడంబరమైన జీవితం గడిపారని చెప్పారు. ఆయన ఏకాత్మ మానవ దర్శనంనేడు భారతీయ జనతా పార్టీ అధికారిక తత్వంగా మారిందన్నారు. కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్, బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ ఆదేశం మేరకే వచ్చా

### బాధిత కుటుంబానికి బిజెపి అండ

### బాధ్యులు ఎంతటి వారైనా శిక్షించాల్సిందే

### ఆత్మహత్య చేసుకున్న మక్తల్ బిజెపి అభ్యర్థి భార్య సత్యమ్మను పరామర్శించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### రూ. 10 లక్షల చెక్కు అందజేత



బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో ఎంపి డికె అరుణ తదితరులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మక్తల్ టౌన్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** మహాదేవప్ప కుటుంబాన్ని పరామర్శించమని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశించారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ అభ్యర్థిగా 6వ వార్డు నుండి పోటీ చేసి బెదిరింపులకు గురై ఆత్మహత్య చేసుకున్న మహాదేవప్ప విషయాన్ని తాను పార్లమెంటులో ప్రస్తావించి నప్పుడు ప్రధాని ఈ విషయంపై ఆరా తీశారని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ తరఫున రూ. 10 లక్షల చెక్కును మృతుడి భార్య సత్యమ్మకు కేంద్ర మంత్రి అందజేశారు. ఈ సంద ర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నుండి పోటీ చేసిన ఎరుకలి మహాదేవప్ప ఆత్మహత్యకు పాల్పడడం తనను తీవ్రంగా కలిచివేసిం దన్నా రు. పార్లమెంటు సమావే శంలో ఈ అంశాన్ని ప్రస్తా విస్తూ తాను తెలుగులో మాట్లాడడం జరిగిందని, ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే అలా మాట్లా డానని అన్నారు. తాను పార్లమెంటులో ఎరుకలి మహాదేవప్ప ఆత్మహత్య సంఘటనను ప్రస్తావించిన తక్షణమే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మక్తల్ వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించమని ఆదేశించారని తెలిపారు. ఈ సంఘటన పై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి చట్టరీత్యా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెంట మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, కొండయ్య, రతంగపాండు రెడ్డి తదితరులు ఉన్నారు.

## నిరుపేద రైతులకు తీపికబురు

### ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధులు ఈ నెలలోనే..

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** నిరుపేద రైతులకు పంట పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి స్కీమ్ పై ప్రభుత్వం రైతులకు గుడ్ న్యూస్ చెప్పనుంది. 22వ విడత కిసాన్ సమ్మాన్ నిధులను ఈ నెలలో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన రైతు కుటుంబాలకు ప్రతి ఏడాది రూ.6,000 ఆర్థిక సహాయాన్ని రూ.2,000 చొప్పున మూడు విడతల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా రైతుల బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తున్న విషయం తెలిసిందే. సాధారణంగా పీఎం-కిసాన్ పథకం చెల్లింపులను ప్రతి నాలుగు నెలలకు ఒకసారి చేస్తారు. 21వ విడతకు సంబంధించి గత ఏడాది నవంబర్‌లో రైతులకు చెల్లించారు. 22వ విడత చెల్లింపులు ఈ నెల అంటే ఫిబ్రవరి- మార్చి మధ్య విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.



అభివాదం చేస్తున్న ఎంపిలు ఆర్.కృష్ణయ్య, పాకా సత్యనారాయణ, బీద మస్తాన్‌రావు, నాగరాజు, అప్పల నాయుడు

# కోర్‌అర్బన్ రీజియన్ వరకు జలమండలి పునర్వ్యవస్థీకరణ

### జలమండలి ఇడిగా ఉన్న మయాంక్ మిట్టల్ జాయింట్ ఎండిగా నియామకం

### బాధ్యతలు స్వీకరించిన జాయింట్ ఎండి, ఇడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** జలమండలి పరిధిని కోర్ అర్బన్ రీజియన్ వరకు పునర్విభజన విస్తరణలో భాగంగా జోన్లుగా సర్కిళ్లు, సర్కిళ్లుగా సబ్ డివిజన్లు, వార్డులుగా సెక్షన్లలతో విభజించడంతో జీహెచ్ఎంసి తరహాలోనే జలమండలి కొత్త రూపు సంతరించుకుంది. ఈ పునర్వ్యవస్థీకరణ భాగంగా పరిపాలన సౌలభ్యం కోసం జలమండలిని కొత్తగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరిలుగా మూడు జోన్లు ఏర్పాటు చేశారు. ఓఆర్ఆర్ వరకు వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఈ ప్రాంతంలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, పౌర సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం జలమండలి ఈడిగా పని చేస్తున్న మయాంక్ మిట్టల్‌ను జాయింట్ ఎండిగా ప్రభుత్వం నియ మించింది. కొత్త విభజన ప్రకారం మల్కా జిగిరి జోన్‌కు పంకజ, హైదరాబాద్ జోన్‌కు స్వామ్రాట్ అశోక్, సైబరాబాద్ జోన్‌కి సంతోష్‌లను నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జలమండలిలో జాయింట్ ఎండిగా పదోన్నతి పొందిన మయాంక్ మిట్టల్ బుధవారం రోజున ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరితోపాటు ప్రభుత్వం ముగ్గురు ఈడీలు పంకజ, స్వామ్రాట్ అశోక్, సంతోష్‌లను సైతం ఆయా జోన్లలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ ఎండి, ఈడిలు జలమండలి ఎండి అశోక్ రెడ్డిని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

# ఓయులో ఘనంగా ముగిసిన జాతీయ సదస్సు

### కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై లోతైన చర్చలు, కీలక సిఫార్సులు



మాట్లాడుతున్న మణిపూర్ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.తిరుపతిరావు తదితరులు

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మూడురోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు బుధవారం ఘనంగా ముగిసింది. 'సమకాలీన భారతదేశంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాల పునఃఆవిష్కరణ: నియోజక వర్గాల పునర్విభజన, ఆర్థిక సమాఖ్య వాదం, ఒకే దేశం-ఒకే ఎన్నిక, డిజిటల్ గవర్నెన్స్' అంశంపై జరిగిన ఈ సదస్సులో సమాఖ్య వ్యవస్థ బలోపేతానికి సంబంధించి పలు ముఖ్య సిఫార్సులు వెలువడినట్లు నిర్వాహకులు తెలిపారు.

కాన్ఫరెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు మాటా ్లడుతూ, మూడు రోజులపాటు జరిగిన సాంకేతిక సమావేశాల్లో కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై రాజ్యాంగ, విధాన, పరిపాలనాపరమైన సవాళ్లను విశ్లే షిస్తూ సుదీర్ఘ చర్చలు జరిగినట్లు వెల్లడించారు. మూడోరోజు నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి మణిపూర్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ తిరుపతిరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సమాఖ్య వ్యవస్థలో కేంద్ర-రాష్ట్ర సమన్వయం ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ బిజు ముఖ్యవక్తగా పాల్గొని సమ కాలీన సమాఖ్య రాజకీయాలపై విశ్లేష ణాత్మక ప్రసంగం చేశారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రతి పాదన నేపథ్యంలో రాష్ట్రాల స్వయం ప్రతి పత్తి, పాలనా సమర్థత, ప్రజాస్వామ్య బాధ్యత మధ్య ఉన్న సంబంధాన్ని ఆయన వివరిస్తూ, ఈ అం శంపై శాస్త్రీయ చర్చలు కొనసాగాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం గౌరవ అతిథిగా పాల్గొని, రాజనీతి శాస్త్ర విభాగం చేపట్టిన ఈ జాతీయ స్థాయి అకాడెమిక్ కార్యక్రమాన్ని అభినందించారు.

దేశవ్యాప్తంగా పాల్గొన్న పరిశోధకులు, అధ్యాపకులకు ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

## డిమాండ్ల కోసం 10 లక్షల మంది ఒబిసిలతో 'బిసి గర్జన సభ'

### ముఖ్యఅతిథి ప్రధాని మోడీ: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** బిసిల డిమాండ్ల సాధనకై వచ్చే ఏప్రిల్‌లో పది లక్షల మంది ఒబిసిలతో ప్రధాని నరేంద్రమోడీ ముఖ్య అతిథిగా 'బిసిల గర్జన సభ' నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. డిమాండ్ల సాధన కోసం ప్రతి ఒబిసి తన ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం, జాతి కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం, తెలంగాణ బిసి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలోని ఎపి భవన్‌లోని గురజాడ కాన్ఫెరెన్స్ హాల్‌లో జరిగిన మేధో మధనం సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎపి బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎన్ మారేష్, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆర్.కృష్ణయ్యతోపాటు బిజెపి ఎంపి పాకా సత్య నారాయణ, తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కర్నూల్ పార్లమెంట్ సభ్యులు నాగరాజు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసిలకు చట్ట సభలలో బిల్లు పెట్టి 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్‌లు కల్పించాలని, బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. బిసిల ఉద్యమం దేశవ్యాప్తంగా కొనసాగుతున్నదని, ప్రధాని మోదీ ద్వారానే బిసిల డిమాండ్లు అమలు జరుగుతాయని స్పష్టం చేశారు. టిడిపి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, బిజెపి రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు నాగరాజు, విజయనగరం పార్లమెంట్ సభ్యుడు అప్పల నాయుడు ప్రభృతులు ప్రసంగించారు.

# ఎఐతో యుఎస్ అండర్ 30లో చోటు..



**భారత సంతతికి చెందిన మరో వ్యక్తి అమెరికాలో ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఏఐ విభాగంలో సాధించిన ప్రగతికి ఫోర్బ్స్ అమెరికా 30 అండర్-30 జాబితాలో చోటు సంపాదించారు కల్యాణి రామదుర్గం.**

అమెరికాలో ఫిన్టెక్ సంస్థ కోబాల్ట్ లాబ్‌ను స్థాపించారు కల్యాణి. బ్యాంకులు, ఫైనాన్షియల్ కంపెనీలకు ఏఐ సేవల్ని అందిస్తోంది. ఈమె తల్లిదండ్రులు శాస్త్రవేత్తలు. దాంతో తనకూ సైన్స్, ప్రయోగాలంటే ఇష్టం ఏర్పడింది. స్కూల్లో, యూనివర్సిటీలో భిన్నమైన ప్రాజెక్టులు చేశారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివారు. అక్కణ్నుంచే ఏఐ, మెషీన్ లర్నింగ్ వైపు ఆసక్తి కనబర్చారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రొటీన్ పనిచేస్తుంటే సంతృప్తి ఉండదు. త్వరగా బోర్ కొడుతుంది. అందుకే ఛాలెంజింగ్ ప్రాజెక్టుల్ని తీసుకుంటా అని చెప్పే కల్యాణి... మొదట 'ఆపిల్' సంస్థలో చేరారు. అక్కడ 'ఆపిల్ పే' ఆప్‌ను ఉగ్రవాదులు వాడకుండా నిలువరించే భద్రతను పెంచే ప్రాజెక్టులో పనిచేశారు. అయితే అక్కడ వ్యవస్థ చాలా నెమ్మదిగా ఉండటం తనకు నచ్చలేదు. వేల పేజీలను మనుషులే ఒక్కో అక్షరం చదువుతూ వెళ్లడం గమనించారు. ఆ పనికి ఏఐని ఉపయోగిస్తే ఎంతో సులభంగా, వేగవంతంగా పూర్తిచేయొచ్చని భావించి బయటకు వచ్చారు. ఆ సమయంలో మరో భారత సంతతి అమ్మాయి ఆశీ అగర్వాల్ ఈమెతో చేతులు కలిపారు. ఇద్దరూ అంకుర సంస్థలకు బూట్ క్యాంప్ నిర్వహించి మెంటార్‌షిప్ ఇచ్చే వై - కాంబినేటర్‌కు ఎంపికయ్యారు. 'ఆశీ, నేనూ ఆర్థిక విభాగంలో పనిచేసిన అనుభవం చివరకు అటుగా అడుగులు వేశాం' అని చెప్పే కల్యాణి.. తాను సీఈఓగా, ఆశీ సీటీఓగా 2023లో కోబాల్ట్‌ను కలిగి ఉంది. పాలసీలూ, కాంట్రాక్టులూ, ఇతర రకాల డాక్యుమెంట్లను త్వరతగతిన పరిశీలించే ఏఐని అభివృద్ధి చేశారు. దీన్ని ఉపయోగించి వేల పేజీలున్న డాక్యుమెంట్లను వేగంగా చదివేయొచ్చు. బ్యాంకుల కంపెనీల నిబంధనలను పాటిస్తున్నారో లేదో త్వరితగతిన తెలుస్తుంది. దీంతో ఆంక్షలు ఉన్న దేశాల నుంచి నగదు లావాదేవీలను నిలువరించ వచ్చు. ఈ సంస్థకు ఇప్పటి వరకు రూ.120 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 'మా సేవల్ని చాలా సంస్థలు తీసుకుంటున్నాయి. ఈ జాబితాలో మాకొక గుర్తింపు వచ్చింది. అందరూ వాడుతున్నారు కాబట్టి మనమూ అని కాకుండా, కంపెనీలు తమ అవసరాన్ని గుర్తించి ఏఐని వినియోగించుకునేందుకు చూడాలి' అని చెబుతారు కల్యాణి.

# ప్రేమ వైఫల్యంతో డిప్రెషన్.. చికిత్సే శరణ్యం!

వ్యథ



డా. ఎన్.బి. సుధాకర్ రెడ్డి
సైకాలజిస్ట్

మా అమ్మాయి ప్రేమ విఫలం కావడంతో తీవ్రమైన డిప్రెషన్‌తో బాధపడుతోంది. ఆమె వయస్సు 25 ఏళ్లు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. తనతో కలిసి పనిచేసే అబ్బాయిని ప్రేమించింది. అయితే కులం వేరు కావడంతో అతని తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదు. వారిని కాదనలేక ఆ అబ్బాయి కూడా చేతులు ఎత్తేశాడు. దీంతో అతను లేని జీవితం తనకు అర్థం లేనిదిగా అనిపిస్తోందని చెబుతోంది. ఆత్మహత్య చేసుకుంటానని ఏడుస్తోంది. నిద్ర, ఆహారం పూర్తిగా తగ్గిపోయాయి. సైకాలజిస్టును కలిస్తే కౌన్సెలింగ్ చేసి, సమస్య తీవ్రంగా ఉన్నందున సైకియాట్రిస్టును కలవాలని సూచించారు. "ప్రేమ పిచ్చి కాదు కదా, మరి సైకియాట్రిస్టు ఎందుకు?" అని అడిగితే, తీవ్రమైన డిప్రెషన్, ఉద్వేగ లోపాలు ఉన్నందున మందులు అవసరమవుతాయని చెప్పారు. మాకు సరైన మార్గదర్శనం చేయండి.

- ఒక సోదరి, విజయవాడ



**జవాబు :**

అమ్మా, మీ ఆవేదన పూర్తిగా అర్థమవుతోంది. ఒక తల్లిగా మీకు కలిగే భయం, అయోమయం సహజమే. కానీ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. ప్రేమ పిచ్చి కాదు. కానీ ప్రేమ విఫలమవడంతో వచ్చిన తీవ్రమైన డిప్రెషన్ ఒక వైద్య సమస్య.

ఇక్కడ గమనించాల్సిన ప్రమాద సూచనలు ఉన్నాయి –
'అతను లేని జీవితం వద్దు' అని చెప్పడం
ఆత్మహత్య చేసుకుంటానని స్పష్టంగా చెప్పడం
నిద్ర, ఆహారం పూర్తిగా తగ్గిపోవడం
ఉద్యోగం, రోజువారీ పనులపై ఆసక్తి కోల్పోవడం ఇవి సాధారణ మనస్తాప లక్షణాలు కాదు. ఇవి క్లినికల్ డిప్రెషన్ లక్షణాలు. కాబట్టి సైకియాట్రిస్టును తప్పకుండా కలవాలి. జ్వరం వంటి శారీరక వ్యాధులకు మందులు వాడినట్లే, మెదడులో రసాయన అసమతుల్యత వల్ల వచ్చిన డిప్రెషన్‌కు కూడా మందులు అవసరం. మందులు ప్రేమ కోసం కాదు.. డిప్రెషన్ చికిత్స కోసం. కౌన్సెలింగ్, మందులు రెండూ కలిసి చికిత్స చేయాలి. ఆమెను ఒంటరిగా ఉంచకండి. కుటుంబ సభ్యుల పర్యవేక్షణ అవసరం.

'మర్చిపో', ధైర్యంగా ఉండు" వంటి మాటలు చెప్పకండి. ఆమె బాధను తక్కువ చేసి చూడకండి. అవసరమైతే కొంతకాలం ఉద్యోగానికి విరామం ఇవ్వడం కూడా మంచిదే.

' ప్రేమ పిచ్చి కాదు కదా' అన్న సందేహంతో చికిత్స ఆలస్యం చేయవద్దు. ఈ దశలో మందులు వాడటం అవమానం కాదు – అవసరం.

మీ అమ్మాయి జీవితం ఇప్పుడు ఒక చీకటి గదిలో ఉంది. సరైన వైద్యసహాయం ఆ గదిలో వెలుగు నింపుతుంది.



## పసిడికి పరిమళం

ఒక వ్యక్తి ఔన్నత్యం, అతడు మహనీయులకు చేసే వినతిని బట్టి గ్రహించవచ్చును. నాగేశ్‌వాసుదేవ గుణాజీ పేరు తెలియని సాయి భక్తుడు. ఉండడు అంటే అతిశయోక్తి కాదు. గుణాజీ గారు శ్రీ రమణులను గురించి విని వారిని దర్శించారు. గీతా వ్యాఖ్యానం వ్రాయటం ముగించిన తరువాత జ్ఞానేశ్వరుడు ఒక వరాన్ని కోరిన విధంగానే, గుణాజీ రమణులను ఒక వరాన్ని కోరారు. ఓ! భగవాన్ మీరు మాకేదైనా అనుగ్రహించేటట్లయితే ఇట్లా అనుగ్రహించండి. మా అహంకారం అతర్థానమవ్వాలి. మా దృష్టి (ఆత్మపై) కేంద్రీకృతమవ్వాలి. ఇంద్రియాతీతమైన సహజమైన ఆనందం కలగాలి. ఉదకంలో కరిగిపోయే ఉప్పు వలె మా మనస్సులు ఆత్మలో లీనమవ్వాలి. దీన్ని విని శ్రీ భగవాన్ సంతోషించారు. వారు కాళ్ళు బారజాపుకొని బిగ్గరగా తీసుకోండి. మీ కెంత కావాలో తీసుకోండి. లోపలికి వెళ్ళండి అన్నారు. అప్పుడు శ్రీ భగవానుని రూపం చూడాలి. దేవతలు చూడదగనగ దృశ్యమది. ఆ రూపాన్ని ఎన్నటికి మరచిపోలేను అన్నారాయన. గుణాజీ అప్పుడు తనకు కలిగిన ఆనందాన్ని సాయి చరితను చదివే సాయి భక్తులకు పంచిపెట్టారు. ఆయన కేవలం మరాఠీ వచ్చిన వారు మానరతమే పఠించగలిగిన సాయి సచ్చరితను క్లుప్తంగా ఆంగ్లీకరించారు. ఆ ఆంగ్ల గ్రంథాన్ని పారాయణ చేసిన భక్తులు ఎందరో.. ఎందరెందరో! ఆ గ్రంథాన్ని చదువుతుంటే సాయి భక్తులు పరవశించి పోతారు. ఆ గ్రంథమే ప్రామాణిక గ్రంథమైంది. ఆ గ్రంథానినదర దేశ, విదేశాలలో తమ మాతృ భాషలోనికి అనువదించిన వారు వేనకు వేలు. గుణాజీగారు మూలానికే వన్నె తెచ్చారు. పసిడికి పరిమళం తోడైనట్లు సాగుతుంది.ఆ అనువాదం.ఒకటి, రెండు ఉదాహరణలు.. మొదటి అధ్యాయంలో సాయినాథుడు గోధుమలను విసరే సంఘటనలో కబీరు-నిపతిరంజన్‌ల గాథను తెలపటం. సాయిబాబా తెలిపినట్లు సాయి నివసించిన మసీదే ద్వారక అని స్కంధ పురాణంలోని శ్లోకాన్ని ఉటంకించారు. గుణాజీ సాయి సచ్చరిత 4వ అధ్యాయంలో పౌరాణికంగా ద్వారకామాయినే ద్వారకగ చూపారు గుణాజీ. గుణాజీ 1873 జూలైలో జన్మించారని, 1963లో దేహాన్ని వదిలారని తెలుస్తోంది. గుణాజీ రచించిన గ్రంథాన్ని లేదా కనీసం ఒక భాగాన్ని పఠిద్దాం! ఆయనను స్మరిద్దాం.

- యం.పి.సాయినాథ్

## మష్రూమ్ పాపర్స్



**కావసినవి:** మష్రూమ్ పాపర్స్ బటన్ మష్రూమ్స్ : పావు కిలో, ఆలుగడ్డ: ఒకటి, చీజ్ తురుము: అర కప్పు, ఆరిగానో, రెడ్‌చిల్లీ ఫ్లేక్స్: ఒక టీస్పూన్ చొప్పున, మిరియాల పొడి: చిటికెడు, మైదా పిండి, కార్న్‌ఫ్లోర్: రెండు టేబుల్ స్పూన్ల చొప్పున, బ్రెడ్ క్రంబ్స్: ఒక కప్పు, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడా, చాట్ మసాలా: అర టీస్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా

**తయారీ విధానం..**

ముందుగా ఆలుగడ్డను ఉడికించి మెదపాలి. ఒక గిన్నెలో ఆలుగడ్డ ముద్ద, చీజ్ తురుము, మిరియాల పొడి, ఉప్పు, ఆరిగానో, రెడ్‌చిల్లీ ఫ్లేక్స్, కొత్తిమీర తురుము వేసి బాగా కలపాలి. మష్రూమ్స్ కింద కాడలాంటి దాన్ని తీసేసి డొప్పలో ఆలుగడ్డ మిశ్రమం కూరాలి. ఒక గిన్నెలో మైదా, కార్న్‌ఫ్లోర్, కొద్దిగా ఉప్పు వేసి తగినన్ని నీళ్ల పోసి జారుగా కలపాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి నూనె పోసి వేడి చెయ్యాలి. మష్రూమ్స్‌ను మైదా మిశ్రమంలో ముంచి, బ్రెడ్ క్రంబ్స్‌లో దొర్లించి కాగిన నూనెలో వేసి దోరగా వేయించుకోవాలి. పైనుంచి చాట్ మసాలా చల్లుకుంటే వేడివేడిగా నోరూరించే మష్రూమ్ పాపర్స్ సిద్ధం.

## ఫోన్ చూస్తూ ఉన్నారా ?

బ్లూ లైట్... ఫోన్, ట్యాబ్, టీవీ, కంప్యూటర్ తెరలు వెదజల్లే సన్నటి వెలుగు ఇది. రోజులో ఎక్కువగంటలు ఆ తెరలకు అతుక్కుపోతే... కంట్లో సూపర్ ఆక్సైడ్, హైడ్రాక్సిల్ రాడికల్స్ వంటి చెడు రసాయనాలు పేరుకుపోతాయి. అవి కళ్లని పొడిబారేలా చేస్తుంది... తక్కువ వయసులోనే కంటి శుక్లాలకి కారణమవుతుంది. కంప్యూటర్‌ని వాడటం తప్పనిసరి అయినప్పుడు... ఈ సమస్య రాకుండా చూడటానికి... ఆహారంలో పండ్లూ కాయగూరలను తీసుకోవడం మంచిదని వైద్యులు ఎప్పటి నుంచో చెబుతారు వస్తున్నారు. ఖివాటిల్లో ఏవి తింటే ఎక్కువ ప్రభావం ఉంటుంది?ఖి అన్న అంశంపై పరిశోధన చేశారు పోలండ్‌లోని వుడ్జ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. పాలకూర, బచ్చలికూర వంటి స్పినాచ్ రకం ఆకు కూరలూ, కాలే వంటి క్యాబేజీ రకం కాయగూరలూ మంచివని తేల్చారు. వీటిలో 'లూటిన్', 'జీయాజంతిన్' అనే ప్రొటీన్ (కెరోటినాయిడ్) ఎక్కువగా ఉంటుందట. మిగిలిన ప్రొటీన్ల లు అన్నింటికన్నా ఇవి రెండు మాత్రమే కంటిలోని లెన్స్ని, రెటీనాలోని మాక్యులా అనే భాగాన్నీ కాపాడుతున్నాయట. కాబట్టి పాలకూర, బచ్చలికూరలాంటివాటిని రోజుకు కనీసం 10 నుంచీ 20 గ్రాముల వరకు తీసుకోవడం మంచిదని చెబుతున్నారు.



# మూడు ప్రాజెక్టులలకు గ్రీన్‌సిగ్నల్

నటసింహ బాలకృష్ణ వరుసగా మూడు ప్రాజెక్టులను లైన్‌లో పెట్టారన్న ప్రచారం జరుగుతోంది. అందులో మొదటిది గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వస్తున్న చిత్రం షూటింగ్ మార్చి 19న ఉగాదికి మొదలు కానుంది. దసరా కానుకగా ఈ మూవీని రిలీజ్ చేయాలని ఆశిస్తున్నారు నిర్మాత వెంకట సతీశ్ కిలారు. ఆ తరువాత హరీశ్ శంకర్ దర్శకత్వంలో నాగవంశీ నిర్మించబోయే చిత్రంలోనూ బాలయ్య నటిస్తారని తెలుస్తోంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలోనూ బాలయ్య ఓ సినిమాలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. వీటిలో వివేక్ ఆత్రేయ మూవీపైనే అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే ఇప్పటి దాకా టాప్ స్టార్స్‌ను హ్యాండిల్ చేయని వివేక్ ఆత్రేయ బాలయ్య లాంటి మాస్ హీరోను ఎలా తెరపై చూపిస్తారో అన్న ఆసక్తి కలుగుతోంది. ఈ మూవీని బాలయ్యతో ఇంతకు ముందు వీరసింహారెడ్డి నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తారని వినిపిస్తోంది. ఇలా ఈ మూడు చిత్రాలు ఫ్యాన్స్ లోనూ, టాలీవుడ్ జనంలోనూ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మొదటి నుంచీ విలక్షణంగా సాగుతోన్న బాలయ్య ఇప్పుడు నటించబోయే మూడు చిత్రాల్లోనూ వైవిధ్యం ప్రదర్శించనున్నారని సమాచారం. ప్రస్తుతం బాలయ్యతో గోపీచంద్ మలినేని తెరకెక్కించబోయే సినిమా ఫ్యామిలీ సెంటిమెంట్‌తో యాక్షన్ ను మిక్స్ చేసుకొని రూపొందనుందట. బాలయ్య ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకొని హరీశ్ శంకర్ మాస్ ఎలిమెంట్స్ తో పాటు ఈ నాటి పాలిటిక్స్‌ను కూడా జోడించి ఓ సబ్జెక్ట్ సిద్ధం చేశారని తెలుస్తోంది. బ్రోచేవారెవరురా, అంటే సుందరానికి వంటి విభిన్న కథాంశాలను తెరకెక్కించిన వివేక్ ఆత్రేయ కూడా బాలయ్యను ఓ న్యూ యాంగిల్‌లో ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారట. ఇలా రాబోయే మూడు చిత్రాల్లోనూ వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి బాలయ్య రెడీ అవుతున్నారు. అఖండ2 తాండవంపై ఎన్నో ఆశలు పెట్టుకొని నిరాశ చెందిన అభిమానులకు ఆనందం పంచడానికే బాలయ్య వెరైటీ రోల్స్‌కు ఓకే చెప్పారని అంటున్నారు.



తెర

## డాక్టర్ శ్రీలీల



నటిగా రాణిస్తూనే శ్రీలీల ఎంబీబీఎస్ పూర్తి చేశారు. తాజాగా వైద్య పట్టా అందుకున్నారు. తమ ఇంట్లో జరిగిన ఓ సంఘటన కారణంగానే డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నారు శ్రీలీల. తన అమ్మమ్మ ఉన్నట్టుండి పడిపోయిందని.. అప్పుడు ఏం చేయాలో మాకు అర్థం కాలేదని, వైద్యుడైన తన అన్నయ్య వచ్చి, చిన్నపాటి వైద్యం చేశాక కొన్ని క్షణాల్లోనే ఆమె మామూలు స్థితిలోకి వచ్చిందని ఆమె ఓ సందర్భంలో గత అనుభవాన్ని పంచుకుంటూ.. వైద్యురాలిని కావాలని అప్పుడే ఫిక్స్ అయిపోయాయని తెలిపారు. శ్రీలీల తల్లి స్వర్ణలత కూడా వైద్యురాలే. అనుకోకుండానే సినిమాల్లోకి వచ్చినా.. డాక్టర్‌గా సేవ చేయాలన్న సంకల్పాన్ని వదల్లేదు. వరుస చిత్రాలతో బిజీగా గడుపుతూనే ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా చదువుకే కేటాయించేవారు. 2019లో కన్నడ సినిమా కిస్‌తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన శ్రీలీల.. పెళ్లి సందీదతో 2021లో టాలీవుడికి పరిచయం అయ్యారు. తర్వాత, అగ్ర హీరోల సినిమాల్లో నటించి అనతి కాలంలో స్టార్గా మారారు. ఆమె డ్యాన్స్‌కు ప్రత్యేక అభిమానగణం ఉంది. ఇటీవల పరాశక్తి సినిమాలో రత్నమాలగా కనిపించిన ఆమె.. పవన్ కల్యాణ్ సరసన ఉస్తాద్ భగత్సాంగ్‌లో నటిస్తున్నారు.

## ఇద్దరు భామలతో..



అక్కినేని హీరో సుమంత్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అలరించడానికి రెడీ అవుతున్నారు. ప్రస్తుతం ఆయన న్యూటన్స్ థర్డ్ లా అనే సినిమాతో పాటుగా మహేం ద్రగిరి వారాహి అనే మూవీ చేస్తున్నారు. సంతోష్ జాగర్లమూడి దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో మహేంద్రగిరి వారాహి సినిమా తెరకెక్కుతోంది. ఇందులో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే ఈ సినిమాలో ఇద్దరు స్టార్లు భాగం కాబోతున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. జాగర్లమూడి ఇంతకముందు సుమంత్‌తో సుబ్రహ్మణ్యపురం అనే సినిమా రూపొందించారు. ఇప్పుడు భారీ బడ్జెట్‌తో డివోషనల్ టచ్‌తో థ్రిల్లర్ సినిమా చేస్తున్నారు. ఇందులో మాళవిక నాయర్, మీనాక్షి గోస్వామి హీరోయిన్లుగా నటిస్తున్నారు. రంగమర్తాండ నిర్మాత మధు కాలిపు రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం సమకూర్చారు. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది. ఇటీవల సుమంత్ బర్త్ డే సందర్భంగా ఓ చిన్న గ్లింప్స్ రిలీజ్ చేసారు.



## దర్శకురాలిగా కొత్త ప్రయాణం

నాంది తదితర చిత్రాల్లోని పవర్‌ఫుల్ పాత్రలతో తెలుగు ప్రేక్షకులకు ఆకట్టుకున్న కోలీవుడ్ నటి వరలక్ష్మి శరత్‌కుమార్. ఇప్పుడామె కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టారు. దర్శకురాలిగా ఓ సినిమాని తెరకెక్కిస్తున్నానంటూ సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. తన చిత్రానికి సరస్వతి టైటిల్ ఖరారైందని, త్వరలోనే థియేటర్లలో విడుదల కానుందని తెలిపారు. ప్రముఖ నటుడు శరత్‌కుమార్ వారసురాలిగా ఇండస్ట్రీలోకి వచ్చినా.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు వరలక్ష్మి. కెరీర్ ప్రారంభంలో కోలీవుడ్లో హీరోయిన్గా అలరించి.. తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారారు. తెనాలి రామకృష్ణ బీఏబీఎల్‌తో టాలీవుడ్లోకి వచ్చిన ఆమె.. నెగెటివ్ షేడ్ క్యారెక్టర్లకు, పవర్ఫుల్ పోలీసు ఆఫీసర్ రోల్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. నటిగా సరస్వతితోపాటు ధీరమ్ అనే మలయాళం సినిమాలో నటిస్తున్నారు. రిజానా ఎ కేజ్డ్ బర్డ్‌తో హాలీవుడ్ పరిచయం కాబోతున్నారు.

# చారిత్రక యోధుడు



పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ ఎపిక్ స్వయంభు టీజర్ బుధవారం విడుదలైంది. యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ఈ చిత్రంలో క్రీస్తు శకం 985 కాలానికి చెందిన యోధుడిగా దర్శనమివ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అద్భుతమైన సెట్స్, యుద్ధ వాతావరణం, గుర్రాలపై దూసుకెళ్తున్న సైనిక దళాలు, కత్తి యుద్ధాలతో టీజర్ మొత్తం ఒక విజువల్ స్పెక్టకిల్‌లా కనిపిస్తోంది. 3డీ ఫార్మాట్‌లో సిద్ధమైన ఈ టీజర్‌లో యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. ముఖ్యంగా నిఖిల్ మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యుద్ధ విన్యాసాలు సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ పీరియాడికల్ యాక్షన్ ప్రాజెక్ట్‌కు భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతోంది. హీరోయిన్‌లుగా సంయుక్త మీనన్, నభా నటేష్ నటిస్తున్నారు. సంయుక్త యోధురాలిగా కనిపిస్తుండగా, నభా పటేల్ రాణి పాత్రలో కనువిందు చేస్తోంది.

**అందుకే ఆలస్యమైంది : నిఖిల్**

సినిమా ఆలస్యమవడానికి వీఎఫ్ఎక్స్ కారణం. ఇది మాకున్న సమస్య మాత్రమే కాదు. ఈ రోజుల్లో ఒక్క సీన్ పర్ఫెక్ట్ లేకపోయినా ప్రేక్షకులు క్షమించడం లేదు. వీఎఫ్ఎక్స్‌లో జరిగే ఒక్క తప్పు స్నో బాల్ ఎఫెక్ట్ సినిమాను చుట్టేస్తుంది. ఇటీవల కాలంలో పోస్ట్ ప్రొడక్షన్ అనేది అటు నిర్మాత, ఇటు నిర్మాణ సంస్థ చేతుల్లో ఉండటం లేదు. అందరూ హిట్ సినిమానే కోరుకుంటారు. ఇటీవల కొన్ని సినిమాల్లో సీజీ షాట్స్ సరిగా చేసుకోకపోవడం వల్ల ఎంతో నష్టం జరిగింది. ఇందులో 2 వేలకు పైగా సీజీ షాట్స్ ఉన్నాయి. ఇక మూవీ ఆలస్యమవడానికి అనేక ఏకు తీశామన్నది ప్రేక్షకులు చూడరు. ఎంత బాగా తీసామన్నదీ చూస్తారు. ఒక చిన్న గ్రామంలో పుట్టిన యువకుడు యోధుడిలా ఎలా మారాడన్నదే స్వయంభు కథ. ఒక ప్రేమకథను జూబ్లీహిల్స్ బ్యాక్రాప్లోనూ తీయొచ్చు. టైటానిక్ షిప్లోనూ తీయొచ్చు. స్వయంభు కథ భారీదనంతో కూడుకున్నది. అందుకే ఆలస్యమైంది. ఈ సినిమాను 3డీలోనూ విడుదల చేస్తున్నాం. ప్రభాస్, తారక్, చరణ్, వంటివారు కథ కోసం ఏళ్ల పాటు పనిచేశారు. వాళ్ల నుంచే నేను స్ఫూర్తి పొందాను. ఈ కథను నమ్మాను. ప్రస్తుతం నేను చేస్తున్న ఇండియా మూవీ 30శాతం షూటింగ్ పూర్తయింది. ఈ ఏడాది చివరిలో కార్తికేయ3 మొదలవుతుంది.. అని నిఖిల్, సినీబృంద సభ్యులు సినిమా గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

## తొలిసారి కెమెరా ముందు..

**చందమామ కథ లాంటి అనుభూతి పొందా**



తను నటించిన తొలి సినిమా పునాదిరాళ్లు కోసం మొదటిసారిగా కెమెరా ముందుకు వచ్చిన మెగాస్టార్ చిరంజీవి తన అనుభవాన్ని ఎక్స్ వేదికగా పంచుకుని భావోద్వేగానికి గురయ్యారు. '1978 ఫిబ్రవరి 11న మొదటిసారి కెమెరా ముందుకు వచ్చా. ఈరోజు పునాదిరాళ్లు సినిమా కోసం జీవితంలో తొలిసారి కెమెరా ముందు నిలిచిన రోజు. ఆరోజు నాలో కలిగిన ఆత్రుత, ఆనందం, బాధ్యత, భావోద్వేగం మాటల్లో వర్ణించలేనిది. ఆ క్షణం ఇప్పటికీ నిన్న, మొన్న జరిగిందేమో అన్నట్టు అనిపిస్తుంది. ఒక అందమైన చందమామ కథ లాంటి అనుభూతి.

ఈ ప్రత్యేక సందర్భంలో, నాకు ఆ తొలి అవకాశం ఇచ్చిన ఆ చిత్ర దర్శక, నిర్మాతలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వారి నమ్మకం, ప్రోత్సాహంతో వచ్చిన అవకాశంతో నటనలో నా ప్రయాణానికి పునాది రాళ్లు పడ్డాయి. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ నన్ను ఆదరిస్తూ, ఆశీర్వదిస్తున్న ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతల్లు అని చిరంజీవి పేర్కొన్నారు.



## హే భగవాన్ నవ్వించే చిత్రం

లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై హే భగవాన్ అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ చిత్రంలో సుహాస్, శివానీ నగరం, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి ప్రముఖ పాత్రల్ని పోషించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో దర్శకుడు గోపీ అచ్చర చిత్ర విశేషాలు తెలియజేశారు.

# మెంటల్ మాస్ మ్యాచ్

## 2 సూపర్ ఓవర్లు.. అఫ్ఘాన్- దక్షిణాఫ్రికా మధ్య ఉత్కంఠపోరు



**న్యూఢిల్లీ:** అసలు సిసలు టీ20 మజా చూపిన మ్యాచ్ దక్షిణాఫ్రికా ఆఫ్ఘనిస్తాన్ మధ్య సాగిన రెండు సూపర్ ఓవర్ల పోరు. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 187 పరుగుల వద్ద స్కోర్ సమం కాగా సూపర్ ఓవర్‌కు దారి తీసింది. అక్కడా స్కోర్ సమమే అయింది. దీంతో రెండో సూపర్ ఓవర్ ఆడాల్సొచ్చింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లల్లో 6 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. స్కోరు 12 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఓపెనర్ ఎయిడెన్ మార్క్ రమ్ అవుట్ అయ్యాడు. మరో ఓపెనర్ క్వింటన్ డికాక్, టాప్ ఆర్డర్ బ్యాటర్ రియాని రికెల్టన్ (59), (61) చెలరేగారు. వీరిద్దరూ అవుట్ అయ్యాక డెవాల్డ్ బ్రెవిస్ 23, డేవిడ్ మిల్లర్ 20 (నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ 1, మార్కో జెన్ 16 పరుగుల చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ కూడా తడబడింది. ఓపెనర్ రహ్మతుల్లా గుర్బాజ్ ఒక్కడే (84)పోరాడాడు. డార్విష్ రసూలీ 15, అజ్మతుల్లా ఒమర్జాయ్ 22, మహ్మద్ నబీ 5, రషీద్ ఖాన్ 20, నూర్ అహ్మద్ 15 పరుగులు చేశారు. చివరి ఓవర్‌లో గెలవడానికి 13 పరుగులు చేయాల్సిన దశలో ఆఫ్ఘన్ గెలుపు ఖాయమనుకుంటుండగా, రబడ మెరుపు వేగంతో చేసిన రనౌట్‌కు నూర్ అహ్మద్ రనౌట్‌తో స్కోర్ సమమైంది. ఇది సూపర్ ఓవర్‌కు దారి తీసింది. సూపర్‌ఓవర్ లో ఆఫ్ఘనిస్తాన్‌కు 17 పరుగులు లభించాయి. గెలవడానికి 18 పరుగులు చేయాల్సిన దశలో 17 పరుగులొచ్చాయి. స్కోర్ మళ్లీ సమమైంది. దీంతో మరో సూపర్ ఓవర్ వేయాల్సి వచ్చింది. ఈ సారి దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌కు దిగింది. ఆఫ్ఘనిస్తాన్ గెవడానికి 24 పరుగులు అవసరం అయ్యాయి. అయితే ఆఫ్ఘన్ ఇన్నింగ్ కు 19 పరుగుల వద్ద తెరపడింది.

# టి20 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా ఘన విజయం

## 67 రన్స్ తేడాతో ఐర్లాండ్ ఓటమి



**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. 67 పరుగుల తేడాతో ఐర్లాండ్ పై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 16.5 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌట్ అయింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్ (17 బంతుల్లో 37), మార్కస్ స్టోయినిస్ (29 బంతుల్లో 45), మాట్ రెన్‌షా (33 బంతుల్లో 37) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. దూకుడుగా ఆడిన కామెరూన్ గ్రీన్ (21, 11 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. ట్రావిస్ హెడ్ (6), గ్లెన్ మాక్స్‌వెల్ (9) విఫలమయ్యారు. కూపర్ కొన్నోలీ (11), బార్డ్‌లెట్ (11) పరుగులు చేశారు. దీంతో ఆస్ట్రేలియా, ఐర్లాండ్ ముందు 183 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ రెండు వికెట్లు, మాథ్యూ హంఫ్రీస్, జార్జ్ డాక్రెల్, హ్యారీ టెక్టర్ తలో వికెట్ తీశారు. 183 పరుగుల లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి ఐరిష్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆ జట్టు 16.5 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌట్ అయింది. జార్జ్ డాక్రెల్ (41) ఒక్కడే కాస్త పోరాటపటిమ చూపాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్పిన్నర్ ఆడమ్ జంపా, పేసర్ నాథన్ ఎల్లిస్ చెరో 4 వికెట్లు తీసి ఐర్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చారు. వీరిద్దరూ కలిసి కేవలం 35 పరుగులిచ్చి 8 వికెట్లు పంచుకుని ఆస్ట్రేలియాకు సునాయాస విజయాన్ని అందించారు.

## దుబాయ్ పారా అథ్లెటిక్స్‌లో

# సుమిత్, రింకూ, భాగ్యశ్రీలకు స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** దుబాయ్ పారా అథ్లెటిక్స్-2026, గ్రాండ్ ప్రిక్స్‌లో భారత్ అథ్లెట్లు సుమిత్ అంటిల్, రింకూ హుడా, భాగ్యశ్రీ జాదవ్ వేర్వేరు విభాగాల్లో స్వర్ణ పతకాలను సాధించారు. ఈ గ్రాండ్ ప్రిక్స్‌లో పురుషుల ఎఫ్42/44/64 జావెలిన్ త్రోలో భారతదేశానికి రెండుసార్లు పారాలింపిక్ ఛాంపియన్ సుమిత్ అంటిల్ బంగారు పతకాన్ని సాధించాడు. ఆంటిల్ తన మూడవ ప్రయత్నంలో 68.26 మీటర్లు దూకి రెండవ స్థానంలో నిలిచిన సక్కప్పన్ గురుబాస్కరసే (53.66 మీ) కంటే ముందు 14.6 మీటర్లు పూర్తి చేసి తన అత్యుత్తమ ప్రయత్నాన్ని నమోదు చేశాడు. ఈ ఈవెంట్‌లో రామ్ పూన్యా




50.48 మీటర్లతో కాంస్యం గెలుచుకుని భారత్ తరపున పోడియం స్వీప్ చేశాడు. అలాగే రింకు హుడా పురుషుల జావెలిన్ ఎఫ్46 బంగారు పతకాన్ని 59.46 ఉత్తమ త్రోతో గెలుచుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో భారత్‌కు చెందిన రంజిత్ చందా 52.72 మీటర్లతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. మరో చోట, భాగ్యశ్రీ జాదవ్ మహిళల జావెలిన్ ఎఫ్33/34లో 14.13 మీటర్లతో బంగారు పతకాన్ని గెలుచుకుంది. మహిళల డిస్కస్ త్రో ఎఫ్57లో షర్మిల 21.75 మీటర్లతో కాంస్యం గెలుచుకోగా, మహిళల జావెలిన్ ఎఫ్54/55/56లో ఫాతిమా ఖాటూ 15.94 మీటర్లతో కాంస్యం గెలుచుకుంది. పురుషుల జావెలిన్ ఎఫ్5357 విభాగంలో దీపేష్ కుమార్ 28.53 మీటర్ల దూరం విసిరి కాంస్య పతకం సాధించి భారత్ ఖాతాలో చేరాడు.




## టి20 వరల్డ్ కప్ 24 గంటల్లో..

# నలుగురు స్టార్స్ ఔట్

### టీమిండియా నుండి అభిషేక్

### వివిధ జట్లకు షాక్

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతున్న వేళ, వివిధ జట్లకు ఆటగాళ్ల గాయాల బెడద కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రస్తుతం వరల్డ్ కప్, రౌండ్1 పోటీలు ముగుస్తున్న తరుణంలో జట్లకు ఊహించని ఎదురుదెబ్బలు తగిలాయి. కేవలం 24 గంటల వ్యవధిలోనే నలుగురు స్టార్ ఆటగాళ్లు టోర్నీ నుంచి నిష్క్రమించడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కివీస్ స్టార్ మైకేల్ బ్రేస్‌వెల్ మొదలుకొని, శ్రీలంక స్పిన్ మాంత్రికుడు వానిందు హసరంగ వరకు వరుస గాయాలతో జట్లుకు షాక్ ఇచ్చాయి.

న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ మైకేల్ బ్రేస్‌వెల్ గాయంతో టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఆఫ్ఘనిస్తాన్‌తో మ్యాచ్‌కు ముందు ఆయనకు ఈ గాయమైంది. ఆయన స్థానంలో కోల్ మెక్‌కాన్చీని జట్టులోకి తీసుకున్నారు. శ్రీలంక స్పిన్ మాంత్రికుడు వానిందు హసరంగకు హ్యామ్‌స్ట్రింగ్ గాయమైంది. ఐర్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించిన హసరంగ, ఆ తర్వాత గాయం కారణంగా తప్పుకోవాల్సి వచ్చింది. ఆయన స్థానంలో దుషన్ హేమంత జట్టులోకి వచ్చారు. అలాగే అమెరికా ఫాస్ట్ బౌలర్ జస్‌దీప్ సింగ్ మ్యాచ్‌లో డైవింగ్ క్యాచ్ పట్టబోయి భుజానికి తీవ్ర గాయం చేసుకున్నాడు. దీంతో ఆయన కూడా వరల్డ్ కప్ నుంచి నిష్క్రమించారు. ఆయన స్థానంలో పాక్ మాజీ బౌలర్ ఎహ్సాన్ ఆదిల్ యూఎస్ఏ జట్టులో చేరారు. యుఎఇ జట్టులో మహమ్మద్ జోహైబ్ క్రమశిక్షణా రాహిత్యం వల్ల టోర్నీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. యూఏఈ క్రికెట్ బోర్డు ఈయనను తక్షణమే ఇంటికి పంపేసింది. న్యూజిలాండ్, శ్రీలంక జట్లకు గట్టి దెబ్బన్యూజిలాండ్ ఇప్పటికే రెండు విజయాలతో దూసుకుపోతున్నా, బ్రేస్‌వెల్ వంటి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ లేకపోవడం ఆ జట్టుకు లోటే. 2023 వన్డే వరల్డ్ కప్ సమయంలోనూ బ్రేస్‌వెల్ గాయంతో దూరమవ్వడం గమనార్హం. మరోవైపు, శ్రీలంకకు హసరంగ మెయిన్ వెపన్. ఆయన లేకపోతే స్పిన్ విభాగం బలహీనపడే అవకాశం ఉంది. ఇక భారత్ జట్టులో కీలక ప్లేయర్ పరిస్థితి టీ 20కి దూరమయ్యాడు. టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ పెట్ ఇన్ఫెక్షన్‌తో ఆస్పత్రి పాలవ్వడం క్రికెట్ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్..

# స్వర్ణంతో మెరిసిన ప్రాచీ

**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్, జూనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ ఈవెంట్‌లో భారత క్రీడాకారిణి ప్రాచి గైక్వాడ్ స్వర్ణం సాధించింది. అర్హత రౌండ్‌లో 586 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచిన గైక్వాడ్, ఫైనల్‌లో కూడా అదే జోరును కొనసాగించి 353.3 స్కోరుతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అనుష్క థోకూర్ 341.1 పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. భారత్ తరపున ఆమె డబుల్ పోడియంను సాధించింది. అలాగే మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ లో ప్రముఖ క్రీడాకారిణి అంజుమ్ మోద్గిల్‌ను ఓడించిన ఆకృతి దహియా రజత పతకాన్ని గెలుచుకుంది. దహియా ఫైనల్‌లో మొత్తం 354.2 పాయింట్లు సాధించి తన తొలిఅంతర్జాతీయ పత కాన్ని, మోద్గిల్ 340.4 పాయింట్లు సాధించి కాంస్యం గెలుచుకుంది మరియు ఆతిథ్య జట్టుకు డబుల్ పోడియంను పూర్తిచేసింది. అదే సమయంలో, కజకిస్తా న్‌కు చెందిన సోఫియా షుల్జెంకో ప్రపంచ రికార్డు స్కోరు 358.2తో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఫైనల్‌లో మరో భారతీయురాలు ఆషి చౌక్సే 330.9 తో నాల్గవ స్థానంలో నిలిచింది. అంతకుముందు మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ క్వాలిఫికే షన్ రౌండ్‌లో మోద్గిల్ 587 స్కోరుతో అత్యధిక ర్యాంక్ పొందిన భారతీయురాలిగా నిలిచింది.



## గూగుల్ మాతృసంస్థ 100యేళ్ల బాండ్ల జారీ

# 24 గంటల్లోనే రూ.2.6 లక్షలకోట్లు సమీకరణ




**వాషింగ్టన్, ఫిబ్రవరి 11:** గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ ఇంక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తన ఆధిపత్యాన్ని నిలబెటుకునేందుకు భారీ ప్రణాళికతో ముందుకొచ్చింది. సుమారు 32 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 2.6 లక్షల కోట్లు) నిధులను కేవలం 24 గంటల్లోనే బాండ్ల రూపంలో సమీకరించింది. ఇందులో భాగంగా 100 ఏళ్ల కాలపరిమితితో సెంచరీ బాండ్ జారీ చేయడం టెక్ ప్రపంచంలో సంచలనంగా మారింది. ఈనెల 9, 10 తేదీల్లో ఆల్ఫాబెట్ ఈ భారీ రుణ సమీకరణను పూర్తి చేసింది. అమెరికా మార్కెట్లో 20 బిలియన్ డాలర్లు, బ్రిటన్ మార్కెట్లో 5.5 బిలియన్ పౌండ్లు (సుమారు 7.53 బిలియన్ డాలర్లు), స్విస్ మార్కెట్లో 3.055 బిలియన్ ఫ్రాంకుల రూపంలో బాండ్లను విక్రయించింది. ముఖ్యంగా, బ్రిటన్‌లో జారీ చేసిన బాండ్లలో ఒక బిలియన్ పౌండ్ల విలువైన 100 ఏళ్ల సెంచరీ బాండ్ కూడా ఉంది. 1990ల తర్వాత ఒక పెద్ద టెక్ కంపెనీ ఇలాంటి సుదీర్ఘకాలిక బాండ్‌ను జారీ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఏఐ రంగంలో పెరుగుతున్న పోటీని తట్టుకుని, తన జెమినీ మోడల్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత విస్తరించడమే లక్ష్యంగా ఆల్ఫాబెట్ ఈ నిధులను సమీకరించింది. 2026 సంవత్సరంలో సుమారు 185 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం (క్యాపెక్స్) చేయాలని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ నిధులను ప్రధానంగా ఏఐ సామర్థ్యాలను పెంచేందుకు, కొత్త డేటా సెంటర్ల నిర్మాణానికి ఉపయోగించనుంది. ఆల్ఫాబెట్ బాండ్లకు ఇన్వెస్టర్ల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది.


అమెరికా డాలర్ బాండ్ల కోసం ఏకంగా 100 బిలియన్ డాలర్లకు పైగా ఆర్డర్లు రాగా, 100 ఏళ్ల బాండ్‌కు కూడా దాదాపు 10 రెట్ల డిమాండ్ కనిపించింది. సాధారణంగా ప్రభుత్వాలు లేదా స్థిరమైన ఆదాయం ఉండే యుటిలిటీ కంపెనీలు మాత్రమే వందేళ్ల బాండ్లను జారీ చేస్తాయి. ఇప్పుడు టెక్ కంపెనీకి కూడా ఇన్వెస్టర్లు అంతటి విశ్వాసాన్ని చూపడం ఏఐపై వారికున్న దీర్ఘకాలిక నమ్మకాన్ని సూచిస్తోంది. ఈ భారీ రుణ సమీకరణతో ఆల్ఫాబెట్ తన భవిష్యత్తును పూర్తిగా ఏఐపైనే పందెం కాస్తోందన్న బలమైన సంకేతాన్ని మార్కెట్లకు పంపింది.

# అశోక్ లేలాండ్ నికరలాభం రూ.862.24కోట్లు




**ముంబయి, ఫిబ్రవరి 11:** వాణిజ్యవాహన తయారీ సంస్థ అశోక్ లేల్యాండ్ బుధవారం తన మూడోత్రైమాసిక ఫలితాల్లో నికరలాభం 5.19శాతం పెరిగినట్లు ప్రకటించింది. నికరలాభం రూ.862.24 కోట్లు ఆర్జించినట్లు వెల్లడించింది.గత ఏడాది ఇదే కాలంలో 819.67 కోట్లు ఆర్జించిన కంపెనీ ఈసారి పెంచు కోగలిగింది. కార్యకలాపాల ద్వారా రాబడులు మూడోత్రైమాసికంలో రూ.14,830.24 కోట్లుగా ఉంది. అదే గత ఏడాది ఇదేకాలంలో రూ.11,995.21 కోట్లు ఆర్జించినట్లు కంపెని వివరించింది. మొత్తం ఈ త్రైమాసికంలో ఖర్చులు కొంతమేర పెరిగాయి. 10,937.89 కోట్లనుంచి రూ.13,490.15 కోట్లకు పెరిగాయి. మధ్య తరహా హెవీవాణిజ్య వాహనాలు 32,929 విక్రయించినట్లు తెలిపింది. తేలికపాటి వాణిజ్యవాహనాల్లో కూడా 20,518యూనిట్లు విక్రయించామని,అదే గతఏడాది ఇదేకాలంలో 15,754 మాత్రమే విక్ర యించినట్లు తెలిపింది. ఎగుమతులు కూడా 4151యూనిట్లనుంచవ 4965యూనిట్లకు పెరిగాయి. అం టే 20శాతం పెరిగినట్లు తేలింది.కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ధీరజ్ హిందూజా మాట్లాడుతూ మా ఉత్పత్తివృద్ధికి సమాంతరంగానే అమ్మకాలుకూడా పెరిగాయని, లాభదాయకతతోపాటు పోటీతత్వాన్ని అధిగమించగలిగామని అన్నారు. కస్టమర్ విలువలకు అత్యంత ప్రాధాన్య తనిస్తామని ఆయన అన్నారు. ఎంహెచ్‌సివి, ఎల్సీవీ కేటగిరీల్లోను, డిఫెన్స్ కేటగిరీలోను సుస్థిరవృద్ధిని నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

# మహీంద్ర అండ్ మహీంద్ర నికరలాభం 47% పెరుగుదల




**ముంబయి, ఫిబ్రవరి 11:**మహీంద్ర అండ్ మహీం ద్ర కంపెనీ మూడో త్రైమాసికంలో నికరలాభాల్లో 47శాతం పెంచుకో గలిగింది. రూ.4675కోట్లు ఆర్జించినట్లు తెలిపింది. రాబడులు కూడా రూ.52,100 కోట్లకు పెరిగి 26శాతం వృద్ధిని నమోదుచేసాయి. కొత్త లేబర్‌కోడ్‌ల వల్ల వచ్చిన ప్రభావంతో 565కోట్లు భారంపడింది. ఈ మొత్తం మినహాయిస్తే నికరలాభం 54శాతం పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. ఎస్‌యువిల్లో నంబర్‌వన్‌గా మార్కెట్ వాటాతో ఉనన మహీంద్ర 24.1శాతం వృద్ధితో ఉంది. తేలికపాటి వాణిజ్య వాహనాల్లో అంటే 3.5 టన్నుల లోపు ఉన్నవాటి మార్కెట్ వాటా 51.9శాతంగా ఉంది. ట్రాక్టర్లలో మొత్తం మార్కెట్‌లో 44శాతం వాటాతో ఉన్నట్లు వెల్లడించింది. త్రీవీలర్లలోకూడా మహీంద్ర 38.,6శాతం మార్కెట్‌షేరు సాధించింది. ఇక ఎంఅండ్ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ నికరలాభం 97శాతంగా ఉంది. టెక్ మహీంద్ర రాబడులు ఎబిటా ప్రకారంచూస్తే 13.1శాతంగా ఉంది. మహీంద్ర లాజిస్టిక్స్‌కు మొట్టమొదటి లాభదాయకమైన త్రైమాసికంగా నిలిచింది. 11 త్రైమాసికాల్లో మహీంద్ర లైఫ్ స్పేసెస్ పరంగా ఐదురెట్లు నికరలాభం వృద్ధిచెందింది. ఈ ఏడాది ఎస్‌యువిలు, ఎస్వీఈల్లో కొత్త అంతర్ కంబస్టన్ ఇంజిన్ వాహనాలు తెస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ త్రైమాసికంలో కంపెనీ వాహనాలు 3.02 లక్షలయూనిట్లుగా ఉన్నాయి. ఆటో విభాగంలోకూడా 30శాతంపెరిగి 30,370 కోట్లు ఆర్జించింది. నికరలాభం 42శాతంపెరిగి 1993 కోట్లుగా ఉంది. బ్యాటరీ ఈవీ బిజినెస్‌లలో కూడా ఆరుశాతం రాబడులున్నాయి. ఎబిడిటా ఈ త్రైమాసికంలో 102 కోట్లు తగ్గిందని తెలిపింది. వ్యవసాయం పరంగా 23శాతం పెరిగి 1.50 లక్షల యూనిట్లు ట్రాక్టర్లు విక్రయించింది. రాబడులు 11,510రాబడులతోపాటు నికరలాభం 1044కోట్లుగా ఉంది.

# మూడోరోజూ లాభాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

### స్మాల్, మిడ్‌క్యాప్ షేర్ల రాణింపు




**ముంబయి, ఫిబ్రవరి 11:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా లాభాలతో ముగిశాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో కొన్ని కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో సూచీలు లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 208 పాయింట్లు లాభపడి 84,065 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 67 పాయింట్లు పెరిగి 25,935 వద్ద ముగిసింది. ప్రధాన సూచీలతో పోలిస్తే స్మాల్ మిడ్‌క్యాప్ మార్కెట్లు మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.49 శాతం, ఎన్ఎస్ఈ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.38 శాతం చొప్పున లాభపడ్డాయి. ముఖ్యంగా, మైక్రోక్యాప్ కంపెనీల షేర్లకు మంచి డిమాండ్ కనిపించింది. డిసెంబర్ త్రైమాసికంలో బలమైన ఫలితాల నేపథ్యంలో నిఫ్టీ మైక్రోక్యాప్ 250 సూచీ ఏకంగా 1 శాతం పెరిగింది. విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లు కొనసాగించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న ఆశలు మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతు నిచ్చాయి.

ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ట్రేడ్ అయ్యాయి. నిఫ్టీ మీడియా 2.40 శాతంతో అత్యధికంగా లాభపడగా, నిఫ్టీ ఆటో 1.37 శాతం పెరిగింది. మంగళవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.23 శాతం బలపడి 90.52 వద్ద ముగిసింది. అయితే, నిఫ్టీ బ్యాంక్ సూచీ మాత్రం 42.95 పాయింట్లు స్వల్పంగా నష్టపోయి 60,626.40 వద్ద స్థిరపడింది. కమోడిటీ మార్కెట్‌లోబ్రెంట్ ముడి చమురు ఏప్రిల్ సెటిల్‌మెంట్‌నాటికి 93 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 69.73 డాలర్లుగా నిలిచింది. బిఎస్ఇలో 1913 షేర్లుపెరిగితే 2316 కంపెనీలు క్షీణించాయి. 162 కంపెనీలు స్థిరంగా కొనసాగాయి. టిసిఎస్ 2.51శాతం క్షీణించింది. ఇన్ఫోసిస్ 1.75శాతం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.54శాతం వంటివి క్షీణించి నిఫ్టీపై ఒత్తిడిని పెంచాయి.

# పెండింగ్‌లో 24.64 లక్షల ఐటిఆర్‌లు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:**ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలుచేసి రీఫండ్‌కోరుతున్న ఐటిఆర్‌లు 90 రోజులు దాటి పెండింగ్‌లో ఉన్నాయని, ఇటువంటివి 24.64లక్షల వరకూ ఉన్నట్లు పార్లమెంటుకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చైదరి వివరించారు. 8.80 కోట్ల రిటర్నులు దాఖలయ్యాయని వీటిలో 24,64,044 రిటర్నులు ప్రాసెస్ కావాల్సి ఉందని, మూడునెలలకుపైగా పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. జాప్యం జరిగినంతమాత్రాన వ్యక్తులు, సంస్థల ఐటిఆర్‌లలో లోపాలున్నట్లు కాదని, ప్రాసెసింగ్ కాలవ్యవధి ఆయా రిటర్నుల పరిధిని బట్టి మారుతుంటుందని మంత్రి తెలిపారు. పన్నులశాఖలో వర్క్‌లోడు పెరగడం వంటివి కీలకంఅవుతాయన్నారు. అత్యధికశాతం పన్ను చెల్లింపుదారులు తమ ఐటిఆర్‌లను మార్పులు,చేర్పులు, సవరణలుచేసి పంపించడం వల్లకూడా రీఫండ్ జాప్యానికి కారణం అవుతుంది.ఇప్పటివరకూ 1.11 కోట్ల రివైజ్‌చేసిన రిటర్నులు దాఖలయ్యాయని, అదనపు పన్నులు రూపంలో రూ.6976.5కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మొత్తం రాబడులు 8810.59 కోట్లుగా ఉందన్నారు. పన్నుచెల్లింపుదారులు తమస్థాయిని వెబ్‌సైట్‌లో చెక్‌చేసుకోవాలని, నోటీసులు, ఇతర సందేశాలకు తక్షణమే స్పందించాలని,బ్యాంకువివరాలు కరెక్టుగా ఉండాలని ఆదాయపు పన్నుశాఖ చెపుతోంది.

# డాలర్ వర్సెస్ రూపాయి 90.70



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** డాలరుతో రూపాయి మారకం విలువలు 14 పైసలు క్షీణించి 90.70 వద్ద చెలామణి అయింది. దిగుమతి దారుల నుంచి డాలర డిమాండ్, భౌగోళిక ఉద్రిక్తతలు కూడా ఇందుకు కారణం అయినట్లు ఫోరెక్స్ ట్రేడర్లు చెపుతున్నారు. ముడిచమురు ధరలు పెరుగుదలకూడా పెరగడంతో చెల్లింపులన్నింటికీ డాలర్ ప్రామాణికం కావడంతో డాలర్ బలపడి రూపాయి క్షీణించింది. అయితే ఎఫ్‌పిఐ నిధుల రాక కొంతమేర రూపీ క్షీణతను కట్టడిచేసిందనే చెప్పాలి. ఇంటర్‌బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి మార్కెట్‌లో రూపాయి మారకం 90.56వద్ద ప్రారంభం అయింది. కనిష్టంగా 90.75వరకూ కూడా వెళ్లింది. గరిష్టంగా 90.46గా ట్రేడ్ అయింది. చివరకు రూ.90.70వద్ద మారకం ట్రేడింగ్‌ముగిసింది. అమెరికా మార్కెట్‌లోని రిటైల్‌సేల్స్ డేటా, వ్యవసాయేతర ఉపాధి గణాంకాలు దెబ్బతినడంతో డాలర్ కొంతమేర క్షీణించింది. ఫోరెక్స్ ట్రేడర్ల వివరాలనుచూస్తే ఇండో యుఎస్ ట్రేడ్‌డీల్ స్వాగతించదగినదని, శ్వేతసౌధం ఫ్యాక్ట్‌షీట్ విడుదలచేసిన తర్వాతనే మళ్లీ ఆందోళనలు పెరగడంతో డాలర్ కొంతమేర క్షీణించిందన్నారు. బ్రెంట్‌ముడిచమురు కూడా బ్యారెల్‌కు 69.78గా ట్రేడ్ అయింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో రూ.69.45 కోట్లు పెట్టుబడులుపెట్టారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.